నవశక్తి

Vol. 1, no. 38

(Sept. 14, 1938)

బెజవాడ, 1938

Navaśakti

Vol. 1, no. 38

(Sept. 14, 1938)

Bejavāḍa, 1938

Record no. 682

మహాత్ముడు-క్రిమినల్ లా బిల్లు


Regd. No. M

నవశక్తి

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పత్రిక

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 1 | బుధవారము | 14-9-38 | బెజవాడ | సంచిక 38



నేడు చైనాలో కమ్యూనిస్టులు, జాతీయ వాదులు, కలిసి జపానుకు వ్యతిరేకంగా పోరాడు తున్నారు. కాని పూర్వం జంగ్-కై-షేక్ కమ్యూనిస్టులను ఘోరంగా బాధించాడు.

కమ్యూనిస్టు నాయకుడగు మా-సి-యంగ్‌ను పట్టుకొంటే 250,000 షిల్లింగులు ఇస్తానని ప్రకటించాడు. మా-సి-యంగ్, చూ-టే సహాయంతో, తన సైన్యాలను 7 వేల మైళ్ళ పైగా నడిపించాడు. ఈలోగా జాతీయ ప్రభుత్వ సైన్యాలు విమానాలతో, మెషిన్ గనులతో వెంటాడినయి. కాని చిట్ట చివరకు షెన్సీ రాష్ట్రంలో కమ్యూనిస్టులు నివాస మేర్పరుచుకొని ప్రభుత్వం స్థాపించారు. ఈ చిత్రం వివిధ ప్రదేశాలలో కమ్యూనిస్టులు పడ్డ బాధల తెల్పు తున్నది. దేశ క్షేమాన్ని దృష్టించి జాతీయ వాదులొనర్చిన ద్రోహాన్ని మరచి, పగను మాని, జపాను సేనల నెదిరించు చున్న నేటి చైనా కమ్యూనిస్టులు నిజంగా అభినందనీయులు.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధసంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

* * *

అడ్వర్టైజుమెంటు రేటులు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు) కాలంలో 1" మొదలు 20" వరకు ప్రతి అంగుళానికి రూ. 0—6—0

20" — 100" వరకు ..	0—4—0
100" పైగా ..	0—3—0
పాతిక పేజీకి	3—0—0
సగము పేజీకి	6—0—0
ఒక పేజీ మొదలు 15 పేజీల వరకు పేజీ ఒకటికి	10—0—0
15 పేజీలకు పైగా పేజీ 1కి	7—8—0

ఈ వరకు అంగీకరించిన కంట్రాక్టులకు ఈ రేట్లు వర్తించవు.

ఈ రేట్లలో కన్సెషన్సు, కమిషన్సు ఏమీ ఉండవు.

* * *

చందాదారులను చేర్పించాలి:

సెప్టెంబర్‌లో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"లు పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజా సామ్యవాదులు పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీ సభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తి చేస్తారని నమ్ముతున్నాం.

సెప్టెంబర్ నెల మొదటి వారంలో

	కోటా	చేర్పించినది
విశాఖపట్టణము	10	0
తూ. గోదావరి	75	2
ప. గోదావరి	90	19
కృష్ణా జిల్లా	100	22
గుంటూరు	60	3
నెల్లూరు	50	1
రాయలసీమ	10	1
ఇతరస్థలాలు	5	2
	400	50

త్రిలోచన కవిరాజు

రవీంద్రనాథ మైత్రగారి కథలకు అనువాదం.

—అనువాదకుడు చక్రపాణి.

వెల 0—6—0.

యువ కార్యాలయం.

తెనాలి.

"ప్రభ"

మార్క్సిస్టు హిందీ మాసపత్రిక. భారతదేశమందలి సుప్రసిద్ధ కమ్యూనిస్టులు, సోషలిస్టులు వ్యాసాలు వ్రాస్తున్నారు. హిందీ వచ్చిన ప్రతి వ్యక్తి చదువవలసిన పత్రిక.

సం॥ చందా 1—8—0.

విడి ప్రతి 0—2—0.

మేనేజరు "ప్రభ"

బైర్‌హనా, అలహాబాదు.

లక్ష్మీ ప్రావిడెంటు ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్ మచిలీపట్టణము.

మా పట్టాదారులకు, ఏజంట్లకు ఆకర్షణీయమగు

కొన్ని ప్రత్యేక సదుపాయములు.

1. రు 50 లు మొదలు, రు 500 లు, వరకు భీమాచేయుటకు వీలగునట్లు. ప్రావిడెంటు ఇన్సూరెన్సు ప్రణాళికలు గలవు.
2. వైద్య పరీక్షతోను, లేకుండగను, భీమాచేయుట కవకాశము యేర్పరుప బడినవి.
3. కార్మికులకు, కర్షకులకు, పిల్లలకు, పెద్దలకు, ఉద్యోగులకు, గొప్పవారికి వీలగునట్లు పర్మనెంటు ఫండు డిపాజిట్లు గలవు.
4. పాలసీదారులు, ఏజంట్లు, పరిపాలనలో పాల్గొనుటకుగాను రెండు స్థానములు ప్రత్యేకింపబడినవి.
5. ఏజంట్లకు వంశపారంపర్య కమీషను పద్ధతులు గలవు.
6. కంపెనీ వ్యాపారము మితవ్యయముతో నిర్వహించబడును, తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడును.

కమీషను పద్ధతి మీదగాని, జీతముమీదగాని పనిచేయుటకు అన్ని ప్రాంతములకు ఏజంట్లు ఆర్గనైజర్లు కావలెను.

వివరములకు—మేనేజింగు డైరెక్టరు పేర కంపెనీకి వ్రాయుడు.

పైల్‌సాల్ ఔషధము, క్యూరాల్ లేబొరేటరి

(రిజిష్టర్డు)

బెంగుళూరు సిటీ వారి, ఆస్తినిస్సి తయారగుచూ ఉయి వున్నది.

పెద్ద బుడ్డీ వెల రు. 5—0—0. అర్థ బుడ్డీ రు. 2—12—0. పోస్టేజి ప్రత్యేకము.

KUREAL LABORATORY (REGD) PILESOL BANGALORE CITY

పైల్‌సాల్

మలల జాడ్యమునకు శస్త్రము లేకనే పూర్తిగా నయమగును. గొప్ప, గొప్ప డాక్టరుల వలన ఆస్పత్రులలో మెప్పు బడసి వాడబడుచున్నది. బ్రిటిషు గవర్నమెంటు వారి వలన హిందూదేశములోను, ప్రపంచ మంతటకును రిజిష్టరు చేయబడిన ఔషధము. పైల్‌సాల్, విలువ గల, పై పూత ఔషధము. ఇది లోపల, వెలుపల, మలల రయినను, రక్తము, చీము కారుట, ఎంత తక్కువ, ఎక్కువ జబ్బులను వెంటనే కుదుర్చును.

పైల్‌సాల్ మందు చల్లగా వుండును. ఆసనమందు వ్రేలాడు, అశుద్ధ రక్త నాశములు, మందు పూత వలననే పైకి పోవును, ఆసనమందు, జిల, మంటలను వెంటనే ఆపును. పైల్‌సాల్: సుఖ విరేచనము కలుగజేయును. ఉపయోగించు విధానము ఔషధముతో పంపబడును. అనేక యోగ్యతా పత్రములు బడసి యున్నది.

వలయువారు యీ దిగువ విలాసమునకు వ్రాయుడు.

ది మెడికల్ హాల్—గుంటూరు.

IF you want to understand the greatest experiment in the Human History being carried on in Soviet Russia—

IF you want to build up the New Civilzation—

You should read the Socialist Literature!

You can get them cheaply in the Socialist Literature Publishing House - Agra!

Become our subcribers and get our books each for one anna only!

1.	State	Lenin	0-2-0
2.	Communist manifesto	Karl Marx	0-4-0
3.	Address to the Communist League	Karl Marx	0-2-0
4.	State and Revolution	Lenin	0-12-0
5.	Victory of Socialism in Russia	Stalin	0-2-0
6.	On the People's Front	Dimitrov	0-2-0
7.	Congress and Comminism.		
8.	Wage-labour and Capital.		0-4-0

THE

Socialist Literature Publishing House

AGRA.

చలంచర్ల నారాయణ మూర్తి గారి

ఫొటో మార్కు

విష్ణాంజనం

అన్ని నొప్పులకు, దెబ్బలకు, మూలవ్యాధులకు, బొబ్బకాళ్లకు, కాల్పులకు, నయకులకు, తేలు, జెర్రి మొదలగు విష జంతువుల కాట్లకు, పంట్ల బాధలకు, చెవులో చీము, రక్తమునకు దివ్యామృతం.

★ అన్ని షాపులయందు దొరకును.
★ ప్రతి టవునుకు యేజంట్లు కావలెను.
★ వివరములకు నేడే వ్రాయండి.

మొదటి రకం అగరువత్తులు, సెంట్లు, హైరాయిల్సు, పునుగు, జవ్వాది, కస్తూరి, జున్ను, గోరోజనం, పచ్చకర్పూరం మొదలగు పరిమళ ద్రవ్యములన్నియు దొరకును.

విష్ణాంజనం డిపో, రాజమంత్రి.

శగవ్యాధిని మొదలంట నివారించునదేది?

శెగవ్యాధి కిప్పుడునవి అనేక ఔషధము లున్నప్పటికిని ఆది వ్యాధిని మొదలంత నివారించు క్రిమి సంహారకములుగ లేవు. శెగవ్యాధిని మొదలంట నివారించి తిరిగి రాకుండ కాపాడుటకు దివ్యమైన ఔషధముగ "సుధాచంద్రిక"ను నిర్ణయించిరి. దీనిని సేవించిన వెంటనే మంట తగ్గి, పుండు మాని, డిశ్చార్జి అగుట, మూత్రము ధారాళముగ రాకుండుట నిలచి, ఎక్కువ సుఖము నిచ్చును. చిరకాలము నుండి యున్న శగరోగములకు కూడ ఈ మందు ధాతువుల యందు ప్రవేశించి అక్కడ యుండు దోషమును పోగొట్టి వ్యాధిని కుదుర్చును. సీసా. రు. 2-0-0.

అన్నిచోట్ల అమ్మబడును.

లేక

క్షీరసముద్రం ఫార్మసీ, రాజమండ్రి.

మంచి తరుణము

కుట్టు పనివారలకు మాత్రమే:

కంబైండ్ స్పోర్టింగు సూటు. నవీన పద్ధతులలో శాస్త్రోక్తముగా కత్తిరించు విధానము.

"The Tailors' Practical Cutter"

"టైలర్సు ప్రాక్టికల్ కట్టరు"

వెల 0—8—0 మాత్రమే.

3 కాపీలు ఆర్డరు యిచ్చువారికి పోస్టు కర్చులు లేవు:

వలయువారు:—

జి. యస్. నారాయణ

జంట్సు టైలరు,

భీమవరం, పశ్చిమ గోదావరి.

కాశ్మీర్ సంస్థాన

ప్రజా ఉద్యమపు వెల్లువ గట్లు తెగి ప్రవహిస్తోంది.

తిరువాన్కూర్ దివాన్ సమర్థన—హైద్రాబాద్ కాంగ్రెస్ పై నిషేధం—కాశ్మీర్ ప్రజా పోరాటం.

కాశ్మీర్

మహమ్మద్ అక్బర్ అను ఆయనకు రాజద్రోహం క్రింద 10 సంవత్సరాల శిక్ష విధింపబడినది. హైకోర్టు అప్పీలులో క్రింది కోర్టు వాదన మాత్రం ఆమోదిస్తూ శిక్షను మాత్రం $1\frac{1}{2}$ సంవత్సరములకు మార్చిరి.

ప్రభుత్వపు ఈ చర్యపట్ల అసమ్మతిని తెలుపుతూ బహిరంగ సభలు, ప్రదర్శనాలు, హర్తాళులు ఏర్పాటు చేయబడినవి. ఇందుపై రాజకీయ స్వభావంగల ఏ సభలుగాని, ప్రదర్శనాలుగాని జరుపకూడదని ప్రభుత్వం నిషేధించింది.

ఆగస్టు 29 వ తేదీని యీ నిషేధాజ్ఞను 7 గురు ఉల్లంఘించారు. అందులో కాశ్మీరు శాసనసభా సభ్యులు మహమ్మద్ గులాం మహమ్మదు, సాదిక్ మహమ్మదులు కూడా వున్నారు. వారినందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. మిలిటరీ కాంటోన్మెంటు గార్డురూమ్‌లో విచారణ జరిపింది. ఆరునెలలు శిక్ష, 25 రూపాయలు జరిమానా విధించింది. శ్రీనగరంలో 29 వ తేదీని హర్తాళ్ జరిగింది. ప్రభుత్వ చర్యను ఖండిస్తూ ఊరేగింపులు జరిగాయి. మాటిమాటికీ ప్రజలను పోలీసులు చెదరగొట్టసాగారు. సాయంత్రం అయేసరికి శ్రీనగర్‌లో అన్ని ప్రాంతాలలోనూ హర్తాళ పూర్తిగా జరిగింది.

ఈ హర్తాళలో విద్యార్థులు, ప్రభుత్వపు శిల్కు ఫ్యాక్టరీ కార్మికులు చాలామంది పాల్గొన్నారు. అందరూ కలసి ఒక పెద్ద ఊరేగింపు పెద్ద బహిరంగ సభ జరిపారు. ఘోరమైన లాఠీచార్జిచేసి ప్రజలను పోలీసులు చెదరగొట్టారు.

అనేకచోట్ల ప్రజలు రౌడీజము చూపుచున్నారనే వార్తలు ప్రకటించి ప్రభుత్వం మిలిటరీని సిద్ధంగా వుంచింది.

సెప్టెంబరు మూడవ తేదీని కాశ్మీర ప్రభుత్వం వీటిని గూర్చి ఒక ప్రకటన చేసింది. "సెప్టెంబరు 1వ తేదీని 2 అరెస్టులు మాత్రమే జరిగాయి. ఆగస్టు 31వ తేదీని మాత్రం 47 అరెస్టులు సాగినవి"

కాశ్మీర సంస్థానం నుండి ప్రభుత్వ ప్రకటనలు తప్ప ఇతర వార్తలు వచ్చుట లేదు.

సెప్టెంబరు 1వ తేదీని 500 మంది ప్రజలు ఊరేగింపును సాగించారు. తరువాత సభ జరిగినది. సభను ఆపుచేయ వలసినదని ప్రజలను ప్రభుత్వ అధికారులు కోరిరట. ప్రజలు నిరాకరించారు. అందుపై, ప్రభుత్వాధికారులు లాఠీ ఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. లాఠీఛార్జీ మాత్రం అతి "నాజూకుగాను, మెల్లిగాను, చేశారట. 18 మందిని మాత్రమే అరెస్టు చేశారట."

బాలమూర జిల్లాలో రెండు ప్రాంతాలలో అక్రమ సంఘాలని ప్రకటించి రెండు సమావేశాలను చెదరగొట్టారు. 10 మందిని అరెస్టు చేశారు.

"జమ్మూ రాష్ట్రం అంతా నిశ్చలంగానే వుందిట. కాని కేంద్రంలో మాత్రం అలజడి ఎక్కువగా వుందిట. కొన్ని ఊరేగింపులు మాత్రం జరిపారట, ఉపన్యాసాలు కూడ కొన్ని జరిగినవట. మొత్తం 7 గురిని మాత్రం అరెస్టు చేశారట." లాఠీఛార్జీ చేశారో లేదో; ప్రకటనలో మాత్రం లేదు. చెప్పడానికి వీలు లేనట్లుగానే లాఠీఛార్జీ చేశారో, లేక అక్కడ ప్రజా వాహినిని చూచి ఊరకొనక తప్పింది గాదో; ఏదో ఒకటి జరిగే ఉండాలి. లేకపోతే, 7 గురిని మాత్రం అరెస్టు చేసి ఊరుకొనే స్వభావం సంస్థాన ప్రభుత్వాల కెక్కడుంటుంది? బళ్ళవాళ్ళ సమ్మె హర్తాళు కూడా విరమింపబడ్డాయని ప్రభుత్వ ప్రకటన. ప్రభుత్వపు బలవంతమునకు ఆగలేక నేమో!

కాశ్మీర మహమ్మదీయ కాన్ఫరెన్సు అధ్యక్షులు అయిన చౌదరీ గులాం బాస్ గారు ఒక ప్రకటన చేశారు. "వచ్చే శాసన సభా సమావేశంలో మహమ్మదీయు లెవరునూ పాల్గొనవద్దని తన పార్టీ సభ్యుల కందరకూ తెలియజేశారట."

ఒక వంక సంస్థాన ప్రభువుతో ప్రజలు పోరాటాన్ని సాగిస్తున్నారు. వేరొక వంక ప్రభుత్వంవారి నందరిని నిర్బంధ విధానానికి గురి చేస్తోంది. యీ పరిస్థితులలో మధ్య యీ ప్రకటన, మహమ్మదీయు లెవరూ పాల్గొనరాదని, కాశ్మీర సంస్థానంలో ఈ పోరాటంలో అన్ని మతాలవారూ కూడా సంస్థానాధీశుడితో ప్రజా హక్కులకై పోరాడు చున్నారు. యీ సందర్భంలో ఒక మత సంస్థ పేరుతో ఒక ప్రకటన తయారయితే, ప్రజలలో కుల తత్వదృక్పథాన్ని కల్పించి, ప్రభువుతో జరిగే పోరాటాన్ని మత కలహం క్రింద మార్చేటందుకు యిట్టి స్టేట్‌మెంట్లు పనికి వస్తాయి. ఈ విధంగా మహా రాజాకు వ్యతిరేకంగా జరిగే పోరాటం పెడదారిని పడితే ఇది హానికరం.

కాశ్మీర ప్రజల కోర్కెలు.

1. ప్రస్తుత రాజ్యాంగ విధానాన్ని మార్పు చేసి దాని స్థానే బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయబడ వలయును.

2. ప్రభుత్వపు పాత బుణాలు, సైన్యం, విదేశ వ్యవహారాలు, ధర్మార్థ నిధి గాక, మిగిలిన విషయాలలో ప్రభుత్వపు ఆదాయ వ్యయాలపై హక్కు ప్రజా ప్రతి నిధుల కుండాలి.

3. మహా రాజాగారు చేసే ఖర్చుకు ఒక గరిష్ట నియమం (fixed maxmum limit) ఉండాలి.

4. ఎన్నికలు సార్వ జనిక ఓటింగు విధానాన్ని (18 సంవత్సరాల వయస్సు వచ్చిన ప్రతి వారికి ఓటు చేసె హక్కు) ఉండాలి.

5. వాక్కు, పత్రికా, సభ మొదలగు స్వాతంత్ర్యము ఉండాలి-జాయింటు ఎలెక్టొరేట్లుండాలి. ఇలాంటివి మొత్తం 8 కోర్కెలు ప్రభుత్వానికి పంపబడినవి.

జమ్మూ.

"ఎవరూ పేరూ ఊరూ లేని వాని నాయకత్వం క్రింద 100 గురు ఊరేగింపు సాగించారట. నాయకుడిని అరెస్టు చేసి మిగతా వారిని చెదరగొట్టారట." అనుచరులకే నా తెలియకుండా అపరిచిత వ్యక్తి ఊరేగింపును సాగిస్తాడనడం తెలివి తక్కువ. అతని గొప్పతనాన్ని ప్రభుత్వం అంగీకరించక పోయినా అతనిని ప్రభుత్వం అరెస్టు చేయడమే అతని గొప్పతనము తెలియ జేస్తుంది.

గాందేర్ బల్,

ఊరేగింపు జరిగింది. లాఠీఛార్జి యథావిధిగానే జరిగింది. 4 గురు అరెస్టు కూడా చేయబడ్డారు. మొత్తం ఇక్కడ, 5వ తేదీని 78 మంది ఖైదు చేయబడ్డారు,

శ్రీనగరంలో కూడా ఊరేగింపులు జరుగుతున్నాయి. లాఠీఛార్జీలు సదేసరి. ఒక రైతుకు 2వ తేదీని లాఠీచార్జిలో తలమీద దెబ్బ తగిలి మరణించాడు. చచ్చిపోవలసి నంత గట్టి దెబ్బకాదని ప్రభుత్వాధికారులు చెపుతున్నారు. ఆయినా ఆతని శవాన్ని మాత్రం ఊరేగింపులో శ్మశానానికి 3వ తేదీని తీసుకుపోయారు ప్రజలు.

బందీపూరు మొదలగు ప్రాంతాలలో ఊరేగింపులూ లాఠీఛార్జీలు పరిపాటి అయిపోయాయి. ప్రజలు రౌడీజమును చూపుతున్నారనే పుకార్లను ప్రభుత్వం ప్రకటిస్తోంది. ప్రభుత్వం కాల్పులను ప్రారంభించుటకు ఆధారాలను ఈ విధంగా ఏర్పాటు చేసుకొంటున్నారు.

నీలగిరి

సత్యాగ్రహం ఆగిపోయింది,

నీలగిరి ప్రజామండలి 31 షరతులను కోరింది. అందులో 17 అంగీకరించ బడ్డాయి. 18 ని వదలివేసారు. బాధ్యతాయుత ప్రభుత్వం. చేతీ, (నిర్బంధ సేవ) రద్దు చేయుట, ప్రభుత్వ ధనంపై అధికారం మొదలగు ముఖ్యమైనవి ప్రభుత్వం అంగీకరించ లేదు. వీటి విషయమై తాను కలుగజేసు కొంటానని బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి తెలియజేసిన మీదట సత్యాగ్రహం విరమింప బడినది. ప్రభుత్వం రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేసింది,

1929 లో బీహారు ఒరిస్సా ప్రభుత్వం నిర్బంధ సేవను రద్దుచేయుట కంగీకరించలేదు. ఆ విషయాలను మార్చు సందర్భంలో బ్రిటిష్ ఏజంటుకే అధికారం ఉందన్నారు.

తిరువాన్కూరు.

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెస్ తరపున జరిగే బహిరంగ సభలు తాత్కాలికంగా ఆపుచేశారు. ప్రజాశక్తిని కట్టుబాటు చేసి, వారిచేతనే పోరాటాన్ని సాగించాలి గాని దానిని తగ్గింపు చేయుట నాయకత్వము యొక్క బాధ్యత్వం కాదు. ప్రభుత్వపు నిర్బంధ విధానం తీవ్రంగా సాగుతూనే ఉన్నది. ఉన్నవారు చాలక కొత్తగా పోలీసులను చేర్చుకొనుచున్న ప్రభుత్వ ప్రకటనలలోని అసత్యాలు ఒక్కటొక్కటే బయటపడు చున్నవి. తిరువాన్కూరు బీచ్ వద్ద జరిగిన సంఘటన విషయమై ప్రభుత్వ ప్రకటనలో ఎన్నో అబద్ధాలున్నాయని ఆనాటి సభలో ఉపన్యసించిన వారు ప్రకటన నొకదానిని చేశారు.

తిరువాన్కూరు దివాన్‌కు గాంధీగారి సమాధానం.

"తిరువాన్కూరును గూర్చి పత్రికలలో పడే వార్తలన్నీ చూస్తున్నాను. తిరువాన్కూరు దురంతాలను దివాన్ సమర్థించినట్లు, పంజాబు దురంతాలను బ్రిటిషు ప్రభుత్వంకూడ సమర్థింపలేదు. ఆ డయ్యరుకు పట్టిన దుర్గతి ఈయనకూ కలుగవచ్చు. తిరువాన్కూరు ప్రభుత్వ ప్రకటనలు శాసనోల్లంఘన సందర్భంలో బ్రిటిషు ప్రభుత్వపు ప్రకటనలకు నకలు వలె నున్నాయి.

కొత్త మిలిటరీ తెప్పించి నిర్బంధ విధానం సాగించే కంటే వాక్కు, పత్రికా, సమావేశ స్వాతంత్ర్యాలను కల్పించి, విచారణ ఏర్పాటు చేయిస్తే బాగుంటుంది. కాంగ్రెసు వారు పనికి రాకపోతే, శ్రీనివాస శాస్త్రిగారి వంటి వారినైనా నియమించ వచ్చును."

స్టేట్ కాంగ్రెసు నాయకులు ప్రభుత్వముతో స్టేట్ సేనాని ద్వారా రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని, దివాన్‌గారు గాంధీగారికి వ్రాసిన లేఖలో పేర్కొన్నారు. అటువంటి దేమియు జరుగలేదు. అల్లెప్పిటికిని వీలులేదు. "బహిరంగ సభలను అంతటా ఆపుచేయలేదు. అల్లెప్పీలో మాత్రమే, అది కూడా తాత్కాలికంగానే ఆపుచేయ బడినవి," అని స్టేట్ కాంగ్రెసు అధ్యక్షులు ప్రకటించారు.

దివాన్‌గారి పెంకితనం

గాంధీగారు చెప్పినవి సరిగాదని కొన్ని విషయాలపై మహాత్మాజీని ఎత్తిపొడుస్తూ చెప్పి రదకు "గాంధీగారి సలహాను తిరువాన్కూరు ప్రభుత్వం అవలంబింప జాలదు" సంస్థానాల విషయంలో తటస్థంగా వుంటానన్న కాంగ్రెసు తన తీర్మానాన్ని ఆచరణలో పెట్టకపోతే శాంతి నెలకొల్పడం కష్టం. ఏ పరిస్థితిలోనూ కూడ, పైవారెంత దీశాలుతైనా ఈ బాధ్యత అంతా సంస్థాన ప్రభుత్వానిదీ కాని పైవారి కేమీ సంబంధం లేదు," అని సెలవిచ్చారు.

తిరువాన్కూరు ప్రభుత్వపు చర్యలను ఖండిస్తూ దేశమందన్ని ప్రాంతాలలో బహిరంగ సభలు జరిగాయి.

హైదరాబాదు

హైదరాబాద్‌లో అసలు స్టేట్ కాంగ్రెసే ఏర్పడుటకు వీలులేదనీ అది మత వైషమ్యాలపై ఆధారపడి ఏర్పడుతోందనియు, మత ద్వేషాన్ని పురికొల్పుతోందనియూ స్టేట్ కాంగ్రెసును స్థాపించుటకు ఏర్పాటు చేయబడిన సభనే నిషేధించారు.

యీ ప్రకటన నిరాధారమైన దని స్టేట్ కాంగ్రెసు నాయకులు ఖండిస్తూ ఒక ప్రకటన చేశారు.

సంస్థాన వ్యవహారాలలో కాంగ్రెసు తటస్థంగా ఉంటే ప్రజలను అణచివేయడం అతి సులభం అని తిరువాన్కూరు దివాన్ అంటున్నాడు. యీ పరిస్థితులలో భారతీయ లందరి స్వాతంత్ర్యానికి పని చేయదలచుకొన్న కాంగ్రెసు మహాసభ, తన తాటస్థ్యమును వదలి సంస్థానాలలో ప్రజా ఉద్యమాల లేవదీయ డానికి, పూనుకోవాలి. దీనితోనే పర పరిపాలన కూడా రద్దు అయేయావకాశం మనకు కలుగుతుంది.

స్వదేశ సంస్థానాలు రద్దు కావాలి.

సామ్రాజ్యవాదులను అనుమానాస్పదం చేయుంది



14—9—38 బుధవారం

మహాత్ముడు—క్రిమినల్ లా అమెండుమెంటు బిల్లు

అతడు మహాత్ముడు! మౌనవ్రతం పూనినాడు. ఒక జ్యోతి అవతరించింది. అంతరాత్మ ప్రబోధించింది. ఏమని? "పికెటింగులో హింస ప్రబలుచున్నది" అని. దానితో అనాడు ఒక వ్యాసం వ్రాశాడు గాంధిజీ.

"కాంగ్రెసు వాదులకు హెచ్చరిక" అంటూ ఇపుడు మరొక వ్యాసం హరిజన్‌లో ప్రచురింపబడింది. దీనికి జ్యోతి గన్పించుట కాదు కారణం. అంతరాత్మ ప్రబోధించుటా గాదు. "అపరాధములు! ఘోరాపరాధములు!! మద్రాసు ప్రధాని భయంకరాపరాధములు!!!" అంటూ, మహాత్మునికి లేఖలు, టెలిగ్రాములు వర్షించడమే.

మహాత్ముని వ్యాస సారాంశ మేమిటి? రాజాజీ వంటి సుశిక్షిత సైనికుడు లేడు. సత్యాగ్రహి లేడు. సేనా నాయకుని (గాంధిజీ) ఆజ్ఞ అయినచో, ప్రధానామాత్య పదవిని కాల దన్న కలడు.

కాని గాంధిజీ తాను వ్యక్తిగతంగా రాజాజీపై పెత్తనం చెలాయించుటకు ఇష్టపడుట లేదు. మంచిదే. కాంగ్రెసు మహా సభయే అన్నిటి కన్న ముఖ్యము. దానికే అందరునూ లోబడవలెను.

కాని మహాత్మునికి విన్నవించుకొన్నది ఎందుకు? మహాత్మునివంటి "మహాత్మునకు" 'మొక్కవోని సత్యాగ్రహి' రాజాజీ చేయు 'ఘోర అపరాధాలను' తెలియ జేయుటకే.

మహాత్ముడు రాజాజీని సమర్ధించుచు ఇంకా ఇలా చెప్పాడు. "ఆయన తెలివి తేటల్లో, ధీమాలో, కనీసం కాంగ్రెసువారిలో పార్లమెంటేరియన్‌గా సామర్ధ్యంలో, నాకు అంతులేని విశ్వాసం ఉంది."

రాజాజీ పండితుడే—మేధావియే, అపర చాణక్యుడే. కాదని ఎవ్వరూ అనుటలేదు. కాని ఆయన కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను ఎంతవరకు అమలుపరచుచున్నాడు? కాంగ్రెసు ప్రతిష్టను ఎంతవరకు పైకి లాగుచున్నాడు? ఎంతవరకు గంగలో కలుపుచున్నాడు? ఇవియే ప్రశ్నలు. దానికి మహాత్ముడు జవాబు చెప్పకయుండలేదు.

"రాజాజీ కాన్‌స్టిట్యూషనల్ పోరాటం అనే అగాధంలోకి పోతున్నాడనుకోవడం పొరపాటు. డాబు, దర్పాలు లేకుండా పరివర్తనతో, ధృఢ నిశ్చయంతో సత్యాగ్రహి విజయాలు పొందటంలో తప్పు లేదు."

ఇంతటితో మహాత్మ డూరుకోలేదు. విమర్శకుల మీద ఒక్క విసురు విసిరారు. "ఈ విమర్శకులకు విషయాలను తెలిసికొనని బద్ధకమో, చాల తొందరపాటో కలదని నా కంప్లైంటు."

మొదట విషయాలను బాగా పరిశీలించి తర్వాత మొరపెట్టండని మహాత్ముని వాగన.

విషయాల కేం కొదువ? మన మద్రాసు ప్రధాని, చేసిన మంచి పనులను అలా వుంచితే, అతడు చేసిన "ఘోరాపరాధాల" క్రిందకు ఇవి వస్తాయి.

రెడ్డి నాయుడు ప్రభుత్వం విధించిన కొత్త పట్టణంపై నిషేధం తొలగించలేదు. బాట్లీవాలాను రాజ ద్రోహం క్రింద అరెస్టు చేశాడు. ఇది వరకు నిషేధింపబడిన గ్రంధాలు కొన్నిటిపై నిషేధం తొలగించినా, ఇంకా కొన్ని గ్రంధాలపై నిషేధం తొలగించ లేదు. సోషలిస్టు గ్రంధాలపై నిషేధం తొలగించ లేదు. పోనీయండి. "గాంధిగారి రాజనీతి మంజరి"పై నిషేధం ఎందుకు తొలగించ లేదు? ఈ గ్రంధంలోని విషయాలా మహాత్ముని సుభాషితాలు. ఆ గ్రంధంపై నిషేధం తొలగించ కుండ యున్నవారా మహాత్మునిచే నిజమైన సత్యాగ్రహి యని సర్టిఫికెట్ పొందిన దక్షిణాది గాంధి రాజాజీ! ఎంత విచిత్రం? ఎంత అవమాన కరం? పోనీ ఇంతటితో ఆగినాడా 'సత్యాన్వేషణ పరాయణుడు రాజాజీ'? లేదు. రష్యా విప్లవం, సీతారామరాజు చరిత్రలను క్రొత్తగా నిషేధించాడు. ఇక నాల్గవ విషయం ప్రజా సేవకుల వెంబటి సి. ఐ. డి. లు. వారిని తొలగించ లేదు సరి కదా వారి దౌర్జన్యం మితి మీరు తున్నది. జయ ప్రకాశ నారాయన్ వంటి సుప్రసిద్ధ కాంగ్రెసు వాదికి ఈ రాష్ట్రంలో సి. ఐ. డి. ల నిఘా తప్ప లేదు. నేడు నెల్లూరు నుండి మాకు వచ్చిన వార్తలు మరీ ఘోరంగా ఉన్నాయి. ఒక అఖిల భారత కాంగ్రెసు సభ్యుని వెంట పోలీసుల నిఘాయేగాక, ప్రతి ఉపన్యాసం ఒక షార్టు హాండ్ రిపోర్టర్ వ్రాసి కొంటున్నాడు. పైగా ఆ గ్రామాలలో పోలీసులు ప్రజలను ఆయనకు భోజనం పెట్ట వద్దని ప్రచారం చేస్తున్నారు. ఇది చూస్తే ఇవి సత్యాగ్రహ దినాలా? ఇవి కాంగ్రెస్ అధికారంలో ఉన్న రోజులేనా? అని అనిపిస్తుంది. ఇదిగాక చీరాల కాల్పులను సమర్ధించుట, రాష్ట్ర కాంగ్రెసు సంఘంకూడ ఖండించుట అందరెరిగినదే. ఇంత కన్న చెప్పదగిన విషయాలు మహాత్మునికి ఏమి కావాలి? రాజాజీ క్రిమినల్ లా అమెండు మెంటు బిల్లును ఉపయోగించుట రద్దు పరుప నిరాకరించుట చివరి విషయం. ఇదియేనా "గవర్నర్లను కాంగ్రెసు మంత్రులు బలవంతంగా ఒప్పించుట. పరివర్తన చేయుట?" ఇదియేనా "ఒక సత్యం తప్ప మరేదీ గాకుండా సత్యంతోనే సత్యము కొరకు పోరాడటం?"

హిందీ అలజడిని మే మేమాత్రం హర్షించం. ఈ వంక బెట్టుకొని జాతీయ విద్రోహుల చేయుచున్న కుట్రను తీవ్రంగా అణచాలనే మా అభిప్రాయం. పికెటింగు పేరిట దుర్భాషలాడే వారిని శిక్షించక ముద్దు పెట్టుకొనుడని మా అభిప్రాయం కాదు. శిక్షించండి. కాని క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టుతో గాదు. సాధారణ చట్టాల క్రింద.

"తొందర పడకండి" అంటాడు మహాత్ముడు. చేయి గాలిన వెనుక ఆకులకై వెదికితే లాభం ఏమిటి? క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టు సి.పి.రాష్ట్రంలో రద్దు చేయబడింది. సరిహద్దులో గవర్నర్ అడ్డు వచ్చాడు. ఇక్కడ మన ప్రధాని ఉపయోగించాడు. మనం తొందరపడకూడదట! ఇలాంటప్పుడు తొందర పనికిరాకపోతే జరిగిం దేమిటి? ఢిల్లీలో క్రిమినల్ లా అమెండు ఆక్టును ఉపయోగించినందుకు అసెంబ్లీలో అసమ్మతి చూపాలని అసఫ్ ఆలీ తలంచాడు. కాని కమీషనర్ రాజాజీని ఉదాహరణ తెస్తానని బెదరించితే చేయునది లేక అసఫాలీ మెదలక కూర్చున్నాడు. నేడు తిరువాన్కూరులో సి. పి. రామస్వామి అయ్యర్ రాజాజీని ఉదహరించుతాడనడానికి సందేహం లేదు. ఇలాంటప్పుడు కర్తవ్యం ఏమిటి? తొందరపడుతున్నారని తలంచక వెంటనే ఈచట్టాన్ని రద్దు చేయడం కాదా?

వల్లభభాయి పటేల్ గారు రెండు నెలల్లో దీన్ని రద్దు చేస్తామని పూర్వం అన్నారు. మహాత్ముడు క్రిమినల్ లా అమెండు ఆక్టు చదువలేదట. కాని రాజాజీ చెప్పిన మాటల ననుసరించిదానిలో "కాంగ్రెసును ఎదుర్కొనుచున్న కొత్త పరిస్థితులకు అనువయ్యే కొన్ని సెక్షన్లు ఉన్న"వట! మహాత్ముడే మరొకచోట "దేశ స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి ఒక నిరంకుశ వ్యక్తి బుద్ధిబలంతో సృష్టింపబడిన దీ పెనుభూతం. దానిలోని చెడ్డ క్లాజులను తొలగించకపోతే రాజాజీది గొప్ప తప్పు" అని అన్నాడు. దీని అర్ధం పూర్తిగా చట్టాన్ని రద్దుచేయడం కాదని స్పష్టంగా తెలుస్తున్నది.

క్రిమినల్ లా అమెండుమెంటును పూర్తిగా రద్దు చేయాలే గాని, కొంత రద్దు చేయడం భావ్యం గాదు. సత్యాగ్రహ దినాల్లో ఆర్డినెన్సుల రాజ్యంలో ప్రసాదించబడిన దీ బహుమానం అన్న మాట మనం మరచిపోరాదు. ఈ యాక్టులోనే "కొత్త పరిస్థితుల నెదుర్కొనడానికి కొన్ని క్లాజులు పనికివస్తే" అలాంటి పరిస్థితులు సి. పి. రామస్వామి అయ్యర్‌కూ ఉంటాయి. సర్ అక్బర్ హైదరీకీ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వానికీ ఉంటాయి.

క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టు పూర్తిగా రద్దయేంతవరకు మనం ఆందోళన చేయాలి. రేపు ఆలిండియా కాంగ్రెసు సభలోకూడా కాంగ్రెసు ప్రతిష్ట కోరే వారందరూ కోరవలసిన విషయమే అది. రాజాజీ యందలి మహాత్మునికి గల అంధ విశ్వాసంతో మనకు పనిలేదు. రాజాజీ సిన్సియారిటీతో మన కవసరం లేదు. మన ఎదుట ఉన్నది ఒక పెనుభూతం. ఆ భూతం సర్వ నాశనం కావడమే మన ఆశయం. అది నాశనం అయేవరకు మనకు నిద్రాహారా లుండరాదు.

క్రిమినల్ లాఅమెండు ఆక్టు నాశనం గావాలి!

నిర్బంధ చట్టాలు నశించాలి!

కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక నెరవేర్చాలి!

అర్ధ శాస్త్రం అంటే?

పెట్టుబడిదారుల అర్ధశాస్త్రానికీ మార్క్సు అర్ధశాస్త్రానికీ ఉన్న భేదం.

శ్రీ కె. సత్యనారాయణ, బి. ఏ. (ఆనర్సు) బి. యల్.

ప్రస్తుత ప్రపంచంలో ఏ దేశ పరిస్థితులు పరిశీలించి నప్పటికి మానవ సమాజముయొక్క సమస్యలు రోజు రోజుకు విషమిస్తున్నట్లు స్పష్టమగు తుంది. యుద్ధాలు, అంతర్యుద్ధాలు, ఒకటి తరువాత ఒకటి, విరామం లేకుండా క్రమేణా అన్ని దిక్కులనుంచి ప్రపంచాన్నంతా అల్లేస్తున్నాయి.

ప్రతి దేశములోను (ఒక్క రష్యా దేశము తప్ప) కార్మిక కర్షక సమ్మెలు, పోరాటములు ఎక్కువగు చున్నందువల్ల, ప్రజా సామాన్యము యొక్క అసంతృప్తి గూడ హెచ్చగుతున్నదని తెలుస్తుంది. పెట్టుబడిదారుల దోపిడి దారుణమైన కొలది కార్మిక వర్గముయొక్క అసంతృప్తి, చైతన్యం ఎక్కువయి, కార్మిక ఉద్యమం తలయెత్తి ముందుకు నడుస్తుంది.

ఈ ప్రజాసామాన్య అసంతృప్తితో సంబంధము కలిగిన ప్రస్తుత సమాజము యొక్క సమస్యలకు శాస్త్రవేత్తలు (Scientists) ముఖ్యముగా అర్ధశాస్త్రజ్ఞులు, (Economists) రాజకీయ వేత్తలు (Statesmen) యొక్క జవాబేమిటి?

కొన్ని వందల సంవత్సరముల నుంచి అభివృద్ధి చేయబడి నటువంటి వీరి శాస్త్రజ్ఞానం ఈ సమస్యలను పరిష్కరింప గలదా? లేని యెడల ఎందువల్ల? మానవ సమాజము యొక్క సమస్యలను పరిష్కరించి సమాజ అభివృద్ధికి తోడ్పడ లేని శాస్త్రములు (Sciences) నిజమైన శాస్త్రములా? నిజముగా ఆచరణలో పెట్టుటకు తోడ్పడు నటువంటి శాస్త్రమేమిటి? అను విషయములను అర్ధశాస్త్రమునకు సంబంధించి సంతవరకు, ఇప్పుడు తెలుసుకుందాం.

అర్ధశాస్త్రం (Political econmy or Econamics,) అనగా: మానవ సమాజములో, జీవించుటకు ప్రధానమైన భౌతిక అవసరముల యొక్క ఉత్పత్తి (Production) మారకములు ఎట్లు ఉండవలెనో తెలియజేయు సూత్రములతో కూడిన శాస్త్రమని చెప్పవచ్చును. ఈ సూత్రములను రెండు పద్ధతులలో పరిశీలింప వచ్చును.

1. ప్రత్యక్ష ఆచరణలో ఒక పరిమితి కాలములేక ఒక దశలో— ఉ॥ ఒక 100 సంవత్సరముల కాలము లేక బానిస దశలో, ఫ్యూడల్ దశలో, లేక పెట్టుబడిదారి విధానములో

2. ఉత్పత్తి సాధనములు మార్పుతో, ఆర్ధిక విధానములు గూడ మారుచుండుట వల్ల, ఒక ఆర్ధిక విధానము నశిస్తూ ఇంకొక ఆర్ధిక విధానమునకు ఎలా తావిస్తున్నదో, ఈ మార్పులు ఏలా జరుగుచున్నవో తెలియజేయు సూత్రములను పరిశీలించుట.

ఈ రెండు రకములైన సూత్రములను వేరు వేరుగా కొంతవరకు పరిశీలింప తగినప్పటికి, ప్రస్తుత పరిస్థితులను పూర్తిగా గ్రహించుటకు సమాజము యొక్క చారిత్రాత్మకాభి వృద్ధితో పాటు పరిశీలింపవలెను.

అర్ధశాస్త్రం, ప్రత్యక్ష మానవ సమాజములోని ఉత్పత్తి, మారకముల యొక్క సూత్రములను తెలియజేయు శాస్త్రము. కాని మానవ సమాజములో, ఈ రోజు వివిధ వర్గములున్నయి. కష్ట జీవులయిన కార్మిక, కర్షక వర్గాలున్నయి. ఇతరుల కష్టము, శ్రమమీద ఆధారపడి, దోపిడి చేస్తున్న, సోమరులతో కూడిన ధనిక వర్గము లేక పెట్టుబడిదారి వర్గమున్నది. కనుక, ఆచరణలో, ఈ వివిధ వర్గముల వారికి, అర్ధశాస్త్రము యొక్క అర్ధం, ఒకటిగా ఉండుటకు వీలులేదు.

ప్రస్తుత ఆర్ధిక విధానము యొక్క ప్రధాన సూత్రములే శాశ్వతమైనవని, క్రొత్త సూత్రముల మీద ఆధారపడు ఇంకే విధానము సమాజమునకు తోడ్పడునట్లు అమలు పరచుటకు వీల్లేదని, అధికారములో నున్న ధనిక వర్గము యొక్క దృక్పధం. స్వలాభమే మూలాదర్శముగా కల్గిన ఈ ధనిక వర్గమునకే ముప్పు వాటిల్లునోయను భయమే ఈ దృక్పధమునకు కారణం. లేనిచో, మానవాభి వృద్ధి యొక్క మూలసూత్రం, మార్పుయే (change) అని ఒప్పుకొన్న వీరికి, ఆ చరణలో, ఆర్ధిక విధానములో మార్పులను నిరోధించడం ఎందులకు?

రోజు రోజుకు మార్పు నొందుచున్న సమాజమునకు, ఆర్ధిక విధానములో గూడ మార్పులు కావాలి. పరిస్థితులు మారుచూ, వాటితోపాటు, ఆర్ధిక విధానములో మార్పు రాకపోతే, సమాజము అభివృద్ధి నొందకపోగా, క్లిష్ట పరిస్థితులలోకి వస్తుంది.

కాని, మార్పునకే మాత్రము ఇష్టపడని ధనిక వర్గం, వారిని బలపరచు శాస్త్రజ్ఞులు ప్రస్తుత సమాజ సమస్యలను నిష్పక్షపాత బుద్ధితో పరిశీలించలేరు. అందువలననే, వివిధ సమస్యలు మూలకారణములు తెలుసుకొనలేక, లెక్కలు, అంచనాలు (statistics) తయారుచేస్తూ, ఆర్ధిక విధానము నభివృద్ధి చేస్తున్నట్లు, సమాజమునకేమో లాభము కలిగిస్తున్నట్లు కనిపించుటకు ప్రయత్నిస్తున్నారు అర్ధ శాస్త్రజ్ఞులనబడే బూర్జువా అర్ధ శాస్త్రజ్ఞులు.

ఒకటిమటుకు గమనించాలి. అర్ధములేని ఈ లెక్కలకు, అంచనాలకు, ఆచరణలో ఒక్క ముఖ్యోద్దేశ్యం మటుకు కలదు. చెక్కు చెదరకుండా, ప్రస్తుత ఆర్ధిక విధానమును కాపాడుటయే.

కాని, పీడిత వర్గము యొక్క విధం వేరు. ముఖ్యముగా పెట్టుబడిదారి వర్గముచే నిర్మింపబడిన కార్మిక వర్గం యొక్క ఉద్దేశ్యము వేరుగా ఉంటుంది. పీడిత వర్గం యొక్క అర్ధశాస్త్రం, తొలిసారి, కారల్ మార్క్సు (Karl Marx)చే శాస్త్రీయముగా (Scientific) ప్రపంచమునకు తెలియజేయ బడినది.

మార్క్సిస్టు అర్ధశాస్త్రం ప్రస్తుత పెట్టుబడిదారి విధానమును పరిశీలించి, లోపాలను నిరూపిస్తుంది. ఈ పరిశీలన ఆధారము చేసుకొని, సమాజములోని వర్గ పోరాటము (class struggle) యొక్క స్వభావమును, పీడిత వర్గము ఏ విధముగా దోపిడి చేయబడుతున్నదో, ఆ దోపిడిని అరికట్టే విధానమును సూచిస్తుంది. ఇదే పీడిత వర్గము యొక్క అర్ధ శాస్త్రము యొక్క సారాంశము. ఈ శాస్త్రము యొక్క ఆశయం— పెట్టుబడిదారి విధానమువల్ల సమాజములో కల్గిన చెడు ఫలితములను అంతమొందించుటయే; అనగా, పెట్టుబడిదారి విధానమును నాశనం చేయుటయే.

పెట్టుబడిదారి విధానము వల్ల సమాజమునకు కల్గిన చెడుఫలితాలు బూర్జువా అర్ధశాస్త్రజ్ఞుల సూత్రముల, యొక్క అశాస్త్రీయ స్వభావము, ఈ రోజు (పూర్వము కంటె) అందరికి వెల్లడి అవుతున్నయి. 19వ శతాబ్దములో బయలుదేరిన మార్క్సిస్టు అర్ధశాస్త్రము లేక మార్క్సిజమునకు, ఇదంతా, తార్కాణము.

మానవుడిచే కనిపెట్టబడిన ఏ శాస్త్రము యొక్క గాని, ఏ సూత్రముల యొక్క గాని, ఉద్దేశ్యము, ఆశయము ఏమిటి? సమాజ అభివృద్ధి కొరకు ఆ శాస్త్రమును గాని, ఆ సూత్రములను గాని, ఆచరణలో, అమలు పరుచుటయే. పెట్టుబడిదారి విధానము యొక్క సూత్రములన్నీ, నిష్ప్రయోజన కరమని, సమాజయభివృద్ధికి ఏ మాత్రము లాభకరము కావని పెట్టుబడిదారి దేశములన్నిటిలోను రుజువైనది కాని పీడిత వర్గముయొక్క అర్ధశాస్త్ర మేమిటి?

వైరుధ్యము లన్నిటిని నాశనము చేసి దోపిడిని అరికట్టి, నిరుద్యోగాన్ని రద్దుచేసి, సమిష్టి పద్ధతుల మీద ఉత్పత్తి నభివద్ధి చేసి, సోవియట్ యూనియన్‌ను ప్రపంచంలో అన్ని దేశముల పీడిత వర్గములకు ఆశాజ్యోతిగా చేయుచున్న మార్క్సిస్టు అర్ధశాస్త్రము యొక్క సామాజిక స్వభావం గూడ రోజు రోజుకు వెల్లడి అగుచున్నది. అర్ధశాస్త్రం ఆచరణీయమై ఉండాలి. మార్క్సిజం యొక్క నిజ స్వభావం ఇదియే. సమాజ అభివృద్ధికి అనుకూలమైన మార్క్సిజం, ఇతర దేశములలో గూడ ఆచరణలో పెట్టతగిన విధానం.

సరిగా పరిశీలించినచో, సమాజములోని వర్గ పోరాటములే రాజకీయాలని (Politics) తేల్తుంది. ఈ వర్గ పోరాటముల యొక్క స్వభావం, ఎంత మరుగు పరచినప్పటికి, ఉత్పత్తి, పంపకముల యొక్క విధానము మీద ఆధారపడి యున్నది. కనుక రాజకీయమును, అర్ధశాస్త్ర సూత్రమును వేరు చేయడం, వర్గ పోరాటము యొక్క నిజ స్వభావమును మరుగు పరచుటకు, బూర్జువా అర్ధ శాస్త్రజ్ఞులు, రాజకీయ వేత్తలు, వేసే ఎత్తు.

నిజమైన అర్ధశాస్త్రం, రాజకీయ, అర్ధశాస్త్రం. రాజకీయములతో సంబంధములేని అర్ధ శాస్త్రమునకు, మోసమునకు భేదములేదు, ఇటువంటి అర్ధశాస్త్రము కల్గిన పెట్టుబడిదారి వర్గం, సమాజము యొక్క సమస్యలను ఎలా ఎదుర్కొన గలదు?

ఏ శాస్త్రమైనను ఆచరణీయమై ఉండాలి. ఆచరణీయమైన అర్ధశాస్త్రం, రాజకీయ అర్ధ శాస్త్రమే. (Political economy) లేక పీడిత వర్గము యొక్క అర్ధశాస్త్రం, లేక మార్క్సిజం.

పెట్టుబడి విధానమే శాశ్వత విధానమని, బూర్జువా శాస్త్రజ్ఞులు చెప్పారు. మార్క్సిజం ఏమి సూచిస్తున్నది? సమాజము యొక్క చరిత్ర చూస్తే, అనేక దశలు వికసమవుతయి. ఉత్పత్తి సాధనముల మార్పుతో, ఆర్ధిక విధానములు గూడ మార్పు పొందినయి, ఆ విధముగా సమాజములో ఆదికాలపు కమ్యూనిస్టు విధానం, తరువాత భూస్వామ్య విధానం, పెట్టుబడిదారీ విధానం, ఒకటి తరువాత అమలులోకి వచ్చినయి. ఈ విధానముల మార్పును పరిశీలించి మార్క్సు, పెట్టుబడిదారి విధానము గూర్చి సమాజము యొక్క చారిత్రకాభివృద్ధిలో ఒక మెట్టుఅని చెప్పాడు.

పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారి వర్గమునకు చివరదశలో గాదని, నూతన కార్మిక కర్షక శక్తులు బయలుదేరి, దోపిడిలేని వర్గ రహితమైన సామాజిక విధానమును (లేక సోషలిస్టు విధానమును) స్థాపించునని 19వ శతాబ్దములోనే మార్క్సు చెప్పాడు. సోవియట్ యూనియన్‌లో తార్కాణ మగుపడుతున్నది.

బూర్జ్వా అర్ధశాస్త్రజ్ఞులు, మార్క్సిజాన్ని ఒప్పుకోరు. పెట్టుదారి విధానమే శాశ్వతముగా ఉండతగిన విధానమని వీరి ఉద్దేశ్యము. ఎంతవరకు తగినదో, ఆయా దేశములలో జరిగే ఘోరములు చూస్తే, ఎవరికైనా అర్ధ మగుతుంది.

సప్తమ ఆంధ్రరాష్ట్ర రైతు మహా సభ

అధ్యక్షోపన్యాసము

(గత సంచిక తరువాయి.)

కాంగ్రెసు మంత్రులకు మనవి.

మేము మీ కార్యక్రమాన్ని బలపరుస్తు వారము. కాంగ్రెసు ప్రభుత్వములోనే మా కష్టములు కొంతవరకు తీరునని మా దృఢవిశ్వాసము. మద్యపాన నిషేధము వలన రాష్ట్రాదాయము తగ్గుటయు, మా పన్నులు తగ్గించుటకు రైతులకు సౌకర్యము లొనర్చుటకు మీకు గల బడ్జెట్టు యిబ్బందులను మేమును గుర్తించుచునే యున్నాము. కాని వాటిని వారసత్వపు పన్నులు, జమీన్‌దార్లకు ఆదాయపు పన్నులు, భోగవిలాస వస్తువులపై అధికపన్నులు విధించుట ద్వారా ప్రభుత్వ ఆదాయమును పెంపొందించుకొనుట ధర్మము. రైతులకు సంబంధించు శాసనములలోని రైతుల అభిప్రాయాన్ని, ప్రధానముగ గమనించ వలెననియే మాకోరిక.

కాంగ్రెసు శాసన సభ్యులకు హెచ్చరిక.

కాంగ్రెసు శాసన సభ్యులలోని అధిక సంఖ్యాక సభ్యులు తమ తమ నియోజకవర్గాలలో ప్రచారము గావించి, ప్రజల కష్టాలను తెలుసుకొని, తన్నివారణోపాయము కొరకు ప్రయత్నించుట లేదని ప్రజలభిప్రాయ పడుచున్నారు. మీలో అధిక సంఖ్యాకులు తక్కిన బాధ్యతలేని యితర పార్టీ శాసన సభ్యులవలెనే ప్రజల కష్టాలలో పాల్గొనక యే మంత్రులో వచ్చినప్పుడు దర్శన మిస్తున్నారు. ఈ నడవడిని పూర్తిగా మార్చుకొని ప్రజలలో ఐక్యమై, నియోజక వర్గములలో నిరంతరము సంచారము చేసి, మీరును, కాంగ్రెసు సంస్థలను గౌరవము తెచ్చుకోవాలి. మంత్రివర్గం చేయుచున్న ప్రతి చట్టానికి మీ నియోజకవర్గములలో సభలు జరిపి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొని మంత్రివర్గానికి తెలియపర్చు బాధ్యత మీయందే యున్నది.

ఇతర రాష్ట్రాలలో రైతుల పోరాటాలు.

భారత దేశమంత అన్నిచోట్ల రైతులు మేల్కొన్నారు. చైతన్యము పొందిన రైతుల నిర్మాణమైన అఖిల భారత కిసాను సభయే అఖిలభారత రైతాంగమునకు నాయకత్వము వహించి కర్షకుల కష్టాలెదుర్కొనుటకు నూతన సమాజమును నిర్మించుటకు దారి తీయుచున్నది రైతుసేవయే జీవితాశయముగా పెట్టుకున్న స్వామి సహజానంద సరస్వతి, ఆచార్య రంగాగార్లు, అధ్యక్ష కార్యదర్శులై కిసాను సభను నడుపుచున్నారు.

నేడు, స్వదేశ సంస్థానమగు మన్నాలో రైతుల్లు తమ శిస్తుల తగ్గింపు కొరకు షుమారు 6 మాసములు పోరాడి లాఠీఛార్జి, కాల్పులకు లోనయ్యూ, పట్టుదలను విడువక పోరాటమును సాగించి విజయమును పొందిరి. నీలగిరి లావెడ్, జయపూర్ మున్నగు స్వదేశ సంస్థానములలో కూడ రైతుల్లు పన్నుల తగ్గింపు కొరకు, వెట్టి చాకిరి రద్దుకొరకు పోరాడుచున్నారు.

బ్రిటీషు ఇండియాలో పంజాబు రైతుల్లు అమృతసరములో పూర్వపు నీటి పారుదల యేర్పాటులను మార్చినందులకు అక్కడి రైతులు జట్టులు జట్టులుగా సత్యాగ్రహ మొనర్చుచున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వము మన రంగాగారిపై తమ రాష్ట్రములో ఉపన్యాసములు ఇవ్వకూడదని నిషేధాజ్ఞ యిచ్చినది. ఒరిస్సా, బీహారు, బొంబాయి సంయుక్త రాష్ట్రాలలోని కాంగ్రెసు మంత్రివర్గాలు చేసిన, చేయుచున్న టెనెన్సీ బిల్లులు యెన్నికల ప్రణాళిక వరకైనను, రైతుల కుపయుక్తముగా యుండనందున యాత్రల ద్వారాను, వేలకొలది రైతులు కూడిన సభల ద్వారాను, తమ తీవ్ర అసంతృప్తిని వెల్లడించు చున్నారు. ఎక్కడ చూచినను రైతులకు—జమీందార్లకు పోరాటాలు తీవ్రమయ్యాయి. ఎక్కడ చూచినను ప్రభుత్వము 107, 144 సెక్షనులను రైతులపై ప్రయోగించు చున్నది. ఈ యుదంతాలన్నీ రైతులు చైతన్యమును పొందారని, వారి దానిస సంకెళ్ళు త్రెంచుకోవటానికి ప్రయత్నించు చున్నారని, మన స్వాతంత్ర్య పోరాటము తీవ్ర మగుచున్నదని ఋజువు చేయుచున్నవి.

మన నిర్మాణ కార్యక్రమం.

1. గ్రామ గ్రామాన క్రయ విక్రయ సంఘాలను సహకార పద్ధతులపై స్థాపించుట, తాలూకా కొక విత్తనముల డిపోను సహకార పద్ధతులపై నేర్పాటు చేసుకొనుట, సాగుకు వీలైన బంజరు భూమిని సమిష్టి సహకార పద్ధతులపై వ్యవసాయ కూలీలకు సాగు చేసుకొనుటకు ప్రభుత్వము యొసంగునట్లు అందోళన చేసి దేశములో ఆహార పదార్థ ఉత్పత్తి అధికము చేయుట, 2. జిల్లా జిల్లాకు రైతాంగ విద్యాలయమును స్థాపించుట. 3. జిల్లా లేక తాలూకా, రైతుల సేవాదళమును యేర్పాటు చేయుట. ఉపవృత్తులను పెంపొందించ చూచుట.

ఫెడరేషన్.

భారత ప్రజలందరి యిష్టానికి వ్యతిరేకముగా బ్రిటిషు సామ్రాజ్య వాదులచే మన నెత్తిపై రుద్దబడుచున్న ఫెడరేషనును నెదుర్కొనుటకు రైతులమైన మనమంతా కాంగ్రెసును బలపర్చాలి. నిరంకుశులగు స్వదేశ సంస్థానాధీశుల ప్రతినిధులలోను భారతజాతి నంతను వివిధ సంకుచిత తరగతులుగ విభజింపబడిన పరోక్షపు యెన్నికల ద్వారా ఎన్నుకోబడిన బ్రిటిషు ఇండియా ప్రతినిధులు కలిగిన ఫెడరల్ శాసన సభలో అభివృద్ధిని కోరు యెట్టిపార్టీయు అధికారానికి రాలేదు. విదేశ, సైనిక, రైల్వే, రిజర్వు బ్యాంకు, ఇండియన్ సర్వీసులపై యెట్టి అధికారము లేని ఫెడరల్ పెనుభూత ప్రభుత్వము మనను పీల్చుటయే గాని ప్రసాదించే దేమియు లేదు. యిట్టి ఫెడరేషనును నిరంకుశముగా అమలు జరుప చూచే యెడల దేశములోని కష్టజీవు లందరు కాంగ్రెసు నాయకత్వాన తీవ్ర పోరాటమును సాగించి యెదుర్కొనాలి. దాని స్థానే యుక్తవయస్సు వచ్చిన భారతీయు లందరిచే ఎన్నుకోబడిన ప్రజా పరిషత్తే మన రాజ్యాంగ చట్టాన్ని నిర్మించాలి.

సామ్రాజ్య యుద్ధము.

వివిధ సామ్రాజ్య వాద ప్రభుత్వాలు మారణ యంత్రాలను వృద్ధి చేసుకొంటూ ప్రపంచాన్ని మరిమొక్క ఘోర సంగ్రామములో ముంచటానికి సిద్ధమవుచున్నాయి. ఇటలీ, జర్మనీ, జపాను, ఫాసిస్టు దేశాలు బలహీన దేశాలను మ్రింగ చూస్తున్నాయి. ఇటలీ బాంబుల ప్రయోగానికి అబిసీనియా స్వాతంత్ర్యము ఆహుతి అయినది. హిట్లరు, ముస్సోలినీల ప్రోత్సాహ, సహాయములతో విద్రోహి ఫ్రాంకో స్పెయిన్ ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయుటకు యుద్ధము చేయుచున్నాడు. జపాను చీనాను కబళించుటకు బాంబుల, విషవాయువుల వర్షముతో దాడులు సాగించుచున్నది. స్పెయిన్ చీనా ప్రజా సామాన్యం ఐక్యశక్తితో ఫాసిస్టు నిరంకుశులను యెదుర్కొను చున్నారు. జర్మనీ, ఆస్ట్రియాను కబళించింది. జకోస్లోవేకియా కోసం ఎదురు చూస్తుంది. బ్రిటిషు ప్రభుత్వం తన తటస్థ విధానం ద్వారా పరోక్షముగాను, ప్రత్యక్షముగాను నిరంకుశులకే తోడ్పడుచున్నది.

పై ప్రపంచ పరిస్థితులను బట్టి బ్రిటిషు ప్రభుత్వం ప్రపంచ యుద్ధం తప్పదని గ్రహించి తానుకూడ యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. తన సామ్రాజ్య రక్షణకోసం చేసుకొనే యుద్ధములో మనలకూడ బలి యిచ్చే తొలి ప్రయత్నమే మొన్న అసెంబ్లీలో గావించిన యుద్ధప్రతికూల ప్రచార నిరోధక చట్టం. 1914 ప్రపంచ సంగ్రామంలో బలహీన రాజ్యాల స్వయం నిర్ణయసూత్రాలను రక్షించుటకే తాము యుద్ధం చేస్తున్నామని తియ్యని మాటలు చెప్పి కోట్లకొలది భారతీయుల సొమ్మును, వేలకొలది మనుష్యులను ఉపయోగించుకున్నది. యుద్ధానంతరం ప్రత్యుపకారంగా లభించిన - "రౌలట్ చట్టము, పంజాబు హత్యలు" మనం మరువజాలము. యేరుదాటి తెప్పకాల్చిన పగిదిని వర్తించునది బ్రిటిషు ప్రభుత్వమని గతించిన చరిత్రవలన నేర్చుకొన్నాము. ఇట్టి ప్రభుత్వానికా యుద్ధములో సహాయము చేయుట? ఎన్నటికి పొసగదని మనం స్పష్టపర్చాలి. యుద్ధ ప్రచార నిరోధకశాసనమువలన కాంగ్రెసు గావించిన యుద్ధ ప్రతికూల తీర్మానానికి సవాలు ప్రకటించినట్లే! ఈసవాలుకు మనము సంసిద్ధులము కావాలి.

ఆంధ్ర రాష్ట్రము.

ఈ సందర్భములో ఆంధ్రులందరిని నేను కలవర పర్చుచున్న ఆంధ్రరాష్ట్రమును గురించి యొక మాట: భాష ననుసరించి రాష్ట్రాలు నిర్మింపబడి ప్రభుత్వ వ్యవహారములన్ని మాతృభాషలో జరుగుచో ప్రజాసామాన్యం పరిపాలనా విధానములో పాల్గొనుటకు యెక్కువ అవకాశ ముంటుంది. కాబట్టి ఆంధ్ర రాష్ట్రమునకు రైతులు సుముఖులే. మన అన్ని కోర్కెలతో పాటు రాష్ట్ర సంపాదనకు కూడ మనము కృషి చెయ్యాలి.

తుది విజ్ఞప్తి.

మనము సభలతోను, ప్రదర్శనములతోను కాలము హెచ్చుగా గడుపుచున్నాము. మన కష్టములే మన కండ్లు తెరిచినవి. మనము ఉపేక్షావ ప్రపంచానికి దూరమై కార్యశూరులమని ప్రదర్శించ వలసిన కాలము వచ్చినది. ఏ గ్రామములోనైనా రైతులు, కూలీలు బాధలు పడుచున్నను అన్ని గ్రామాదులలోని రైతులు అసమ్మతిని కేంద్రీకరించి వాటిని నిరోధించుటకు పూనుకోవాలి. కాడిగట్టు తగవులకు కాలము కాదిది. స్వార్థపరులగు గ్రామ పెత్తనదారులకు పార్టీలులేనిదే భత్యాలు గిట్టవనుకొను గ్రామనాయకుల కల్లబొల్లి మాటలకు మనను ఉపయోగించుకొన చూచు రాజకీయ కపట వేషధారులకు దాసోహమనుట తగదు. మనలోనే మెలగుచు మన సంఘములో ప్రవేశించి మనలను సామ్రాజ్యాభిలాషులకు, జమీన్‌దార్లకు, షాహుకార్లకు పనిచేయునట్టి మోసపు రాజకీయ పెత్తందార్లకు మన సంఘములో తావులేదని చెప్పాలి. కష్టజీవులందరి కులం ఒకటే. ప్రపంచ కష్టజీవుల రాజ్యస్థాపనలోనే శ్రమికుల దరిద్ర దాస్యజీవన సంపూర్ణ విముక్తి కలదని విశ్వసించి విజయమును చేకూర్చువరకు వీరులమై వర్తించాలి.

కార్మిక కర్షకులు ఏకము కావాలి.
రైతుల కనీసపు కోర్కెలు బలపర్చాలి.
కాంగ్రెసు—కిసాను సంఘాల ఐక్యతను సమకూర్చండి.
జాతీయ ఐక్యసంఘటనను నిర్మించండి.
జమీన్‌దారీ పద్ధతి నశించాలి.
ఫెడరేషను యెదిరించాలి.
ప్రజాప్రతినిధి పరిషత్తు కావాలి.
యుద్ధాలు అంతరించాలి.

రైతు సంఘాలకు జై !!

లంచగొండి తనం నశించందే రైతులకు సుఖం లేదు.

ప॥ కృష్ణా జిల్లా.

పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీవారిచే నియమింపబడిన లంచగొండి తనం నిర్మూలన సంఘ సభ్యులు, శ్రీ పేట బాపయ్య, కాకాని వెంకట రత్నం, కాట్రగడ్డ నారాయణరావు, యం. ఎల్. ఏ., అన్నే అంజయ్య, వి. వి. రాఘవయ్య, బి. యే., ఎల్. ఎల్. బి. గారలు జిల్లాలో విరివిగా సంచారం చేసి, రైతులవద్ద సాక్ష్యం తీసుకొనుచున్నారు. బెజవాడ తాలూకాలో నెప్పల్లి, పోరంకి, ఈడుపుగల్లు, మైలవరం, చీమలపాడు, కొండూరు గ్రామాల్లోను; గన్నవరం తాలూకాలో ఆరుగోలను, ఆత్కూరు, అవిటివల్లి, కేసరివల్లి, ముస్తాబాదా, గన్నవరం, వీరవనేని గూడెం, తేలప్రోలు, కొమ్మమూరు, పుయ్యూరు. తాడంకి గ్రామాలును యింత వరకు సంచారం చేశారు. వి. డబ్ల్యు. డి. రిజిస్ట్రేషన్, రివెన్యూ, విద్య, పోలీసు, జూడిషియరీ శాఖలలో ప్రభుత్వోద్యోగస్థులు రైతుల వద్ద తీసుకొంటున్న లంచాలను గురించి విచారణ సంఘం యెదుట సాక్ష్యం యిస్తున్నారు. వ్రాతమూలకంగాను, ఓరల్‌గాను; బహిరంగముగాను, రహస్యముగాను సాక్షులు విచారణ చేయబడు తున్నారు. వందలాది రైతులు వచ్చి, కాంగ్రెసు యెడల గల భక్తితో సాక్ష్యం యిస్తున్నారు. జిల్లా అంతటను సమగ్రమైన విచారణ చేసిన తరువాత ఆ నివేదికను కాంగ్రెసు కమిటీ వారు మదరాసు ప్రభుత్వమునకు పంపుదురు.

రైతునకు నేడు అనివార్యమైన యిబ్బందులు ఉండుటవల్ల ఉద్యోగస్థులకు లంచమే యీయవలసి వస్తోంది. లంచములు తీసుకొను వారిపై ప్రభుత్వం తగిన చర్య తీసుకొంటే కొంత వరకైనా యిది నిర్మూలించ బడ గలదు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధను చూపుతూన్న పశ్చిమ కృష్ణా కాంగ్రెసు కమిటీ వారిని ప్రశంసించ వలసి యున్నది. ఇతర జిల్లా, తాలూకా కాంగ్రెసు కమిటీలు కూడా యీ విషయమై కృషి చేస్తే రైతులకు కొంత అయినా రక్షణ గలుగుతుంది.

వెంకటగిరి ఎస్టేటు.

మదరాసు ఋణ పరిష్కార చట్టం ప్రకారము. జమీన్ రైతులు 1347,46 ఫసలీల శిస్తులు పూర్తిగా చెల్లిస్తే, పాత బకాయిలన్నీ రద్దు చేయబడతాయి. అనేక మంది బీద రైతులు యీ విధంగా రెండు సంవత్సరాల్ల పూర్తి శిస్తు చెల్లించలేక అవస్థపడు తున్నారు. కొందరు నానా యిబ్బందులు పడి చెల్లించి వేస్తున్నారు. కాని, శిస్తుతోపాటు పశువుల పుల్లరి కూడా కట్టవలెనని ఎస్టేటువారు తమ సిబ్బందిని గ్రామాదులకు పంపి, రైతుల్ల పశువులను లెక్కవేయించి పుల్లరి కట్టనిదే పశువులను దొడ్లోనుండి గమిడి దాటకుండా నిర్భంధిస్తున్నారు. దీనికి తోడు, జమీందారుగారి సిబ్బందికి బత్తెములు వగైరా ఖర్చులన్నీ రైతుల్లే భరించవలసి వస్తోంది. సిబ్బందీ ఎన్ని రోజులుంటే అన్ని రోజులు రైతుల్లు యీ ఖర్చులన్ను భరించ వలసినదే.

గత 20 సంవత్సరములనుండి వెంకటగిరి [illegible] పుల్లరి శిస్తు [illegible] 40 [illegible] తున [illegible]

రైతులు పలుకష్టాలు పడుతున్నారు. పుల్లరి వాయిదాను జనవరి నెలాఖరు వరకైనా పొడిగించవలెనని, అంతవరకు జమీందారుగారి బీడులలో రైతుల పశువులను మేపుకొనే హక్కు యిప్పించవలెనని అనేక గ్రామముల రైతులు మంత్రివర్గానికి అర్జీలు పెట్టుకున్నారు. కాని, ప్రభుత్వ ఉత్తరువులు యింకా రాలేదు.

సోషలిస్టు రైతు సంఘ ప్రచారకులైన శ్రీ వి. రామకృష్ణయ్య, బి. రామనాథం గారలున్ను, బొల్లంపల్లి వెంకమనాయుడు, కె. రామకృష్ణం నాయుడు గారలున్ను మన్నారం బ్రాహ్మణపల్లి, కల్వగుంట, పల్లాపేట వగైరా గ్రామాలలో జమీందారీ దురంతములను గురించియు, వాటిని ఎదుర్కొనవలసిన అవసరమును గురించియు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు.

చల్లపల్లి

కృష్ణ వరదలవల్ల పైరులు మగ్గిపోవుట చేతనూ, మెట్టపైరులు పండక పోవుట చేతనూ చల్లపల్లి ఎస్టేటులోని మంగళాపురం రైతులు కలసి 1929 వ సంవత్సరంలో గుండేరు అనే మురుగు కాలువకు రు 30,000 ఖర్చుచేసి, ఇంజనుపెట్టి, దానివల్ల భూమిని సాగుచేయడం మొదలుపెట్టారు. ఆ సంవత్సరం క్రొత్తభూమి అవడంవల్ల మాగాణి పంటలు పండలేదు. కాని ఆ సంవత్సరం నుంచే చల్లపల్లి జమీందారు యకరం 1 కి రు 1-4-0 వంతున అదనపు శిస్తు యివ్వవలసినదని రైతులపై ఒత్తిడి చేశారు. ఇంజను ఖర్చు, గవర్నమెంటుకు చెల్లించవలసిన నీటితీరువ పోను యేమీమిగుల దనిన్నీ, పంటల ధరలు 100 కి 60 వంతున పడిపోవుటవల్ల రైతుకు నష్టమే వచ్చినదనిన్నీ, ఎక్కువ పంట పండినప్పుడు అదనపుశిస్తు వసూలుచేసే అధికారం జమీందారుకు లేదనిన్నీ రైతులు సమాధాన మిచ్చారు. కాని, జమీందారుగారు అదనపు శిస్తుకు దావా చేశారు. డిప్యూటీ కలక్టరు కోర్టులో రైతుల తరపునే తీర్పు ఈయబడింది. జిల్లా కోర్టుకు అప్పీలు చేశారు. అక్కడకూడా రైతులే గెలిచారు. హైకోర్టులో కూడా అప్పీలుచేశారు. కాని, అక్కడ తీర్పు కూడా యేమవుతుందోనని భయపడి, జమీందారుగారు గ్రామమందలి పెత్తందార్లను చేరదీసి, తక్కువ ధరలకు గ్రామస్థులకు భూములు వ్రాసి యిస్తామని మోసపుచ్చి, యకరం 1కి రు. 0-5-0 వంతున అదనపు శిస్తు 1339 వ ఫసలీ లగాయతు యిచ్చేటట్లున్ను; ఋణ నివారణ చట్ట ప్రకారం రద్దు కాబడిన పాత బకాయిలను రైతుల్లు చెల్లించుటకున్ను రాజీ చేసుకున్నారు. వెంటనే, పెత్తందార్లు తమ పలుకుబడిలో ఉన్న రైతులను ప్రోద్బలం చేసి, జమీందారుగారి భార్యవద్ద అప్పు పుచ్చుకొని శిస్తుల చెల్లించి నట్లుగా నోట్లు వ్రాయించారు. తరువాత, సామూదాయకంగా ఉన్న అడ్డవిలో భూములను కొంత [illegible] మంది [illegible] జమీందారుగారు [illegible]

రైతు లోకం

మునగాల.

జమీన్ రైతు సంఘ యాజమాన్యమున మునగాల ఎస్టేటు గ్రామాలలో కాంగ్రెసు ప్రచారం తీవ్రంగా సాగుతోంది. కాని, ఎస్టేటు నౌకర్లు దుండగాలను మానలేదు. కాంగ్రెసు సభ్యులుగా చేరిన వారిపై అక్రమపు కేసులు బనాయించి, వారిని నిరంతరం బెదరిస్తున్నారు.

మునగాల పరగణాలకు స్పెషల్‌గా ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరును, 8 మంది కానిస్టేబిల్లునూ వేశారు. కాని, వారికి కాంగ్రెసును దూషించుట, తప్ప మరొక పని ఉన్నట్టు తోచదు. సబ్ ఇన్‌స్పెక్టరు తన కెవరు యింత తిండి వేస్తే వారి పక్షం ఉంటాననీ; గంపలగూడెంలో కొల్లి బుచ్చయ్యగారిని కొట్టిస్తే ఎవరేమి చేశారనీ; కాంగ్రెసు కొద్ది కాలంలోనే మట్టమవుతుందనీ; జమీందారు బలవంతుడు— రామచంద్రపురం కేసు పట్టిదైనది - నేలమర్రి కేసు సొంతం గల్లంతు - పై అధికారులు చూడవచ్చారా - మొదలైన రీతుల పోలీసువారు ప్రజలలో ప్రచారం చేస్తున్నారు.

నూతక్కి.

గుంటూరు తాలూకా, నూతక్కి గ్రామంలో లోగడ మాలమాదిగలపై భూస్వాము లొనర్చిన దౌర్జన్యాలను గురించి విచారణ చేయుటకు గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంటు గారువచ్చి, అయిదు రోజులు విచారణ చేశారు. పిటిషనర్ల తరపున సుమారు 40 మందిని విచారించి, కొంతమంది వద్ద స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కాని, వారు వెళ్ళినది మొదలు (1-9-38) యీ విచారణ ఫలితంగా భూస్వాములు తిరిగి చేస్తూన్న హంగామీకి పల్లె అంతా భయభ్రాంతు లౌతున్నారు. కొట్టెదమని, ఇండ్లు తగుల బెట్టెదమని కొందరు బెదరిస్తున్నారు. ఇందువల్ల మాలమాదిగలు పొలములు వెళ్ళుట మాని, పల్లె కనిపెట్టుకొని ఉన్నారు.

గుమ్మలూరు

నర్సాపురం తాలూకా గుమ్మలూరు బ్రాంఛి కాలువను బట్టి సుమారు 600 యకరాలు సాగుచేయ బడుతున్నాయి. సదరు బ్రాంఛి కాలువ మొగను నిర్మింపబడిన తూము మొగతా తూముల కంటె పై లెవెల్‌లో ఉన్నందున సకాలంలో నీరు సప్లయి కాక తోట పైరులకు పంట భూములకు విశేషమైన నష్టం వస్తోంది. సదరు తూమును క్రింది లెవెల్‌కి మార్పించవలసినదిగా రైతులు పి. డబ్ల్యు. డి. అధికార్లతో స్వయంగాను, అర్జీల మూలంగాను విన్నవించు కున్నారు. కాని, యీ బీదరైతుల మొఱ నిరర్థకమౌతోంది.

చిట్టవేలం

గ్రామస్థులు అనాదినుంచీ మట్టిని తెచ్చు[illegible] కానే [illegible] వెలబెడితే [illegible] స్థలంలో [illegible] చెట్టి [illegible] అనే [illegible] సుమారు [illegible] మాస్టము [illegible] క్రితం [illegible] మట్టిని తెచ్చు [illegible]

దారుగారి తరపున తిరువూరు సబ్ [illegible] కోర్టులో క్రిమినల్ కేసు పెట్టబడింది. [illegible] క్రిమినల్‌గా ఛార్జీ పెట్టవలసినది [illegible] నుంచి రైతులు మట్టి తెచ్చుకొన్న [illegible] ఉన్నట్లుగా రుజువైనది కనుక యీ కేసును కొట్టివేయడ మైనది" అని 31-8-38 [illegible] సబ్ మేజస్ట్రీటుగారు తీర్పుచెప్పారు.

రాత్రిపూట బందెల దొడ్డిలో [illegible] పెట్టరాదని పొందు ఆక్టులో విధించబడి యుండగా 30-8-38 వ తేదీ రాత్రి 8½ గంటలకు [illegible] కాంగ్రెసు నాయకులు తిరువూరునుండి [illegible] వస్తూంటే, లక్ష్మీపురం బందెలదొడ్డి [illegible] వద్ద సుమారు 300 మేకలను దొడ్డిలో [illegible] త్తం గంపల గూడెం ఎస్టేటు [illegible] గుమిగూడి యున్నారు.

తిరువూరు

తిరువూరు సబ్ రెజిస్ట్రార్ వి. నరసింహ[illegible] రావు గారున్ను, బంట్రోతు వి. గోపాల[illegible] స్వామియు డిస్మిసు చేయబడ్డారని ఇన్‌స్పెక్టర్ [illegible] జనరల్ ఆఫ్ రెజిస్ట్రేషన్ (మదరాసు) కృష్ణా జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ [illegible] సూర్యనారాయణగార్కి తెలయజేశారు.

వీరిద్దరును లంచములు తీసుకొనుచున్నారని రైతు సంఘమువారు తెలియజేయగా మదరాసు నుంచి ఇన్‌స్పెక్టరు జనరల్ [illegible] వచ్చి, సాకల్యంగా విచారణ చేసి, [illegible] మైన తీర్పు చెప్పారు.

ఇచ్ఛాపురం

29-8-38 వ తేదీని బల్లిపుట్టుగలో [illegible] వేశమైన ఇచ్ఛాపురం తాలూకా కాంగ్రెసు [illegible] కార్యనిర్వాహక వర్గ సమావేశంలో జలంత్ర[illegible] టా (విజయనగరం ఎస్టేటు) రైతులకు [illegible] యిబ్బందులను, ఎస్టేటు ఉద్యోగస్థుల దౌర్జన్యాలను గురించి విచారణ చేయుటకు శ్రీ గౌతు [illegible] లచ్చన్న, బెందాళం గవరయ్య [illegible] శీతయ్య గారలు నియమించబడిరి. [illegible] వర్షలేమిచే, ఈ తాలూకాలో జలంత్ర ఎస్టేటు [illegible] చీకటి-తలతంపర మున్నగు ఇచ్ఛాపురం [illegible] ఏరియాలో మెట్ట గ్రామాలు [illegible] టులో 4/5 వ వంతు భాగం పూర్తిగా [illegible] పోయినందున; ప్రభుత్వం వెంటనే కరవు నివారణ పనులు ప్రారంభించ వలసినదని [illegible] తీర్మానించ చేయబడెను. వెంటనే జలంత్ర [illegible] పాడిగా ప్రాజెక్టు [illegible] రైతులకు రక్షణ నీయవలసినదనియు; [illegible] నపన ప్రాంతములో సముద్రపు [illegible] ముంపుల వల్ల పల్లపు సాగుకు [illegible] నష్టమును గూర్చి ప్రభుత్వం [illegible] తన్నివారణార్థము కృషి చేయవలసినదనియు కూడ తీర్మానించబడెను.

ఏజన్సీ

[illegible] మదరాసు ఋణ పరిష్కార చట్టం [illegible]

మన రాజకీయాలు

కా|| మేడ్ చన్నూసింగ్—యుద్ధ సన్నాహాలు—మోటారు బిల్లు—నిర్బంధ ప్రాథమిక విద్య—వర్తక సంభాషణాలు—ఒరిస్సా ఏజన్సీ ప్రజలు—1941 వ సంవత్సరం!—భూములను తిరిగి యిచ్చే బిల్లు.

ఇండియాలో యుద్ధ సన్నాహాలు

కా|| మేడ్ చన్నూసింగ్.

బొంబాయి రాజధానిలో రాజకీయ ఖైదీ లెవరూ లేరని కాంగ్రెసు మంత్రి వర్గంలో ఒకరైన కె. యం. మున్షీ గారు పలికారు. 14-2-38 వ తేదీ అఖిల భారత రాజకీయ ఖైదీల దినోత్సవ సందర్భంలో శిక్షింపబడిన షోలాపూర్ ఖైదీలు ఈయన దృష్టిలో రాజకీయ ఖయిదీలు కారు. షోలాపూర్ నియోజకవర్గం నుండి ఎన్నుకోబడిన భోలే అను శాసన సభ్యుడు వేసిన ప్రశ్నలకు సమాధాన మిస్తూ, కా|| మేడ్ చన్నూసింగు రాజకీయ ఖైదీ అవునో కాదో స్పష్టంగా చెప్పజాలనని మున్షీ గారు సెలవిచ్చారు.

మున్షీ కాంగ్రెసు మంత్రిగా ఉండి, కాంగ్రెసు ప్రతిష్టకు భంగం కలిగే విధంగా జవాబిచ్చినందుకు అసమ్మతిని తెలియ జేస్తూ చన్నూసింగు జైల్లో నిరాహారవ్రతం ప్రారంభించాడు.

అయితే, విచారకరమైన ఒక వార్తను పత్రికలు ప్రకటిస్తున్నాయి. నిరశన వ్రతం ప్రారంభించిన 10 వ రోజున చన్నూసింగ్‌ను షోలాపూర్ సివిల్ హాస్పిటల్ నుంచి ఎక్కడికో తీసుకొని పోయారట!

బొంబాయి ప్రభుత్వం యొక్క యీ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ ఆ రాష్ట్రంలో అనేక సభలు, ఊరేగింపులు జరుగుతున్నాయి. షోలాపూర్ కార్మికసంఘం యొక్క యాజమాన్యమున బ్రహ్మాండమైన ఊరేగింపు ఒకటి జరిగింది. "జనసత్తా", "ఏక్‌జూట్", "కల్పతరు" అనే షోలాపూర్ జాతీయ వార పత్రికలు బొంబాయి మంత్రి వర్గం యొక్క వైఖరిని నిరసించాయి. షోలాపూర్ కాంగ్రెసు శాసన సభ్యుడు కూడా ఖండించాడు.

దేశంలో ఇంత ఆందోళన బయలుదేరినప్పుడు, కా|| మేడ్ చన్నూసింగును ఎవరికీ తెలియని ఒక ప్రదేశానికి తీసుకొని పోతే ప్రజాందోళన చల్లబడుతుందని బొంబాయి గవర్నమెంటు అభిప్రాయం కాబోలు! మంత్రి పదవులు తీసుకొన్న ఒక్క సంవత్సరం లోనే మంత్రి వర్గం ప్రజా ఉద్యమం యొక్క తత్వం మరచిపోవడం ఆశ్చర్యకరం!

ఒక ప్రక్క పంజాబ్‌లో కాంగ్రెసు వాదులపై నిర్బంధ విధానం చెలరేగి పోతోంది. సెప్టెంబరు 1 వ తేదీని సైన్యపు బిల్లుకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన సభ చేసి, ఉపన్యాసము లిచ్చినందుకు 12 గురు కాంగ్రెసు సోషలిస్టులను ఎరస్టు చేశారు. వారిపై దొమ్మీ చేశారని, గాయపరిచారని అభియోగం తేబడింది. అ. భా. కాం. సోషలిస్టు పార్టీ కార్య నిర్వాహక వర్గంలో ఒకరైన బి.పి.యల్. బేదీగారు కూడా వీరిలో ఒకరు. ఈ అభియోగమును బట్టి, వీరిని రాజకీయ ఖైదీలుగా పంజాబ్ గవర్నమెంటు పరిగణించక పోవచ్చును. ఎందువల్లనంటే, అక్కడి మంత్రివర్గం జాతీయ విద్రోహులతో కూడుకొని యుంది. కాంగ్రెసు మంత్రులు అధికారంలో ఉన్న బొంబాయిలోనే రాజకీయ ఖైదీల యెడ ఇంత నిరసన చూపబడుతోంటే, పంజాబ్ గవర్నమెంటు ప్రజా ఉద్యమం యొక్క నాయకుల యెడల మరింత క్రౌర్యంతో ప్రవర్తిస్తుంది! సందేహం లేదు.

కాంగ్రెసు మంత్రి పదవులు తీసుకున్నది సామ్రాజ్య ప్రతికూలోద్యమాన్ని మరొక మెట్టు పైకి తీసుకొని పోవుటకే గాని, దాన్ని అణచుటకు కాదు. ఈ విషయాన్ని ఆందోళన ద్వారా ప్రజలు బొంబాయి మంత్రులకు జ్ఞాపకం చేయాలి.

యుద్ధ సన్నాహాలు.

ఇండియా యందలి సైన్యం విషయంలో ప్రభుత్వం ఎట్టి కార్యాచరణకు పూనుకొనదలచు కొన్నదీ తెలియ జేస్తూ, శాసన సభ్యులతో సంప్రతించెదరా అని అడిగిన ఒక ప్రశ్నకు సైన్య శాఖ కార్యదర్శి జవాబిస్తూ యిట్టి విషయాన్ని గురించి శాసన సభ్యులతో ప్రభుత్వం సంప్రతించుటకు పూనుకొనదని చెప్పాడు. సైన్యపు వ్యవహారాలలో ప్రభుత్వానికి సలహా యిచ్చుటకు శాసన సభ్యులతో కూడిన ఒక ఉప సంఘాన్ని ఏర్పాటు చేయవలసినదని పై శాసన సభలో మితవాద నాయకుడైన సప్రూ ప్రతి పాదించిన తీర్మానం ఓడి పోయింది. కొచ్చిన్ రేవు పట్టణంలో యుద్ధ విమానాశ్రయం ఒకటి కట్టుటకు ఏర్పాట్లు జరుగుచున్న మాట నిజమేనా అని అడిగిన ప్రశ్నకు డిఫెన్సు కార్యదర్శి, చెప్పుటకు వీల్లేదని సమాధాన మిచ్చాడు. విశాఖపట్నం హార్బరును యుద్ధ విమానాశ్రయంగా గాని, యుద్ధ నావికాశ్రయంగా గాని చేయుట ప్రభుత్వోద్దేశమా?, జూన్ నెలలో విశాఖపట్నం హార్బరు తనిఖీ చేయుటకు వచ్చిన 4 గురు మిలిటరీ ఉద్యోగస్థుల ఉద్దేశం ఏమి?, అని కేంద్ర శాసన సభలో కె. యన్. గుప్తాగారడిగిన ప్రశ్నకు కూడా పై విధంగానే సమాధాన మీయబడింది. టైమ్సు ఆఫ్ ఇండియా పత్రిక రిపోర్టు ప్రకారం, భారతీయ సైన్యంలో యిదివరకెప్పుడూ చేయబడని ప్రధానమైన మార్పు లెన్నో చేయుటకు ఆలోచనలు చేయబడు తున్నాయి.

ఇవన్నీ రాబోయే యుద్ధానికి బ్రిటిష్ ప్రభుత్వం చేస్తూన్న సన్నాహాలు. ఆ యుద్ధంలో బ్రిటిష్‌వారి సామ్రాజ్యాన్ని రక్షించుటకు భారతీయులను ఆహుతి చేద్దాం అని వారి ఉద్దేశం. సైనిక బిల్లు పైశాసన సభలో కూడా ప్యాసయింది. సెత్నా, సప్రూ వంటి కాంగ్రెసేతర మిత వాదుల సహితం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వోట్లిచ్చారు. వైస్రాయి శాంక్షన్‌తో బిల్లు చట్టం అయి ఊరు కుంటుంది.

ఈ యుద్ధ సన్నాహాన్ని భగ్నం చేయాలంటే, గ్రామ గ్రామంలోను, ప్రతి పట్టణంలోను బహిరంగ సభలు, ఊరేగింపులు మొదలైన పద్ధతులతో బ్రహ్మాండమైన ఆందోళన చేయాలి.

మోటారు బిల్లు.

మోటారు బండ్లను గురించిన బిల్లుయొక్క, 42 వ క్లాజు కేంద్ర శాసన సభలో తీవ్రంగా చర్చింపబడి, ప్యాసయింది. దీని ప్రకారం, రాష్ట్రీయ ప్రభుత్వాలే రైలు—బస్సుల మధ్య గల సంబంధాన్ని నిర్ణయించునట్టి అధికారం కలిగి యుంటాయి. ఎక్కువ దూరం ప్రయాణం చేసే బస్సులకు లైసెన్సు లిచ్చుటకు గాని, నిరాకరించుటకు గాని రాష్ట్రీయ ప్రభుత్వానిదే అధికారం. ఇంతే కాదు. బస్సు యజమానులు ప్రయాణీకుల వద్ద తీసుకొనవలసిన రేట్లు, సరుకుల తీసుకొని పోయే బస్సులు ఎంతెంత బరువుకు ఎంతెంత కేవు వసూలు చేయ వచ్చునో నిర్ణయించేది కూడా రాష్ట్ర ప్రభుత్వాలే. ఇబ్బందులు గల బస్సు యజమానులు ప్రభుత్వమునకు అర్జీ పెట్టుకొని, పూర్వపు నిర్ణయాన్ని మార్చుకొనే టట్లు కోరవచ్చును.

కాంగ్రెసు శాసన సభ్యులు యీ క్లాజుకు అనుకూలంగా వోటిచ్చారు. ఇండియా ఆక్టు ప్రకారం, రైల్వేల మీది అధికారం ప్రజా ప్రతినిధుల కుండదు. ప్రత్యేకంగా యేర్పరచబడు ఒక రైల్వే అధికార వర్గం యొక్క చేతుల్లో ఉంటుంది. ఇప్పుడు మోటార్ బండ్ల రేట్ల విషయమై అధికారం యావత్తూ రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకొంటే, ఒకవిధంగా రైల్వేలపై కూడా అధికారం సంపాదింపవచ్చును. రైల్వేలకు, బస్సులకు మధ్య నేడు విపరీతమైన పోటీ చూస్తున్నాం. ఈ పోటీలో రాష్ట్ర ప్రభుత్వాలకు యింతవరకూ ఎట్టి జోక్యం లేదు. ఈ బిల్లు యందలి 42 వక్లాజుతో కొంత అధికారం రైల్వేలపై వచ్చింది. ప్రభుత్వ సభ్యులు కూడా యీ క్లాజుకు అంగీకరించారు. ఇది సోషలిస్టు క్లాజు అని యూరపియన్ పార్టీ సభ్యులు ఆక్షేపణ చేశారు. అయినప్పటికీ అత్యధిక సంఖ్యాకులతో క్లాజు ప్యాసయింది.

నిర్బంధ ప్రాథమిక విద్య

మధ్య పరగణాలలో బాలురకు, బాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్యను గరపుటకు అక్కడి కాంగ్రెసు మంత్రి వర్గం వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పుడు అమలులో ఉన్న చట్టం ప్రకారం ప్రాథమిక విద్యపై అధికారం స్థానిక సంస్థలకు ఉంది. దీన్ని ప్రభుత్వమే తీసుకొని, శ్రద్ధతో యీ శాఖను నడుపుటకొక బిల్లును ప్రతిపాదించబోతున్నది. దీని ప్రకారం, రాష్ట్రమందలి, లేదా రాష్ట్రంలో కొన్ని ప్రదేశాల

యందు ప్రాథమిక విద్య నిర్బంధం జేయబడి, ప్రభుత్వమే ఆచరణలో పెట్టే ఏర్పాట్లు చేస్తుంది.

ఇట్టి యేర్పాటు ఇతర కాంగ్రెసు రాష్ట్రము లన్నిటిలోను కూడా చేస్తే, ఎంతో మేలు కలుగుతుంది. జిల్లా బోర్డులలో అధిక సంఖ్య గల పార్టీలకు బడి పంతుళ్ళు గురిమై ట్రాన్స్‌ఫర్లు, జుల్మానాలు సస్పెన్షన్లు మొదలయిన అనేక నిరంకుశ విధానాలకు గురి అవుతున్నారు. ఇట్టి పార్టీ కక్షలు లేకుండా, ప్రైమరీ విద్యా శాఖను ప్రభుత్వం స్వాధీన పరచుకొని నడిపితే, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లి—తండ్రులు అందరూ సంతోషిస్తారు. ఎలిమెంటరీ విద్యను కూడా ప్రభుత్వం స్వాధీన పరచుకొంటే, మంత్రులు ప్రజల మెప్పును యింకా బడయ గలుగుతారు. పిల్లలకు నేర్పే పాఠాలు కూడా మత, కుల కక్షలకు తావీయకుండా, జాతీయ దృక్పథం అలవడే మార్గం చూపాలి. బాల్యావస్థలో నేర్చుకొన్న అభిప్రాయాలే జీవితాంతము వరకూ ఉంటాయి.

వర్తక సంభాషణలు.

బ్రిటిష్ బట్టల వ్యాపారస్థులకూ, భారతీయ వ్యాపారస్థులకూ మధ్య ఒడంబడిక ఒకటి చేసుకొనుటకు సంభాషణలు జరుగుతున్నాయి. బ్రిటన్ తరపున బోర్డ్ ఆఫ్ ట్రేడ్ అనే వ్యాపార సంస్థ, ఇండియా తరపున 7 గురితోకూడిన-ఇండియా గవర్నమెంటుచే నియమింపబడిన 7 గురు అనధికార ప్రతినిధి వర్గం—యీ రెండిటి మధ్య సంప్రతింపులు జరుగుతున్నాయి.

60 కోట్ల గజముల లంకషైరు గుడ్డ ఇండియా దిగుమతి చేసుకొని, దిగుమతి పన్ను యిప్పుడున్న 20% రేటు నుండి 11% కు తగ్గించి వేయాలనిన్నీ; లంకషైర్ మాత్రం ఎంత పత్తిని ఇండియానుండి కొంటుందో హద్దు పెట్టకూడదనిన్నీ బ్రిటిష్ వర్తక ప్రతినిధులు కోరారు.

ఈ షరతులను ఇండియా అనధికార ప్రతినిధి వర్గం నిరాకరించింది. దీనికి కారణం లేక పోలేదు. భారతీయు లందరికీ కావలసిన గుడ్డ భారత దేశపు మిల్లులే సప్లయి చేయగలవని గత నాలుగైదు సంవత్సరముల అనుభవంవల్ల తెలుస్తుంది. నాలుగు సంవత్సరముల క్రితం భారత దేశంలో ఉత్పత్తి అయిన మిల్లుబట్ట మొత్తం 300 కోట్ల గజాలు. గత సంవత్సరం 400 కోట్ల గజాలకు పెరిగింది. 1934 లో ఇండియాకు దిగుమతి అయిన విదేశ సరకు 88 కోట్ల గజాలు; గత సంవత్సరం 60 కోట్ల గజాలకు తగ్గింది.

అయినప్పటికీ భారతీయ ప్రతి నిధి వర్గం న్యాయమైన ఒక ఒడంబడికకు సిద్ధంగానే ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలలో, ప్రతి సంవత్సరం గ్రేట్ బ్రిటన్ ఇండియా నుండి సగటున 5,00,000 బేళ్ళ పత్తి చొప్పున దిగుమతి చేసుకొంది. ఇప్పుడు కూడా భారతీయ వర్తక ప్రతి నిధులు 4,50,000 బేళ్లకు 5,00,000 బేళ్లకు మధ్య పత్తిని కొనవలసిందని అభిప్రాయ మిచ్చారు. 35 కోట్ల లంకషైర్ బట్టలను ఇండియా కొనుటకును, దానిపై దిగుమతి పన్ను 13% ప్రభుత్వం విధించుటకును అంగీకరించారు. బ్రిటిష్ వ్యాపారస్థుల షరతులు పూర్తిగా నిరాకరిస్తూ 5 గురు అధిక సంఖ్యాకులును, అంగీకరిస్తూ యిద్దరునూ ప్రత్యేక నివేదికలు వ్రాసి పంపారు. వీటిపై ప్రభుత్వం ఏ నిర్ణయానికి వస్తుందో చూడాలి. సంపూర్ణ స్వాతంత్ర్యం అనుభవించే రెండు దేశాల మధ్య వర్తకపు ఒడంబడికలు ఉభయ పార్టీలకూ సంతృప్తికరంగా ఉండుట వవకాశం ఉంది. కాని, బ్రిటిష్ వ్యాపారస్థుల లాభాల కొరకే బానిసత్వంలో ఉంచబడిన ఇండియా నిజమైన సదుపాయాలు పొంద జాలదు. బ్రిటిష్ వ్యాపారస్థుల నిర్ణయమే ఖాయం అవుతుంది.

సత్యమూర్తిగారు ఇండియా గవర్నమెంటు వైఖరిని గురించి కేంద్ర శాసన సభలో ప్రశ్నించగా, ఆ ప్రశ్నను ప్రభుత్వం త్రోసి వేసింది.

ఒరిస్సా ఏజన్సీ ప్రజలు.

ఒరిస్సా రాష్ట్రంలో 26 లక్షల ప్రజలు నివసించే ఏజన్సీ ప్రాంతం (partially excluded areas) యితర ప్రదేశాలకు వలెనే సాధారణ పరిపాలన క్రిందికి తెచ్చుటకు ఒరిస్సా శాసన సభలో శ్రీ అతుల్ బిహార్ ఆచార్య గారిచే ఒక తీర్మానం ప్రతి పాదించ బడింది. ఒరిస్సా ప్రధాని ఆయనను అభినందిస్తూ తీర్మానాన్ని హృదయ పూర్వకంగా బలపరిచాడు. ఇతర శాసన సభ్యులంతా అంగీకరించారు. తీర్మానం ఏకగ్రీవంగా ప్యాసయింది.

ఏజన్సీ ప్రజల యెడల బ్రిటిషు ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ హరిపూర్ కాంగ్రెసు మహా సభ యీ క్రింది తీర్మానం ఆమోదించింది:

> **సెప్టెంబరు 16**
>
> ఫెడరేషన్ ప్రతికూల దినం, రాష్ట్ర మంతటా సభలు, ఊరేగింపులు జరపాలి.

"ప్రత్యేకింప బడిన, కొంత ప్రత్యేకింపబడని ప్రదేశాలు, ఛీఫ్ కమీషనర్ల రాష్ట్రములు (బ్రిటిషు బెలూచిస్థానంతో సహా)-యివి 1935 వ సంవత్సరపు గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఆక్టు ప్రకారం సృష్టించబడి, ఇందు మూలంగా, దేశంలో 207900 చదరపు మైళ్ల విస్తీర్ణం గలిగినట్టియు, 1,30,00,000 జనాభా గలిగినట్టియు ప్రదేశాలు ప్రజా పరిపాలన సంస్థ నుండి వేరు చేయ బడ్డాయి. ఇట్లు ప్రత్యేకించుట భారత దేశ ప్రజల ఐక్యతను చీల్చి పరిపాలించే బ్రిటిషు విధానంలో ఒక భాగమేననియు, ప్రజల స్వేచ్ఛకు భంగం కలుగజేయు పద్ధతి అనియు, వారి అభివృద్ధిని ఆటంకపరచే యెత్తులలో ఒకటేననియు యీ కాంగ్రెసు మహా సభ వారభిప్రాయపడుచు, యిట్టి విభజనను ఖండించుచున్నారు."

ఈ తీర్మానాన్ని ఆచరణలో పెట్టుటకు ప్రయత్నిస్తూన్న ఒరిస్సా కాంగ్రెసు మంత్రులు ప్రశంసనీయులు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో ఏజన్సీ ప్రజలు అనుభవిస్తూన్న పరిపాలనా పద్ధతిని మదరాసు మంత్రి వర్గంవారు నిర్మూలించి, ఆ ప్రజలకు రక్షణ నీయవలసి యున్నది.

1941 వ సంవత్సరం

ఇండియా గవర్నమెంటు యొక్క పబ్లిక్ హెల్తు కమీషనర్ తన సాంవత్సరిక నివేదికను ప్రకటించాడు. 1941 వ సంవత్సరాని భారతదేశంలో 40 కోట్ల మంది జనాభా ఉంటారని అతడు అంచనా వేశాడు. అనగా 10 సంవత్సరాలలో (1931—1941) ఇంచు మించు 4 కోట్లమంది జనసంఖ్య హెచ్చుటయం దన్నమాట.

నేడు భారత దేశంలో ఉన్న ఆహార పదార్థములు ప్రజ లందరికీ సరిపోవుటలేదు. కూనూరులో ఆహార పరిశోధనాలయంలో చేయబడిన పరిశీలనలను బట్టి, మదరాసు రాజధానిలో యిప్పుడు సప్లయి అవుతూన్న ఆహార పదార్థాలు యెక్కడికీ ఎగుమతి చేయబడకుండా ప్రజలకు పంచిపెట్టితే, సరిగ్గా సరిపోతాయని తెలుస్తోంది. కాని, దేశంలో బ్రిటిషు పరిపాలకులున్నంతకాలం, అధిక భాగాన్ని ఎగుమతి చేయక తప్పదం లేదు. ఇది గాక, 1941 నాటికి 4 కోట్లమందిని అదనంగా పోషింపవలసి యుంటుంది దేశం. ఈ పేదరికం వల్లనే, క్షయ, శిశు మరణములు, అల్పాయుపు మొదలైన వాటికి ప్రజలు బలి కావలసి వస్తోంది. ఇవి నిర్మూలించబడాలంటే, ప్రజలు రాజకీయంగాను, ఆర్థికంగాను సంపూర్ణ స్వాతంత్ర్యం పొందాలి. మరొక మార్గం లేనే లేదని చెప్పవచ్చు.

భూములను తిరిగి యిచ్చే బిల్లు

బొంబాయి ప్రభుత్వం ఒక బిల్లును ప్రకటించారు. దీని వల్ల, పూర్వం శాసనోల్లంఘనోద్యమంలో భూమి పన్ను చెల్లించక పోవుటచేత స్వాధీన పరచుకొన్న భూములను తిరిగి యజమానులకు యిచ్చివేస్తారు. ఇందు కొరకు రాష్ట్రీయ ప్రభుత్వం ఒక హైకోర్టు జడ్జీక్రింద ఉండే ఒక విచారణ సంఘాన్ని నియమిస్తుంది. ఏదైన ఒక భూమిని దాని పూర్వపు యజమానికి యిప్పించవలెనని ప్రభుత్వం అభిప్రాయపడినట్లయితే, ఆ భూమి అందుకొరకు కావాలని ప్రకటిస్తుంది. ఆ భూములు యిప్పు డెవరి భుక్తంలో ఉన్నాయో వారికి నష్టపరిహారం యివ్వడం, దానిని కోరిన వారి వాదనలను విచారణ చేయడం—ఇది విచారణ సంఘం వారు చేయవలసిన పనులు.

నోటీసు యిచ్చిన 15 రోజుల వ్యవధి గడిచి పోగానే, కలెక్టరు వచ్చి ఆ భూమిని స్వాధీనం చేసుకుంటాడు. తరువాత, తగిన షరతుల నేర్పరచి, రాష్ట్రీయ ప్రభుత్వం అసలు యజమానికి భూమిని వాపసు చేస్తుంది.

ఈ బిల్లుకు ఇండియా కార్యదర్శి తన అనుమతిని ప్రకటించాడు. త్వరలో చట్టం రాగలదు. కాంగ్రెసు ప్రారంభించిన శాసనోల్లంఘ నోద్యమంలో ఆస్తులు పోగొట్టుకొన్నవారికి తిరిగి వారి వారి ఆస్తులను యిచ్చి వేయుట అధికారంలో ఉన్న కాంగ్రెసు మంత్రుల ప్రశంసనీయ కర్తవ్యం.

జకోస్లోవేకియా స్థితి ఇంకా ఊగులాడుతూనే ఉంది.

బెదరింపులతో హిట్లర్ బ్రిటన్‌ను లొంగ దీస్తున్నాడు.

పూర్వము ఇంగ్లాండు లోని పెట్టుబడి దారీ వర్గపు పత్రికలలో హానికరమైన ధోరణి బయలుదేరింది. ఈ ధోరణి కొంత వరకూ అభివృద్ధి చెందును లేబరు పక్షీయులలో కూడా పాకింది. వారి అభిప్రాయాలు సదా ఆలోచనతో కూడినవే అయినా వారికి విషయ మింత కొంచెం తెలియ జెప్ప వలసి యుంది.

"అంతర్జాతీయ పరిస్థితిని గూర్చి లండన్లో పూర్తిగా ఆదుర్దా తగ్గనపోయినా ప్రస్తుతం అంత చిక్కేమీ లేదనే నమ్మకం కలిగింది." అని సండే టైమ్సు పత్రిక వ్రానింది.

ఇట్టి అభిప్రాయాన్ని ప్రజలు నమ్మేలాగున చేద్దామని ఛేంబర్లేను, వారి ముఠావారు చేసే ప్రయత్నమిది.

పరిస్థితులన్నీ చూస్తే ఇంకో విధంగా వున్నాయి. పైకి ఇంత మేకపోతు గాంభీర్యాన్ని చూపిస్తున్నా రహస్యంగా ముసుగులో జరుగు చున్నది. యూరప్‌లోని యీ తీవ్రత హెచ్చిపోతోంది. ఏనాడు, ప్రపంచంలో యుద్ధం వస్తుందో అనే భీతి చాలా ఎక్కువగా వుంది. ఇట్టి కృతక గాంభీర్య ప్రదర్శనం ద్వారా, ఫాసిజానికి, వ్యతిరేకంగా గుమిగూడుతూన్న ప్రజా శక్తుల్ని మభ్యపెట్టి వారిని ప్రమత్తులను చేయాలని బ్రిటిషు మంత్రివర్గం ఆలోచిస్తోంది.

జెకోస్లోవేకియా మీదకు హిట్లరు గ్యాంగు దండెత్తకుండా ఆపుచేయడానికి మే 20 వ తేదీని ప్రజలందరూ ఐక్యకంఠంతో ఎదిరించి నప్పుడున్న తీవ్రతకీ, యిప్పటి దానికి తేడా లేదన రాదు. అప్పుడు ప్రజా శక్తులు నెగ్గడం చేతనే; యీ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటిలో వెనుకటి కంటె ఎక్కువ తీవ్రంగాపున్నా పైకి మాత్రం స్పష్టంగా ప్రదర్శింప బడటంలేదు. ఇదీ, ఇందులోని కిటుకు. యూరపులోని తీవ్రత ఎక్కువగా ఉంది గనుకనే ప్రజా శక్తుల్ని నిద్రపుచ్చేటందుకు ఇట్టి అసత్యపు వార్తలు ప్రకటింపబడు చున్నాయి. ఇందుచే మనమింకా ఎక్కువ మెలకువతో సంచరిస్తూ ప్రజా శక్తులను నిరాయుధులను చేసేందుకు ప్రభుత్వం చేసే ప్రతి ప్రయత్నాన్ని వమ్మొనరించాల్సిన అవసరం నేడు ఎక్కువయింది." అని లేబర్ పక్షీయులు తలంచుతున్నారు.

అయితే ప్రస్తుతం ఉన్న స్థితిగతు లేమిటి? చూద్దాం.

మే 30 వ తేదీని జర్మన్ సేనలు జకోస్లోవేకియాపై బడకుండ ఆపినవి యీ దిగువ మూడు శక్తులూ నని, బ్రిటిషు పెట్టుబడిదారీ పత్రికలు తప్ప మిగతా అందరూ అంగీకరించి నా(రు).

1. జెక్ ప్రభుత్వం, సకాలంలో చేసుకొన్న కట్టుదిట్టాలు.


2. జెకోస్లోవేకియాతో తన కున్న ఒడంబడికలన్నిటినీ అక్షరాలా ఆచరించి తీరుతానని ఫ్రెంచి ప్రభుత్వం నిష్కర్షగా చెప్పడం.

3. విడిగా జర్మనీ గాని, జర్మనీ పోలెండూ కలిసి గాని, జెకోస్లోవేకియా మీద దండెత్తితే సోవియట్ యూనియన్ సహించదని పోలండ్ ద్వారా జర్మనీకి వచ్చిన రూఢియైన వార్త.

(నిజంగా పోలండ్ కూడా జెకోస్లోవేకియాపై దండెత్తాలనే ఊహతో తన సైన్యాలను జెస్కా సరిహద్దుకు నడిపించింది. ఒక వంక నుండి హిట్లర్ బొహేమియాను, జెస్కాను పోలండ్ రెండవ వైపు నుండియు కొట్టాలనే ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది.)

అయితే ఛేంబర్లేను ప్రభుత్వం ఏమంటుంది? బ్రిటిష్ పత్రికలలో వచ్చే వార్తలకీ, ఫ్రెంచి పత్రికలలో వచ్చే వార్తలకీ, అసలు విషయాలకీ మధ్య నున్న తేడాను సరిగా గమనిస్తే యీ ధోరణి ఇట్టే అర్థ మవుతుంది.

హిట్లర్ ప్రయత్నాలన్నీ భగ్నం అయే అసరికే అదంతా బ్రిటిషు వారి యొక్క ప్రజ్ఞ అనియు, ఇంగ్లండు ఫ్రాంసుల మధ్య నున్న ఐకమత్య ఫలితమనీ ప్రగల్భాలు ప్రారంభ మయాయి.



ఒక వంక జర్మనీ జెక్ సరిహద్దుల్లో యుద్ధ సన్నాహాలన్నీ చేస్తూంటే "మా ప్రభుత్వానికి ఇదంతా చూస్తే ఆందోళనగా వుంది" అని బ్రిటిషు రాయబారి అన్నాడు. "అబ్బే! యిదంతా ఎప్పుడూ జరుగుతూన్న వ్యవహారమే గాని అంత ఎక్కువేమీ లేదు." అని జర్మనీ రాయబారి అన్నాడు. అదా! అని తృప్తి పడ్డాడు బ్రిటిష్ రాయబారి. జర్మనీవాడు బలే టోపీ వేశాడని ప్రపంచం అంతా అనుకొంది. మరునాడు మళ్ళీ వెళ్ళి "అంతా అనుమానంగా వుంది మాకు" అన్నాడు బ్రిటిష్ రాయబారి. జెక్కులు గిల్లి కజ్జా పెట్టుకుందామను కుంటున్నారు. అందుచే స్వరక్షణ కోసం చేస్తున్నాం" అన్నాడు రిబ్బన్‌ట్రాప్. "సరే సరే! నని బ్రిటిష్ రాయబారి వెళ్ళిపోయాడు. మరునాడు బ్రిటిష్ రాయబారి మళ్ళీ మూడవ మాటు వరుగెత్తి బ్రిటిష్ అభిప్రాయం అంతా ముక్తసరిగా చెప్పాడు "ఏ గందర గోళము లేకుండా యీ పేచీ పరిష్కారం చేయాలనీ అందుకోసం శాయ శక్తులా పని చేయడానికి ఛేంబర్లేను సిద్ధంగా వున్నాడనీ, ఒక వేళ యుద్ధమే పొసగి ఫ్రాంసు తన మాట మీద నిలబడితే, బ్రిటన్ కూడ కలుగజేసుకోవలసివస్తుందని చెప్పాడు."

ఛేంబర్లేను ప్రభుత్వం ఇరుకున పడింది. ఇటు హిట్లర్‌ను చెండనాడు కుంటే నాలుగు ప్రభుత్వాల (ఫ్రాంసు,బ్రిటన్, జర్మనీ,ఇటలీ) ఒడంబడిక చెడిపోతుంది. పోనీ అని ఊరుకుంటే తన గుట్టంతా బయటపడి ఇంగ్లండులో రచ్చ వస్తుంది. ఈ రొస్టులో నుండి తప్పించుకొనేందుకు తన రాయబారిని అటూ ఇటూ తిప్పాడు. ఇంతలో ఇతర ఒత్తిడి వల్ల జర్మనీ ప్లాను చెడింది. అదంతా మా మహిమేనని ఛేంబర్లేను ప్రగల్భాలు ప్రారంభించాడు. ఇందు ఇంకో రహస్యం కూడా వుంది. జర్మనీ లొంగిపోలేదని, బ్రిటన్ మాటను గౌరవించిందని చెప్పుకొని హిట్లర్ బలహీనత బయట పడకుండా దాచాలనే ఉద్దేశం కూడ ఛేంబర్లేనుకు ఉంది.

ఈ నాటకం బయట పడిగానే, "బ్రిటన్ ఇంతానా!" అని ప్రపంచం పెదిమె విరిచింది. అప్పటినుంచి, జెకోస్లోవేకియాను ఏదో విధముగా ఏకాకిని చేయాలని బ్రిటన్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇంకొక మూలనుండి సుడెటెన్లకు, ఎక్కువ హక్కు లివ్వవలసిందని మితవాద పక్షం ద్వారా జెక్ ప్రభుత్వాన్ని బలవంత పెట్టడం ప్రారంభించింది!

జెక్ సరిహద్దులలో కావలికై వుంచబడిన సేనలు సుడెటన్ల ఆటలను సాగనిచ్చుటలేదు. సుడెటన్ల హింస ఆగిపోతే ప్రకాశ శక్తులు లేస్తాయి. ఫాసిజం బలం తగ్గుతుంది. అందుచే వాటిని తొలగించ వలసిందని సుడెటన్లు పేచీ పెట్టారు. బ్రిటన్ వీరి మాటలకు తాళమువేసింది. జెక్ ప్రభుత్వం నిరాకరించింది. వెంటనే బ్రిటన్ తన సైనికాధికారులెను మధ్యవర్తుల అజమాయిషీ అనే పేరుతో సుడెటెన్ ప్రాంతాలకు పంపింది. హిట్లర్ చంక లెగరేశాడు.

అది ఇల్లా జరుగుతోంటే పోలెండు రుమేనియా దేశాలకు మధ్య కొన్ని రాయబారాలు ప్రారంభ మయాయి, లండన్ నుంచి కబురేమయిన వెడితేనే రుమేనియా ఇతర రాజ్యాలతో ప్రసంగము ప్రారంభిస్తుంది. లేకపోతే నోరు విప్పదు. పోలెండు జర్మనీ తరఫునే ఉంటోందని అందరికీ తెలిసిందే. జర్మనీ పక్షానకై తటస్థ ముఠాను తయారు చేస్తోంది. ఇంకో మూల నుండి హంగేరీ ప్రభుత్వం ఫాసిస్టులకు వ్యతిరేకంగానే వున్నా ప్రధాన మంత్రి ఇమ్రెడీ, పూర్తిగా ఫాసిస్టు విజృంభణానికి దోహదమిస్తున్నాడు. ఆస్ట్రియా హిట్లర్ స్వాధీనం అయిన కారణం చేత హంగరీ ఫాసిస్టుల బలం మరీ హెచ్చిపోయింది. హంగరీ మితవాద వర్గం జకోస్లోవేకియాపై తమ కక్షను తీర్చుకొని దానిని వశం చేసుకొందామనే అభిప్రాయంతో జర్మనీకంటె, జకోస్లోవేకియాయే తమ విరోధి యని ప్రచారం ప్రారంభించారు.

హిట్లర్ వియన్నాలో తన సేనలన్నీ నిలవ జేశాడు క్షణం నోటీసులో జకోస్లోవేకియాను కొట్టేందుకు. ఆస్ట్రియా హిట్లర్ వశ మయాక ఏదో మహద్భాగ్యం ఒలికిస్తాడని వారి ముఠావారు అందరూ ఆశపడ్డారు. వారి ఆశలన్నీ భగ్నమయాయి. మహద్భాగ్యానికి బదులు మర ఫిరంగులు మందుగుండు సామాను, సైన్యాలు సప్లయి చేశాడు ఆస్ట్రియాలో నిలవకొరకు.

రన్సిమన్ రాయబారం ద్వారా జెక్ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి, సుడెటన్లకు చాలా హక్కుల నిచ్చేటందుకు బ్రిటన్ ఒప్పించింది. ఇవి చాలవని సుడెటెన్లు గందర గోళం చేస్తున్నారు. బహిరంగంగా ఎన్నో దుండగాలు చేస్తున్నారు. జెక్కులు తమ షరతులకు కట్టుబడి వున్నారు. డాక్టర్ బినెష్ "మా సరిహద్దులలో నున్న దేశాలతో అందులోనూ ముఖ్యంగా జర్మనీతో సఖ్యత చేసుకో డానికి శాంతి స్థాపనకై పాటు పడతామ"ని ప్రకటన చేశాడు.

"ప్రేగ్‌లో జరుగుతూన్న కుట్రకంతా మాస్కో కారణం. లేకపోతే జెక్కు లేమిటి జర్మనులను బాధించడ మేమిటి." అని జర్మనీలో, గోరింగు ఉపన్యసించాడు. జర్మనీ పశ్చిమ సరిహద్దు ద్వారా 20 వ తేదీ నుండి అన్ని రాదారీలు మూసి వేస్తామనియు, ఒకటో రెండో లైన్లమీద వ్యాపార విమానాలను మాత్రమే పోనిస్తామనియు, అవైనా దిగవలసిందని ఆజ్ఞాపించినపుడు దిగకపోతే తుపాకులతో పడగొడతామనియు గోరింగు, ప్రకటన చేశాడు.

జర్మన్ సైన్యాలన్నీ రైనులాండును కాస్తున్నాయి.

అనవసరంగా యుద్ధానికి జర్మనీ దిగితే, ఫ్రాంసు పక్షాన్ని బ్రిటన్ ఉండక తప్పదనీ, అందుచే సాధ్యమైనంత వరకూ రాయబారాల ద్వారానే వ్యవహారం పరిష్కారం చేసుకుంటేనే చాలా ఉత్తమం అనీ బ్రిటిషువారి సలహా ఇస్తున్నారు.

జెకోస్లోవేకియాతో రష్యాకు ఇదివరకున్న ఒడంబడికను లిట్వినాఫ్ మళ్ళా స్థిరపరచాడు.

బ్రిటన్ వైఖరీ, రష్యా ధీమాలు చూచి, ఫ్రాంసు ధైర్యంగా వుంది. తన ఒడంబడికను కాపాడుకొనేందుకు సిద్ధంగా వుంది.

హిట్లర్ నేడు చేసిన ప్రకటనల్లో వెంటనే యుద్ధ ప్రకటను లేదు. బ్రిటన్‌ను, జకోస్లోవేకియాను, యుద్ధ భీతితో మాత్రం బెదరిస్తున్నాడు.

స్విట్జర్లాండు సరిహద్దులలో నున్న గనులలో మందు సామాన్లు ఉంచి, యుద్ధం వస్తే అవి పేల్చవలయునని, ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ విధంగా ఇతర దేశాలతో ఏ సంబంధం లేకుండా దూరంగా ఉండ డానికి వీలవుతుందని తలుస్తోంది. అన్ని దేశాలూ యుద్ధానికి తయారుగా వున్నాయి.

పాలస్టయిన్ సమస్య బ్రిటిష్ వారి దయా దాక్షిణ్యాలతో తీరదు!

ఒక సంవత్సరం క్రితం, బ్రిటిష్ ప్రభుత్వంచే నియమింపబడ్డ "పీల్ కమీషన్" పాలస్టయినులో కొంతభాగం యూదులకు, కొంత అరబ్బులకు చీల్చి ఈయాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును ప్రభుత్వం అంగీకరించి, అమలులో పెట్టడం ప్రారంభించింది. దీనితో అరబ్బుల దేశాభిమానం విజృంభించింది. తమ దేశం పాలస్టయిన్ యీ విధంగా చీల్చి వేయబడ్డం వారికేమాత్రమూ యిష్టం లేదు. తమ ప్రాణాలనైనా యిచ్చుటకు సిద్ధంగా ఉన్నారుగాని, పాలస్టయిన్ విభజన కంగీకరించడం లేదు. ప్రతిరోజూ, యూదులకు అరబ్బులకు మధ్య కలహాలు, దెబ్బలాటలు హెచ్చిపోతున్నాయి. వీటిని అణచుటలో గ్రేట్ బ్రిటన్ తన ఏకఛత్రాధిపత్యాన్ని ప్రకటిస్తోంది.

పాలస్టయిన్ ప్రాముఖ్యత.

పాలస్టయిన్ దేశం బ్రిటిష్ సామ్రాజ్యానికి అతి ముఖ్యమైన స్థానాలలో ఒకటి దీన్ని స్వాధీనంలో ఉంచుకుంటే, బ్రిటన్‌కూ ఇండియాకూ మధ్యఉన్న రహదారికి రక్షణ ఉంటుంది. పాలస్టయిన్‌లో బ్రిటిష్ వారి సైనికాశ్రయం, విమానాశ్రయం, నావికాశ్రయం ఉన్నాయి. పరాయి దేశాల్తో యుద్ధం సంభవిస్తే వీటిని అవలీలగా ఉపయోగించుకోవచ్చు. పాలస్టయిన్ స్వతంత్ర దేశం అయితే, ఏమో ఏదేశముతో స్నేహం చేసుకుంటుందో! ఇంతేకాదు. మోసల్ పెట్రోల్ పైప్ లైనుయొక్క చివరి భాగం పాలస్టయిన్‌లో ఉంది. యుద్ధంవస్తే ఈలైన్ ద్వారా బ్రిటన్‌కు కావలసిన పెట్రోలు సప్లయి అవుతుంది. అంతేగాక, పాలస్టయిన్ సూయజ్ కాలువ గట్టుమీద ఒక పెద్ద యినుప కోట మాదిరిగా ఉండి, బ్రిటిషు వారి యుద్ధ నావలను రక్షింపగలదు.

ఇన్ని ప్రయోజనాలు గలిగిన పాలస్టయిన్‌ను బ్రిటన్ సులభంగా విడిచి పెట్టుతుందా?

ఒకవైపు కొత్తగా రేకెత్తిన యూదుల జాతీయతను అరబ్బులమీదా, మరొకవైపు అరబ్బుల దేశాభిమానమును యూదులమీదా పురిగొల్పుతూ, బ్రిటిషు వారు ప్రావీణ్యతను సంపాదించిన రాజ్యాంగనీతిని పాలస్టయిన్‌లో అమలు పరుస్తున్నారు.

పాలస్టయిన్ సమస్య.

యూదులు తాము నివసించి వ్యాపారం సాగించేటందుకు పెద్ద పెద్ద అరబ్బు భూస్వాముల వద్ద విశాలమైన భూభాగములు కొనేశారు. ఆ భూములను దున్ని మగ్గాచేనే అరబ్ పేద రైతులకు భూములు లేకుండా పోయాయి. వీరంతా కూలీలుగా మారి, పనుల కొరకు పట్టణాలకు ప్రయాణమయారు. కాని, పట్టణాలలో పరిశ్రమలన్నీ యూదులవి. యూదు కార్మికులు అరబ్ కూలీలను చేర్చుకొనకుండా ఒక్క కార్మిక సంఘాన్ని లేవదీశారు, యూదులకే పనులెక్కువగా యివ్వడంచేత, నిరుద్యోగులైన అరబ్ కూలీలకూ-పనులలో ఉన్న యూదు కార్మికులకు మధ్య కొట్లాటలు చెలరేగాయి. 1829 వ సంవత్సరం వరకూ అరబ్బుల పోరాటం ఈ మాదిరిగా యూదుల మీదనే సాగింది. కాని, 1930 నుండి అరబ్బుల రాజకీయ చైతన్యం అభివృద్ధి చెంది, బ్రిటిషు ప్రభుత్వమే యీ ఆపత్తులకు కారణమని వారు గ్రహించారు, 1936 లో జరిగిన తిరుగుబాటు పూర్తిగా సామ్రాజ్య వ్యతిరేక స్వభావాన్ని కలిగియుంది.

వైరుధ్యాలు.

పాలస్టయిన్ విభజన బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఎత్తుగడ అని అందరికీ తెలిసిన విషయమే. ఈ విధానం వల్ల అరబ్బుల స్వాతంత్ర్యాన్ని సామ్రాజ్యవాదులు హరిస్తున్నారు. ఈ విషయాన్ని అందరూ అంగీకరించాలి. కాని, పాలస్టయిన్‌లో నివాసము లేర్పరచుకొన్న యూదులలో అనేక వేలమంది హిట్లరు యొక్క భయంకర ఫేసిస్టు పరిపాలనకు గురియైనారని ఏ ప్రజాతంత్రవాదీ మరచిపోకూడదు. వీరుభయులకూ మధ్య ఏర్పడిన వైరుధ్యాలను నిర్మూలించడానికి ప్రతి సామ్రాజ్య వ్యతిరేకి ప్రయత్నించాలి.

ఏవి, యీ వైరుధ్యాలు? మొదటిది: యూదుల నివాసమునకు సంబంధించిన సమస్య. ఫేసిస్టు దేశాలలో వీరు అధోగతి ననుభవిస్తున్నారు. ఈ అధోగతినుండి విముక్తిని పొందడానికి మార్గం పాలస్టయిన్‌కు పారిపోవడం కాదు. ఇతరుల మాదిరిగా వీరుకూడా ప్రజాతంత్ర హక్కులకై పోరాడాలి. కాని, వీరి నాయకులు 20 సంవత్సరాలలో 20 లక్షల మంది యూదు ప్రజలను పాలస్టయిన్‌లో దింపుట కాలోచిస్తున్నారు. ఒకవేళ, వీరు యీ ఉద్దేశాన్ని సఫలపరచు కొన్నప్పటికీ, (సఫల పరచుకో లేరు). ఇలా అనేక లక్షలమంది యూదులు ఇతర దేశాల్లో అనేక కడగండ్లకు లోను గావలసిందే! అదీ గాక, అసంఖ్యాకులైన అరబ్బుల మనోభీష్టములకు వ్యతిరేకంగా, నేటి పరిస్థితుల్లో, యూదు జాతి వారు పాలస్టయిన్ వచ్చి నివాసం లేర్పరచుకోవడం ఏమాత్రమూ న్యాయంకాదు. ఏ దేశంలోనైనా ఆ దేశపు ప్రజల అనుమతి లేకుండా మరొక జాతివారు గాని దేశస్థులు గాని ప్రవేశించుట న్యాయం అని ఏ ప్రజా తంత్రవాదీ వాదించలేడు.

అంతేగాక, పాలస్టయిన్‌కు యికనుండి వచ్చే యూదులందరూ కార్మికులై యుండాలి. ఎందువల్లనంటే, ఆర్థిక మాంద్యంవల్ల కొత్త పెట్టుబడిని తెచ్చి పాలస్టయిన్‌లో పరిశ్రమలు స్థాపించే ఉద్దేశం ఏ పెట్టుబడిదారుకూ సహజంగా ఉండదు. కార్మికులే పనుల కొరకు రావాలి. ఈ విధంగా కొత్త యూదు కార్మికుల సంఖ్య నానాటికీ వృద్ధి చెందేయెడల దేశానికి తీరని ముప్పు వాటిల్లుతుంది. కాబట్టి, మొట్టమొదట అరబ్బులకూ — యూదులకు మధ్య నేడు ఉన్న తగాదాలు, కలహ కారణాలు నిర్మూలించబడి శాంతి ఏర్పడాలి.

రైతు సమస్య.

దేశమందలి భూస్వాములను యూదు పెట్టుబడిదార్లు, అరబ్ పెట్టుబడిదార్లు కొనివేయడం వల్ల రైతులు దరిద్రావస్థలో పడుతున్నారు. కాబట్టి దీన్ని ఆపేటందుకు వెన్వెంటనే శాసనం ఒకటి ప్రభుత్వం చేయాలి. భూమిని దున్నే ప్రతి రైతుకూ ఆ భూమిపై హక్కు గ్యారంటీ చేయాలి. స్వల్ప వడ్డీలపై రైతులకు ప్రభుత్వం అప్పులీయాలి. మక్తాను నిర్ణయించాలి. పంటలకు న్యాయమైన ధరలు, రెమిషన్లు, భూమి శిస్తు విధానంలో మార్పులు — యివి వెంటనే కలుగజేయాలి.

కార్మిక సమస్య.

అరబ్ పెట్టుబడిదార్ల క్రింద ఎంత మంది అరబ్ కార్మికులు పనిచేసి నప్పటికీ పని లేక ఇంకా యెంతో మంది మిగిలి పోతారు. కనుక వీరు తప్పనిసరిగా యూదు పెట్టుబడిదార్ల క్రింద పని చేయవలసి వస్తోంది. అయితే, వీరి జీతాలు యూదు కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే, బహు స్వల్పం. ఇందువల్ల, యూదు కార్మికులనూ, అరబ్ కార్మికులనూ మధ్య పోటీలు, కలతలు, కొట్లాటలు సంభవిస్తున్నాయి. వీటి వల్ల లాభం పొందేది యూదు పెట్టుబడిదార్లు. ఈ రహస్యం గ్రహించి, యూదు కార్మికులు తమ ట్రేడ్ యూనియన్ సంస్థ యొక్క ఆదర్శాలను మార్చుకొని పని చేయవలసి యుంటుంది. అరబ్బులను యూదు ఫ్యాక్టరీలోనికి రాకుండా చేయాలనే ఉద్దేశం విడిచి పెట్టాలి. ఎందువల్ల నంటే, యీ పోటీలో యూదు కార్మికుల వేతనములు కూడా అరబ్ కార్మికుల వేతనముల లెవెల్‌కు పడి పోతాయి. నిజమైన ట్రేడ్ యూనియన్ ఆదర్శాలతో, అనగా కార్మికుల అందరి యొక్క హక్కుల కొరకు సమష్టిగా పాటుపడే సంస్థగా యిప్పటి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును మార్చాలి.

కాని, యిట్టి ఒడంబడిక ఇప్పుడు సాధ్యం కాదు. ప్రజా తంత్ర పరిపాలన పాలస్టయినులో ఏర్పడినప్పుడే, అనగా నేటి మ్యాండేట్ పరిపాలనా పద్ధతి అంతరించి నప్పుడే. యీ ఒడంబడిక సాధ్యం అవుతుంది. యూదుజాతి వారికి భాష విషయంలోను, విద్యాలయముల విషయంలోనూ, స్థానిక సంస్థల విషయములోనూ స్వాతంత్ర్యం ఈయబడాలి. శాసన సభలో యూదులకు, అరబ్బులకు వారి వారి జనసంఖ్యకు తగినట్టుగా ప్రాతినిధ్యం ఈయాలి అప్పుడే ఉభయులకు మధ్య శాంతి యేర్పడగలదు.

అట్టి రాజ్యాంగం వస్తే, కొత్త యూదులను రానీయరాదు అనే యిప్పటి ఆందోళన ఉండదు.

ప్రజా తంత్ర రాజ్యాంగం గల పాలస్టయిన్ దేశం ఇరాక్, సిరియా, లెబనాన్‌లవలె గ్రేట్ బ్రిటన్‌తో సంధి ఒకటి చేసుకొన వచ్చును. అనగా, పాలస్టయిన్‌కు సంపూర్ణ స్వాతంత్ర్యం యిప్పుడే రావాలని కాదు. నేటి పరిస్థితులలో యిట్టి కార్యక్రమం ద్వారా పాలస్టయిన్ యందలి ప్రజా సామాన్యం ఐక్యతను పొందుటకవకాశం ఏర్పడుతుంది. తరువాత, ప్రాచ్యదేశ ప్రజలందరూ కలసి బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వంతో అంతిమ పోరాటాన్ని సాగించవచ్చును.

కాబట్టి, యూదు జాతివారిలో గల ప్రజా తంత్ర శక్తులు అరబ్బుల స్వాతంత్ర్య పోరాటం యెడల సానుభూతితో మెలగునట్లు పని చేయాలి. మొట్టమొదట అరబ్-యూదుల సమావేశం ఒకటి ఏర్పాటు కావాలి, దీనికి పూర్వం, నిర్బంధ, ప్రవాస శిక్ష లనుభవిస్తూన్న అరబ్ రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేయాలి. అట్టి సమావేశంలో పాలస్టయిన్ యొక్క ప్రజాతంత్ర రాజ్యాంగ విధానమును నిర్ణయించవచ్చును. అట్టి పరిపాలనా విధానం సార్వజనిక వోటింగు పద్ధతిపై ఆధారపడి యుండాలి. తరువాత ఎన్నికలు జరుపబడాలి. ఈ విధంగా ఏర్పడు ప్రజాతంత్ర రాజ్యాంగ విధానం యొక్క కర్తవ్యం, పైన ఉదహరింపబడిన కార్యక్రమాన్ని అమలు పరచుట. అనగా:

(1) మ్యాండేట్ పరిపాలనా విధానపు రద్దు.

(2) ప్రజాతంత్ర సూత్రములపై పరిపాలించబడు ఒక ఐక్య పాలస్టయిన్.

(3) యూదుల రాకను కంట్రోల్ చేయుటకు జాయింటు కమిటీ నిర్మాణం.

(4) భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం శాసనములు చేయుట, ఇతర రైతాంగ చట్టములు.

(5) అరబ్-యూదు కార్మికుల ఐక్య సంఘటన.

వ్యవసాయ కూలీల సమ్మె.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా కోలగట్ల గ్రామములో వ్యవసాయ కూలీల సమ్మె. యీ గ్రామములో షుమారు 20 రోజుల నుండి వ్యవసాయ కూలీలు సమ్మె సాగించు చున్నారు. సమ్మెకు కారణములు పిచ్చముంతలు పోవాలి. న్యాయమైన కూలీ యివ్వాలి, అక్రమంగా తిట్టుట, దొంగ కేసులు పెట్టుట మానాలి, అని అనడమే. యివే సమ్మెదార్ల కోర్కెలు. యీ కూలీలు కోరిన కూలీ చుట్టుప్రక్కల గ్రామాలలో ఇస్తూ వున్నారు కాని యీ గ్రామములో వుండు పెద్ద భూస్వాము లిద్దరు వూళ్లో వుండు చిన్న రైతులలో కులతత్వా లెక్కించి మాల మాదెగలకు సమ్మెచేసే అధికారమా అంటూ కూలీలను కష్టపెట్ట మొదలుపెట్టారు. దారులు బిగించి అక్రమంగా పశువులను బందెల దొడ్లో తోలించారు; చాకలి మంగలి వారిని బిగించేరు. మా పొలాల్లో మనుష్యులు పశువులు యెవ్వరుగాని అడుగు పెట్టవద్దని బెదిరించారు. కూలీలకు భావిలేదు. యీ భూస్వాములలో ఒకరిది కూలీ వాడకు సమీపంగా వుండిన భూమిలో ఉంది. ఆ నీళ్ళ భావియే కూలీలకు ఆధారం. ఇప్పుడు ఆభావికి నీళ్ళకు రానివ్వటము లేదు. యివి అన్నిగాక కూలీలు పెద్దపెద్ద రైతుల దగ్గర కౌలుకు యేదో కొన్ని భూములు తీసుకొని వుండినారు. ఆభూములు కూలీలు యిదివరకే దున్ని యెరువుతోలి వుండిరి. సమ్మె చేసారనే కారణంచేత ఆభూములు దౌర్జన్యంగా ఆక్రమించుకొని రైతులు సాగుచేస్తున్నారు. యీ విషయాలంతా కూలీలు నెల్లూరు జిల్లా కలెక్టరు గార్కి తెలుపుకొంటే తహసిల్‌దారు గారిని విచారణకు వేసారు. కాని రైతులు తహసీల్‌దారుని మాట వినలేదు. యింకా కాంగ్రెసువారు, సోషలిస్టులు యెంతో రాజీ ప్రయత్నాలు చేసేదుకాని రైతులు యివి యేవీ చెవిని పెట్టలేదు. కూలీలు మాత్రం ధైర్యంగా శాంతంతో సమ్మెను నడుపుచున్నారు. కూలీలమీద యేవో లేనిపోని దొంగ కేసులు పెట్టవలెనని కూడా చూస్తున్నారట. పోలీసువారు వస్తే కూలిలనే దబాయించేస్తున్నారు. కాబట్టి గవర్నమెంటువారు తొందరలో యీ సమ్మెను రాజీ చేయకున్న చాలా అన్యాయాలకు కూలీలు గురి అవుతారు. తర్వాత విషయము యెట్లు పరిణమిస్తుందో ననిపించుచున్నది. తొందరలో యీ సమ్మెను రాజీ చేయవలెనని ప్రార్థించుచున్నాము.

వాసిన } గంగా చినకొండయ్య.
1—9—38.

దేవదాసు

శరత్ బాబు విరచితం

పూర్వకథ

నారాయణ ముఖర్జీగారి అబ్బాయి దేవదాసూ, పొరుగింటి నీలకంఠ చక్రవర్తి గారి అమ్మాయి పార్వతీ చిన్ననాట నుండీ స్నేహంగా పెరిగారు. అల్లరీ ఆగాలతో బాల్యం గడిపారు. పార్వతి దేవదాసును ప్రేమించింది.

పార్వతి నాయనమ్మ, దేవదాసుకు తన మనుమరాలను ఇవ్వాలని తలచి ఒక రోజున దేవదాసు తల్లివద్ద ఆ ప్రసంగం తెచ్చింది. కాని ఆమె తిరస్కరించింది. పిల్లల నమ్ముకొనే వారనీ, పొరిగింటి వాళ్ళనీ, నారాయణ దంపతులు "ఛీఛీ" అను కుంటారు.

పార్వతి తండ్రికి ఈ తిరస్కారం రోషం తెచ్చింది. ఒక్క వారంలో పెండ్లి కుదుర్చుకొని లగ్నం పెట్టుకు వచ్చాడు. వరుడు జమీందారే. కాని వయసు దాదాపు నలభై. ద్వితీయ వివాహం.

పార్వతి - సఖియైన మనోరమతో మాటాడేటప్పుడు, తాను దేవదాసును ప్రేమించాననీ, అతనినే పెండ్లియాడుమని బ్రతిమాలుతాననీ చెప్పింది. మనోరమ ఆశ్చర్యపడ్డది.

ఆరాత్రే జంకుగొంకు లేకుండా పార్వతి దేవదాసు గదిలో ప్రవేశించింది. అపకీర్తి రాదా అని దేవదాసు భయపడతాడు. అపకీర్తి రాకుండా తనను పెండ్లాడమని లేకపోతే నదిలో మునిగి చస్తాననీ పార్వతి అంటుంది. దేవదాసు మంత్రముగ్ధునిలాగా మౌనంతో కూర్చుంటాడు. పార్వతి అతని కాళ్ళమీద బడి గద్గద స్వరంతో "ఇచట కొంచెం చోటివ్వు! దేవదా" అని అంటుంది.

ఆ తరువాత

తర్వాత ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. దేవదాసు కాళ్ళ మీది నుంచి అశ్రు బిందువులు తెల్లని శయ్య మీద పడ నారంభించాయి.

చాలసే పయిన తర్వాత దేవదాసు పార్వతి ముఖం పైకెత్తి— "పారూ, నేను తప్ప నీ కిక గత్యంతరం లేదా?" అని అడిగాడు.

పార్వతి జవాబివ్వ లేదు. మరల అలాగే పాదాల మీద తల పెట్టింది. ఈమె అశ్రు వాక్కులు, ఘన దీర్ఘ నిశ్వాసలు, ఆ నిస్తబ్ధమైన గదిని ఆవరించినట్టుగా కానుపించినవి. గడియారం టంగ్-టంగ్, అని రెండు కొట్టింది. దేవదాసు—"పారూ!" అని పిలిచాడు.

పార్వతి రుద్ధకంఠంతో—"ఏమిటి?" అన్నది.

"మా అమ్మకీ నాయనకీ బొత్తిగా ఇష్టం లేదు—తెలుసునా?"

పార్వతి 'తెలుసు' అన్నట్టుగా తల తిప్పింది. తర్వాత ఇద్దరూ మాట్లాడకుండా చాలా సేపు కూర్చున్నారు.

"అయితే నురెండు కిలా అంటావు?" అన్నాడు దేవదాసు నిట్టూర్చి.

నీళ్ళల్లో మునిగిన వ్యక్తి ఎలా గుడ్డిగా నేలను పట్టుకు కూర్చుంటారో, అది వదలటానికి ఎలా ఇష్టపడదో—అలానే, అజ్ఞానివలె పార్వతి దేవదాసు కాళ్లు రెండూ పట్టుకుని— "నే నిక ఏమీ విన దలచ లేదు. దేవదా!" అన్నది ముఖం వంక చూస్తూ.

"మరి తల్లి దండ్రులకు ఎదురు తిరగ మంటావా, పారూ?"

"తప్పేమున్నది? ఎదురు తిరుగు."

"అయితే నువ్వెక్కడ ఉంటావు?"

పార్వతి ఏడుస్తూ అన్నది: "నీ పాదాల—"

తర్వాత ఇద్దరూ మరల మాట్లాడకుండా కూర్చున్నారు. గడియారం నాలుగు గంటలు కొట్టింది. ఎండాకాలపు రాత్రి. ఇంకా కాసేపటికే తెల్లవారుతుంది. దేవదాసు పార్వతి చెయ్యి పట్టుకుని— "పద, నిన్ను ఇంటి దగ్గర విడిచిపెట్టి వస్తాను." అన్నాడు.

"నా వెంట వస్తావా?"

"పోయే దేముంది? అంతగా చెడు పేరు వస్తే తర్వాత చూసుకో వచ్చు—"

"ఐతే పద."

ఇద్దరూ చప్పుడు చేయకుండా బయలుదేరారు.

౨

మరునాడు దేవదాసు, తండ్రితో చాలా కొద్ది సేపు మాట్లాడాడు.

తండ్రి—నువ్వు పుట్టినప్పటినుంచీ నన్ను వేధిస్తూనే వచ్చావు. ఇక బ్రతికినన్నాళ్ళూ నీ బాధలు తప్పేటట్టు లేవు. నీ నోట ఈమాట వినటం నాకేమీ ఆశ్చర్యం లేదు.

దేవదాసు మాట్లాడకుండా తల వంచుకు కూర్చున్నాడు.

తండ్రి—నా కీ సంగతంతా తెలియదు. మీ అమ్మా నువ్వూ కలిసి ఏదో ఒకటి చేసుకోండి.

తల్లి ఈ మాట విని ఏడ్చింది: — "నాయనా, ఇది కూడ మా రాతలో ఉందా!" అన్నది.

ఆనాడే దేవదాసు పెట్టె బేడా సర్దుకొని కలకత్తా వెళ్ళిపోయాడు. ఈ సంగతులు తెలియగానే అసలే కఠినంగా ఉన్న పార్వతి ముఖం ఇంకా కఠోర మైంది. నవ్వి ఊరుకున్నది. క్రిందటి రాత్రి సంగతి ఎవ్వరికీ తెలియ లేదు; తానూ చెప్పలేదు. కాని మనోరమ వచ్చి— "పారూ, దేవదాసు కలకత్తా వెళ్లాడట నిజమేనా?" అని అడిగింది.

"ఆఁ—"

"మరి నిన్నేమి చేసి పోయాడే?"

ఏమి చేసిందీ పార్వతికే తెలియదు; ఇతరుల కేమి చెప్పుతుంది?

నేటికి కొన్ని దినాల నుంచి రాత్రిం బగళ్ళూ ఆమె ఈ సంగతి ఆలోచిస్తున్నది. కాని, ఇందులో ఆమెకు ఆశ ఎంత ఉన్నదో నిరాశ ఎంత ఉన్నదో, ఏ మాత్రమూ స్థిరపరుచుకో లేకపోయింది. ఇలాంటి దుస్సమయాల్లో, ఆశా నిరాశల ఒడ్డు ఏదీ దొరకనప్పుడు, మానవుని దుర్బల మనస్సు భయపడుతూనైనా సరే— ఆశ వైపుకే మొగ్గుతూ ఉంటుంది. ఏదైతే తనకు మేలో అదే ఆశిస్తుంది. ఇచ్ఛతో కానీయండి, అనిచ్ఛతో కానీయండి ఆ వైపే చూస్తూ ఉంటుంది. పార్వతి కూడా— ఈ స్థితిలో, కొంత బలవంతంగానే—నిన్న రాత్రి ప్రసంగం వృథా పోదని ఆసించింది. విఫలమైతే తన స్థితి ఏమవుతుందని ఆమె ఆలోచించనే లేక పోయింది. అందుకనే ఆమె— "దేవదా మళ్ళీ వస్తాడు, నన్ను పిలిచి "పారూ, నా బొందిలో ప్రాణ ముండగా నిన్నితరుల చేతికి పోనిస్తానా!" అని అంటాడని భావించింది. కాని రెండు రోజులు గడచిన తర్వాత పార్వతికి ఈ క్రింది ఉత్తరం వచ్చింది.

"పార్వతీ, ఇవ్వాళటికి రెండు రోజుల నుంచీ నేను నీ సంగతే ఆలోచిస్తున్నాను. నా తల్లి దండ్రులలో ఎవ్వరికి కూడా మన వివాహమంటే బొత్తిగా ఇష్టం లేదు. నిన్ను సుఖపెట్టాలంటే వారిని చాలా కష్టపెట్టాల్సి ఉంటుంది— ఇది నాకు అసాధ్యం. అదీ కాక వారిని ఎదిరించి నే నీ పని ఎలా చేయగలను? నీకు మరల ఉత్తరం రాస్తాననే నమ్మకం నాకు లేశం కూడా లేదు. అందు కని, ఈ ఉత్తరంలోనే అంతా విప్పి రాస్తున్నాను.

"మీది కులీన కుటుంబం కాదు. నువ్వు పిల్లల్ని అమ్ముకునే ఇంటి పిల్లవు. అమ్మ నిన్నెంత మాత్రం ఇంట్లో అడుగు పెట్టనివ్వదు. పైగా పొరుగు కుటుంబం— ఇది కూడా ఆమెకు ఇష్టం లేదు. నాన్న సంగతి నీకు తెలుసునుగా. ఆ రాత్రి సంగతి జ్ఞాపకం వస్తే నాకు చాలా కష్టంగా ఉంటున్నది. కారణం, నీవంటి అభిమానిని ఎంత దుఃఖంలో ఉంటే ఈ పని చేస్తుందో నాకు తెలుసును.

"ఇంకో సంగతి, నిన్ను నేను చాలా ప్రేమిస్తున్నట్టుగా నాకెప్పుడూ తోచ లేదు. ఇవ్వాళ కూడా, నీ కోసం నా అంతరంగం ఎక్కువ పరితపించటం లేదు. ఇక నువ్వు కష్టపడిపోతావనే, నాకున్న దిగులూ, చింతా. ప్రయత్నించి నన్ను మరచిపో. నీకు సాఫల్యత కలుగు గాక! అని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను."

— దేవదాసు.

ఉత్తరం పోస్టు చేయనంతవరకు దేవదాసు ఒక విధంగా ఆలోచించాడు. చేసిన మరు క్షణం నుంచీ ఇంకో విధంగా ఆలోచింప నారంభించాడు—రాయి విసరి రెప్ప వాల్చకుండా అటే చూడ నారంభించాడు. ఒక అస్పష్టమైన ఆశంక అతని మనస్సును ఆవరింప సాగింది—ఈ రాయి పార్వతి తల మీద ఎలా పడుంతుంది?—బాగా తగులు తుందా?—అసలు బ్రతుకు తుందా? అని ఆలోచింప నారంభించాడు. పోస్టాఫీసు నుంచి తిరిగి వస్తూ ఉంటే అతనికి ఆ రాత్రి సంగతే—పార్వతి కాళ్ళ మీద తల పెట్టి ఏడ్చిన సంగతి—తలపుకు రా మొదలు పెట్టింది. తాను చేసిన పని మంచిదేనా? అన్నిటికంటే అతను ముఖ్యంగా ఆలోచిస్తున్నది. పార్వతిలో దోష మేమీ లేనప్పుడు తల్లి దండ్రులు ఎందుకు వద్దన్నారా? అని. దేవదాసుకు వయో వృద్ధితో పాటు కలకత్తాలో ఉన్న అనుభవం కూడా తోడయింది. కేవలం, లోకాచారం, కుల మర్యాదల మీద ఆధారపడి, అర్థం లేకుండా ఒక ప్రాణాన్ని నాశనం చేయటం భావ్యం కాదని అతను గ్రహించాడు. పార్వతి తన హృదయ జ్వాలను చల్లార్చుకోటానికి నదికి పరిగెత్తితే, ఈ పాపం సృష్టి కర్తకు అంటు కోదా?

బసకు తిరిగి వచ్చి దేవదాసు గదిలో పండుకున్నాడు. ఇప్పుడతను మెస్‌లో ఉంటున్నాడు. మేనమామ ఇల్లు అతను ఎప్పుడో వదలి పెట్టాడు—అక్కడ అతనికి అంత వీలుగా ఉండలేదు. దేవదాసు గదికి పక్క గదిలో చున్నీలాల్ అనే యువకుడొకడు ఇప్పటికి తొమ్మిది సంవత్సరాల నుండీ ఉంటున్నాడు. ఇతని ఈ దీర్ఘ కలకత్తా నివాసం, బి. ఏ. చదవటంలోనే గడిచి పోయింది. ఇంకా ఇతనికి సాఫల్య దేవత ప్రసన్నం కాలేదు. చున్నీలాలు తన నిత్య కృత్యానికి—సాయంత్రం షికారుకు— బయలు దేరాడు. తెల్లవారినాక తిరిగి వస్తాడు. దాసీ వచ్చి దీపం వెలిగించి పోయింది. దేవదాసు తలుపులు బిగించి పండుకున్నాడు.

తర్వాత ఒక్కొ రొక్కరుగా మెస్‌లో వాళ్ళంతా తిరిగి వచ్చారు. భోజనానికి దేవదాసును కూడా పిలిచారు. కాని అతను లేవ లేదు. చున్నీలాలు రాత్రి ఎప్పుడూ భోజనానికి ఉండడు—ఇవ్వాళ కూడా రాలేదు.

అప్పుడు రాత్రి ఒంటి ఘంట అయి ఉంటుంది. మెస్‌లో దేవదాసు తప్ప ఇంకెవ్వరూ మేలుకొని లేరు. చున్నీలాలు తిరిగి వచ్చి, దేవదాసు గదిలో దీపం వెలుగుతూ ఉండటం చూసి నిల బడ్డాడు. తలుపు వేసే ఉన్నది:—"దేవదాస్! ఇంకా మేలుకొని వున్నా వటోయి!" అని కేక వేశాడు.

"చక్రపాణి"

అనువాదం

"ఆఁ. ఇవ్వాళ నువ్వు రాత్రి పూట వచ్చావేం?" అన్నాడు దేవదాసు లోపల ఉండే.

"ఒంట్లో బాగా లేదోయి." అని నవ్వు తుంటూ వెళ్లి పోయాడు. కాసేపటికి మళ్ళీ తిరిగి వచ్చి—"దేవదాస్! ఒక మాట తలుపు తీస్తావా?" అని అడిగాడు.

"ఆఁ. ఎందుకు?"

"పుగాకు ఉన్నదా?"

"ఉన్నది." అని దేవదాసు తలుపు తెరచాడు.

చున్నీలాలు హుక్కాలో పుగాకు వేస్తూ—"ఇంకా మేలుకొని ఉన్నావేం, దేవదాస్!" అన్నాడు.

"రోజూ నిద్ర పట్టు తుందా?"

"పట్టదా? నీవంటి బుద్ధి మంతు డెప్పుడూ రాత్రి రెండో ఝాము చూసి ఉండడని నేను అనుకొనే వాడిని. ఇవ్వాళ నాకు కొత్త పాఠం నేర్పావు!" అన్నాడు చున్నీ వెటకారంగా.

దేవదాసు మాట్లాడ లేదు. చున్నీ హుక్కా తాగుతూ ప్రశ్నించాడు.

"దేవదాస్! నువ్వు ఇంటి దగ్గర నుంచి వచ్చి నప్పటి నుంచీ ఒక తరహాగా ఉన్నావు. నీ మనస్సులో ఏమన్నా చింతగా ఉందా?"

దేవదాసు అన్య మనస్కుడై నాడు. జవాబివ్వలేదు.

"నీ మనస్సు బాగా లేదు కదూ?"

దేవదాసు చివ్వున లేచి కూర్చుని, వ్యగ్ర భావంతో చున్నీ ముఖం వంక చూస్తూ—"సరే గాని, చున్నీ! నీ మనస్సులో ఏమీ చింత లేదా?" అని అడిగాడు.

"ఏమాత్రం లేదు!" అన్నాడు చున్నీ నవ్వుతూ.

"జీవితంలో ఎప్పుడూ నీకు చింత కలగలేదా?"

"ఈ సంగతి ఎందుకు?"

"నాకు వినాలని చాలా కోరికగా ఉన్నది."

"అలాగయితే ఇంకో మాటు విందువు గాని లే!"

"సరే, చున్నీ! నువ్వు రాత్రంతా ఎక్కడ ఉంటావు?"

"నీకు తెలియదూ?" అన్నాడు చున్నీ మందహాసం చేస్తూ.

"ఏదో విన్నాను, కాని పూర్తిగా తెలియదు."

చున్నీ ముఖాన ఉత్సాహ చిహ్నాలు స్పష్టంగా కనుపించినవి. ఇలాంటి ప్రసంగాలలో విశేష మేమీ లేకపోయినా కాస్త కనువెరపయినా ఉంటుంటుంది. అభ్యాస దోషం దాన్ని కూడా తుడిచివేసింది. కౌతుకంతో —"దేవదాస్! పూర్తిగా తెలుసుకోవా లంటే నువ్వు కూడా నా మాదిరి కావాలి! రేపు నా వెంట వస్తావా?" అని కన్ను గీటుతూ అడిగాడు.

దేవదాసు కొంచెం సేపు ఆలోచించి— "అక్కడ చాలా ఆనందంగా ఉంటుందనీ, మనస్సుకు ఏమీ కష్టంగా ఉండదనీ అంటారు— నిజమేనా?" అని అడిగాడు.

"నూటికి నూరు పాళ్ళు నిజం!"

"అలాగయితే నన్ను కూడా తీసుకు పోతావా—వస్తాను."

మర్నాడు ప్రొద్దు క్రుంకక ముందే చున్నీలాలు దేవదాసు గదిలోనికి వచ్చాడు. దేవదాసు చాలా ఆదుర్దాగా సామానంతా కట్టుతూ ఉన్నాడు. చున్నీకి విస్మయం కలిగింది.

"ఏమోయి పోవద్దా?" అని అడిగాడు.

దేవదాసు తల ఎత్తకుండానే-"ఆఁ, ఎందుకు పోవద్దు?" అన్నాడు.

"మరి, ఇదంతా ఎందుకు—?"

"పోవటానికే— ఈ ప్రయత్నం."

'మంచి ప్రయత్నమే' అని మనస్సులో అనుకొని చున్నీ మంద హాసం చేసి—"గది మొత్తం అక్కడకు తీసుకెళ్ళి పెడతావా?" అని అడిగాడు.

"మరి, ఎక్కడ పెట్టి పోతాను?"

చున్నీలాలుకు ఏమీ బోధ పడ లేదు.

"సామాను ఇంకెవ్వరి దగ్గర పెట్టి పోతావు? గదిలోనే ఉంటుంది"

దేవదాసు అకస్మాత్తుగా నిద్ర నుంచి లేచిన వాడల్లే కళ్లు తెరచి— "ఇవ్వాళ ఇంటికి వెళ్ల తున్నాను చున్నీ!" అన్నాడు సిగ్గు పడుతూ.

"అదేమిటోయి-మళ్ళీ ఎప్పుడొస్తావు?"

"ఇక రాను." అన్నాడు దేవదాసు తల తిప్పుతూ.

చున్నీ విస్మయంతో అతని వంక చూస్తూ ఉండి పోయాడు.

"ఈ పైకం తీసుకొని నాకు కొన్ని అప్పులున్నవి, తీర్చు. ఇంకా మిగిలితే మెస్‌లోని దాస దాసీలకు పంచి పెట్టు. నేనిక కలకత్తా రాను."

'కలకత్తా రావటం మూలాన నేను చాలా పోగొట్టు కున్నా'నని మనస్సులో అను కున్నాడు.

కిశోర వయస్సులో పోకిరీగానూ, పొగరు పోతుగానూ తిరిగే టప్పుడు అతనికి అయాచితంగా లభించిన పద దళిత రత్నమే నేడు కలకత్తా కంటె కూడా గొప్పది గానూ, విలువ గానూ కనుపించ సాగింది. ఇప్పుడు, అతని కళ్ళ మీద కప్పిన తెర ఒకటి తొలగింది.

'చున్నీ! విద్యా, బుద్ధి, జ్ఞానం, ఉన్నతీ—అన్నీ కూడా మన సుఖం కోసమే. ఏ విధంగా నన్నా చూడు, ఇవి మన సుఖం పెంపొందించటానికి తప్ప మరెందుకూ పనికి రావు!' అన్నాడు చున్నీ ముఖం చూస్తూ దేవదాసు.

చున్నీ మధ్యనే అడ్డుతూ—"అయితే నువ్వికి చదువు మానేస్తావా, ఏమిటి?" అని అడిగాడు.

'తప్ప కుండా. నే నీ కొద్ది జ్ఞానం కోసం ఎంతో పోగొట్టుకోవాల్సి ఉంటుందని నాకు పూర్వం తెలిసి నట్లయితే, నే నసలు కలకత్తా ముఖమే చూసే వాణ్ణి కాదు!'

'నీ కేమైనా పూనిందా ఏమిటి?'

'నీకు మళ్ళీ కనపడటం సంభవిస్తే అంతా చెబుతాను.'

రాత్రి తొమ్మిది ఘంటలయి ఉంటుంది. మెస్‌లో ఉండే వాళ్ళంతా చున్నీలాలుతో సహా-సామానంతా బండి కెక్కించి దేవదాసు మెస్సుకు సలాం పెట్టి పోవటం-ఆశ్చర్యంతో చూశారు. అతను వెళ్ళి పోయిన తర్వాత చున్నీలాలు కోపంతో-'ఈ రకం ముచ్చుల్ని ఆచరణను పట్టి కనుక్కోవటం కష్టం.' అని మెస్‌లో వాళ్లంతా వినేటట్టు కేకలు వేయ నారంభించాడు.

౩

కొంత దూర దృష్టి కలవారు, ప్రపంచం చూసిన వారు, ఎవ్వరూ ఏ వస్తువునైనా కంటితో చూడగానే తమ అభిప్రాయాన్ని వెల్లడించరు. రెండు వైపుల చూసి నాలుగు వైపుల మాటలు చెప్పరు—పూర్తిగా తెలుసుకోనిది మంచో చెడో తేల్చరు. వీరు ఒక రకం. ఇంకోరకం మనుష్యులున్నారు. వీరు దీనికి పూర్తిగా వ్యతిరేకులు! దేన్ని గురించైనా ఎక్కువ సేపు ఆలోచించే ఓర్పు వీరికి ఉండదు. చేతిలో పడటంతోటే మంచో చెడో తేల్చి పారవేస్తారు. త్రిప్పి చూసే పరిశ్రమకూడా చేయరు-నమ్మకం మీదనే పోనిస్తారు. ఇలాంటి మనుష్యులు ప్రపంచంలో ఏ పనీ చేయలేదు అంటానికి వీలు లేదు. ఒక్కొక్కప్పుడు అందరికంటె ఎక్కువనే చేస్తారు. అదృష్టం సరిగా ఉంటే కొండ కొమ్మున ఎక్కి కూర్చుంటారు. సరి తప్పితే అగాధంలో చిరకాలం విశ్రమిస్తారు. అక్కడనుంచి లేవలేరు—కూర్చోలేరు—వెలుతురువంక చూడలేరు. నిశ్చలంగా, జడపిండం వలె శవం మాదిరి పడి ఉంటారు. ఈ తరగతికి చెందిన వాడు దేవదాసు!

మరునాడు దేవదాసు ఇంటికి తిరిగి వచ్చాడు. తల్లి ఆశ్చర్యంతో— "దేవా! కాలేజీకి మళ్ళీ శెలవలు ఇచ్చారా?" అని అడిగింది.

"ఆఁ." అని దేవదాసు అన్య మనస్కుని వలె వెళ్ళిపోయాడు. తండ్రి గారి ప్రశ్నకుకూడా ఇలాంటిదే ఒక జవాబు చెప్పి తప్పుకు వెళ్లాడు. వారికి ఏమీ అర్థము కాక భార్యను అడిగితే ఆమె బుద్ధి నంతా వినియోగించి— "ఇంకా ఎండలు తగ్గ లేదు కదూ? మళ్ళీ సెలవ లిచ్చారు." అని అన్నది.

దేవదాసు రెండు రోజులు కాలు కాలిన పిల్లివలె తిరిగాడు. కాని అతని కోరిక నెరవేర లేదు. పార్వతి ఒంటరిగా కనపడ లేదు. ఒక నాడు పార్వతి తల్లి దేవదాసును చూసి—"వచ్చిన వాడివి ఎలానూ వచ్చావు నాయనా, పారూ పెళ్లిదాకా ఉండి పో!" అన్నది.

దేవదాసు—"సరే!" అన్నాడు.

మధ్యాహ్నం పూట భోజనాలవీ అయాక పార్వతి నిత్యమూ నదికి నీటికి పోతుంది. ఇత్తిడి బిందె చంకను పెట్టుకొని ఇవ్వాళ కూడా నీళ్ళ రేవుకు వచ్చింది. సమీపంలోనే రేగు చెట్టు చాటున దేవదాసు నీళ్ళల్లో గాలం వేసుకు కూర్చుని ఉన్నాడు. అతన్ని చూసి పార్వతి తిరిగి పోదామా అని ఒక మాటు మనస్సులో అనుకున్నది - చప్పుడు చేయ కుండా నీళ్లు ముంచుకు పోదామని మరో మాటు అను కున్నది. కాని తత్తర పాటువల్ల ఏ పనీ చక్కగా నెరవేర్చ లేక పోయింది. బిందె క్రింద పెట్టుతూ ఉండగా. బహుశా కొంచెం చప్పుడై ఉండ వచ్చు. దేవదాసు తల ఎత్తి చూసి - "పారూ! ఒక మాట వినిపో!" అని చెయ్యి ఊపుతూ పిలిచాడు.

పార్వతి నెమ్మదిగా దగ్గరకు వచ్చి నిల బడింది. దేవదాసు ఒక మాటు తల ఎత్తి చూశాడు. మరల స్వీటి వంక శూన్య దృక్కులతో చూస్తూ ఉండి పోయాడు. మాట్లాడ లేదు.

'నా కేమైనా చెప్తావా? దేవదా?' అని అడిగింది పార్వతి.

దేవదాసు దృష్టి మరల్చ కుండానే - "ఆఁ. కూర్చో!" అన్నాడు.

పార్వతి కూర్చో లేదు. తల వంచుకు నిల బడింది. చాలా సేపు చూసినా మాట్లాడక పోయే వరకు పార్వతి నెమ్మదిగా ఒక్కొక్క అడుగు వేసు కుంటూ రేవుకు పో సాగింది. దేవదాసు తల ఎత్తి పార్వతి పోతూ ఉండటం చూసి, 'ఇదిగో మాట!' అన్నాడు మరల నీళ్ళ వంక చూస్తూ.

పార్వతి తిరిగి వచ్చింది. కాని దేవదాసు అతీపతీ లేదు. పార్వతి తిరిగి పోయింది. దేవదాసు స్తబ్ధుడై కూర్చున్నాడు. కొన్ని క్షణాలు గడిచిన తర్వాత తల తిప్పి చూశాడు - పార్వతి నీళ్లు ముంచుకొని వెళ్ల బోతూ ఉన్నది. అప్పుడు దేవదాసు గాలం తీసి చేత పట్టుకొని రేవు దగ్గరికి వచ్చి నిలబడి - 'నేను వచ్చాను.' అని అన్నాడు.

స్పానిష్ వీరనారి

'పాషనారా' మహత్తర జీవిత చరిత్ర



[" 'పాషనారా' అప్రతిహత కార్య శక్తికి నేను విస్మయం చెందుచున్నాను" అని ఈమధ్య జవహార్‌లాల్ స్పైన్ వెళ్ళినపుడు పల్కాడు. పారిస్‌లో జరిగిన 'శాంతి' మహాసభలో ప్రతినిధి కాకపోవడం వల్ల, పాషనారా మాట్లాడుటకు అవకాశం లేకపోయింది. ఆమె కన్పించగానే ఆమె మాట్లాడాలని తుపానులాగ కేకలు, హర్షధ్వనులు మిన్నుముట్టాయి. జవహార్‌లాల్ తన స్థలాన్నుంచి లేచి "పాషనారా మాట్లాడాలి! మాట్లాడాలి" అంటూ చిన్న పిల్లవాడిలాగా గంతులు వేస్తూ చప్పట్లు కొట్టడం ప్రారంభించాడట! ఇది చాలు పాషనారా అంటే తెలియ జేయడానికి. ఈమె ఇచ్చిన 'నోపాసరాన్' (వారు అడుగిడరాదు) అనే నినాదమే, నేటి స్పైన్ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టింది. ఆమె ఇచ్చిన, నినాదం పేరిట "అప్టన్ సింక్లయిర్" వంటి ప్రపంచ విఖ్యాత గ్రంథకర్త ఒక నవల వ్రాశాడు. అట్టి వీరనారి పాషనారా జీవిత చరిత్రాన్ని మీ కందించడానికి మే మెంత గర్వించాలి!—సంపాదకుడు.]

పాషనారా 1895 లో బాస్కు దేశంలో గల్లార్టా అనే ఊర్లో పుట్టింది. ఈమె తల్లీ దండ్రీ అక్కడి గనుల్లో పని చేస్తూండేవారు. ఒంట్లో నర్సువ వుడిగేవరకూ ఈమె తల్లి గని లోనే పని చేసింది.

బాల్యం

పాషనారా బాల్యం కష్టమాయిష్టమైనది. గనుల్లో పనిచేసే శ్రామికుల కష్టాలు. ఆవేదనలు, పోరాటాలు, అన్నీ చిన్నప్పుడే యీమె తెలుసుకుంది.

స్పెయిన్‌లో, సోషలిస్టు భావాలు వ్యాప్తం గావడం ప్రారంభించి నప్పటి నుండి, బాస్కు దేశం దానికి పట్టుగొమ్మలా వుంది. యీ పోరాటాలలో. యీ గనుల్లో పనిచేసే కార్మికులు ముందడుగు వేశారు. స్పెయిన్ కార్మిక వర్గపు విప్లవ చరిత్రలో బాస్కు గని కార్మికుల సమ్మె పోరాటాలు మరచిపోరానివి. సమ్మెలు జరుగుతూన్నప్పుడు యీ కార్మికుల భార్యలు చంటి పిల్లలను చంక నెత్తుకొని పోయి, సమ్మెను భగ్నము చేసేవారిని పారద్రోల్తూండే వారు. డోలరెస్ (పాషనారా అసలు పేరు) బాల్యములో ఎప్పుడూ వీరిలోనే వుండేది. పోరాటం ముదిరి, పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చినప్పుడు యీ పిల్లలందరూ నేలమీద బోరగిలా పడుకొనేవారు. వాళ్ళెళ్ళి పోగానే లేచి మళ్ళీ తయారయే వారు. వాళ్ళకిదో అలవాటు అయి పోయింది.

బానిసత్వం

బాల్యంలో ఎప్పుడూ పాషనారా యీ వాతావరణంలో పెరిగింది. అమెకు చదువుమీద మహాప్రీతి. బడి పంతులు పని చేద్దామని ఎంతో కోరిక వుండేది. పుస్తకాలకై తహతహలాడేది. కాని పేదలైన తలిదండ్రులీమెకీ సౌకర్యాలు చేయలేక పోయారు. 15 వ ఏట యీమె దర్జీ షాపులో జీతానికి కుదిరింది. ఒక సంవత్సరం అయిన తర్వాత ఒక గొప్ప వ్యాపారస్తుడింట్లో పనిలో ప్రవేశించింది. అంతా లేదా చాకిరీ. ఉదయం 6 గంటలకు లేస్తే రాత్రి 2 గంటల వరకూ వంచిన నడుము ఎత్తేందుకు కాలేదు. తిండికైనా విశ్రాంతి ఉండేదివాదు, నెలకొకు 20 "పెసెటా"లు జీతం. ఇంట్లో పని అంతా యీవిడదే.

తలిదండ్రుల బలవంతం వల్ల. ఆ పనిలోనే ఉండక తప్పేందికాదు పాషనారాకు. పొట్ట గడవని ఆ రోజుల్లో 20 పెసాటాలంటే మేరువులా కనుపించేది వాళ్ళకు.

వివాహం

ఈమెకు 20 వ యేడు వచ్చింది. పెండ్లి అయింది. భర్త కూడా గని కార్మికుడే. గనుల్లోని దుర్భర జీవితం ఆమె హృదయాన్ని కలచివేసింది. ఆమెలో చిన్నప్పటి నుండియు రగులుతోన్న శ్రామిక క్రోధానలం జ్వాల అయింది. అంతవరకూ సాంప్రదాయాలన్నీ ఈ అగ్నిని అణచి పెట్టాయి. మత్తు కలిగించాయి. మనిషిని అచేతనం చేశాయి. వీటిని సమూలంగా నాశనం చేయాలనే సంకల్పం పాషనారాకు గలిగింది!

ఇంతలో రష్యా విప్లవం వచ్చింది. ప్రపంచంలోని పీడిత మానవ లోకానికి తేజస్సునిచ్చింది. ఆమూల రష్యాలోని విప్లవ వీరుల పక్షాన్ని డొలరెస్ (పాషనారా) వహించింది.

తిరుగుబాటు

1917 లో స్పెయిన్‌లో ఏకచ్ఛత్రాధిపత్యాన్ని కూలద్రోయాలని కార్మికులు పూనుకొన్నారు. ఈ ఉద్యమాన్ని జనరల్ స్ట్రైయికుతో ప్రారంభించాల్సి వుంది. యిందుకై నిద్రాహారాలు మాని కార్మికులు కృషి చేశారు. డొలరెస్ వీరికెంతో సాయపడింది. వేర్వేరు ప్రదేశాలలో వుండేవారి మధ్య దూతగా పని చేసింది. ఆయుధాలు, డైనమైట్లు, మొదలయినవన్నీ అక్కడక్కడికి వెళ్ళి పంచి వస్తూండేది. యీమె అప్పటికింకా సోషలిస్టే కాదు.

ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేసి కార్మికులపై ఘోర ప్రతిక్రియ సాగించింది. ఎందరినో హతమార్చింది. ఇంకెందరినో ఖైదు చేసింది. డోలరెస్ భర్త కూడా ఖైదు చేయబడ్డాడు. క్షుద్బాధ మొదలగు కష్టాలన్నీ కార్మికుల్ని ఆవరించాయి. ఇంతలో రష్యాలో ప్రభుత్వం కార్మిక కర్షకుల వశమయింది. స్పెయిన్ కార్మికుల ఆశాలత చిగిర్చింది. నిర్బంధ విధానం చాలా తీవ్రంగా ఉంది. ఏం చేస్తేనేం!

కమ్యూనిస్టు జీవితం

1917 లో డోలరెస్ (పాషనారా) సోషలిస్టు పార్టీలో చేరింది. పాషనారా అనే పేరుతో అనేక 'వ్యాసాలు' పత్రికలకు వ్రాసి వన్నె కెక్కింది. అప్పటినుండీ అమె పేరు పాషనారాయే అయి పోయింది. గని కార్మికులలో పేరు గడించింది. 1920 లో మొట్టమొదట కమ్యూనిస్టు గ్రూపుతో చేరించి. ఈమె ఉత్సాహం, కార్యదీక్ష, ఆదర్శ ప్రాయ జీవనం. అమె పరిసరాల్లో నున్న 400 మంది సోషలిస్టుల నీ ముగ్ధుల్ని చేసింది. స్పెయిన్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడగానే, వీరందరూ ఆ పార్టీలో చేరారు. ఈమె "విస్కాయా" జిల్లా కమిటీ మెంబరు అయింది. మొదటి పార్టీ కాంగ్రెసుకు ప్రతినిధిగా ఎన్నుకోబడింది.

పాషనారా సవ్యసాచిలా, అన్ని రంగాల లోనూ పని చేసింది. పార్టీ పత్రికకు వ్యాసాలు వ్రాసేది. కార్మిక సంఘాలలో పని చేసేది. పార్టీ పత్రాలన్నీ వివిధ ప్రాంతాలలో అందజేసేది. సమ్మెలలో పనిచేసేది. ఒకటేమిటి? ఏ రంగంలో చూచినా ఆమే!

1923—29 మధ్య "ప్రిమో. డిరివేరా" యొక్క నిరంకుశ పాలన సాగింది. ఇండ్ల సోదాలు, దుండగాలు, శిక్షలతో నిర్బంధ విధానము స్వైర విహారం చేసింది: పాషనారాకు చేద్దామంటే పనిలేదు. దుర్భర దారిద్ర్యం ఆమెను చుట్టు ముట్టింది. అమె 4 గురు పిల్లలకు జన్మిచ్చింది. మందు, వైద్యం లేక పిల్లలు చచ్చిపోయారు. వాళ్ళను రక్షించడానికి ఆమెవద్ద డబ్బులేదు. ఏంచేస్తుంది? ఇల్లా చచ్చిపోయే పిల్లలెందరో ప్రపంచంలో వున్నారు. యిల్లా బాధపడే తల్లుల సంఖ్యకు అంతులేదు. వీరిని ఉద్ధరించడాని కిదివరకే కంకణం కట్టుకుంది పాషనారా! యీ ఆరు సంవత్సరాల జీవితం పాషనారాను దిద్ది తీర్చింది.

1929 లో స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీ మూడవ కాంగ్రెసు పారిస్‌లో ఏర్పాటు చేయబడింది. పాషనారా, స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ మెంబరుగా ఎన్నుకోబడింది. 2 సంవత్సరాలైన్న, తరువాత కేంద్ర నాయకత్వపు పని మీద పార్టీ ఆమెను మాడ్రిడ్‌లో వుంచింది. "మన్డో ఒబ్రెరో" అను పార్టీ పత్రికను కొంతకాల మామె నడిపింది.

అరెస్టు

మాడ్రిడ్ వెళ్ళిన 15 రోజులకు ఆమెను ప్రభుత్వం అరెస్టు చేసింది. పోలీసుల చేతులలో పడరాని బాధలు పడిన తరువాత ఖైదుకు పంపబడింది. అక్కడి స్త్రీలందరూ "కమ్యూనిస్టు వచ్చింది" అని ఆశ్చర్యంగా చూశారు. కొంత కాలం కలిసి మెలిసి వున్న తరువాత, వాళ్ళ జైలులో చేసే వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా అధికారులతో పోరాడించి. దీనితో ఆ స్త్రీలందరూ యీమెను గౌరవించడం ప్రారంభించారు. యీమె పలుకుబడి నానాటికి వారిలో హెచ్చి పోయింది. ఇది చూచి ఈమెను, బిల్బో ఖైదుకు ప్రభుత్వం మార్చింది. పాషనారా, జైలునుండి మాడ్రిడ్ తిరిగి వచ్చింది. పార్టీలో బాధ్యతగల స్థానంలో వున్న "బుల్లెజా" ముఠా యొక్క ఛాందసత్వము (Sectarianism)ను) తొలగించుటకు కృషి చేసింది. 1932 లో 'సెవిల్లీ'లో పార్టీ మహాసభ జరిగింది. ఈమె కమ్యూనిస్టు పార్టీ పొలిటికల్ బ్యూరోకు ఎన్నుకోబడింది. నాటి నుండియు "జోస్ డయజ్"తో కలసి, విధీ విరామం లేకుండా పార్టీ అభివృద్ధికి పనిచేయ సాగింది పాషనారా.

తిరిగి అరెస్టు—విడుదల

ప్రజల ప్రేమను చూరగొన్న పాషనారాను పోలీసులు వెన్నంటారు. పట్టుకొన్నారు. 10 నెలలు మాడ్రిడ్‌లో ఉంచి "బిల్బో" జైలుకు మార్చారు. విచారణ నాడు కార్మికులంతా కోర్టు కమ్మేశారు. పాషనారాకు 18 సంవత్సరాలు. ఇతరులకు అజన్మ ఖైదు విధించాల్సిందని ప్రాసిక్యూషన్‌వారు కోరారు. జడ్జీలకేసి చరిగింది పాషనారా. శ్రామిక-వర్గపు అధికార శీవి ఆమెలో ప్రకాశిస్తోంది. ఈ శిక్ష అక్రమం ప్రజా కోర్టులో మిమ్మల్ని కొలది రోజులలో విచారణ చేస్తాం" అని సభ మారుమ్రోగేలాగున గర్జించింది. జడ్జీల కేమీ తోచలేదు. ప్రాసిక్యూషన్‌వారీ వీరనారీమణి పాషనారాపై కేసును ఉపసంహరించు కొన్నారు. తన సహచరులను వీడి కోర్టు వదలుట కంగీకరించ లేదు పాషనారా. కాని తప్పిందికాదు.

1933 లో కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్ మీటింగుకై రష్యా వెళ్ళి వచ్చింది. స్పెయిన్‌లో ఫాసిస్టు తిరుగుబాటు వస్తుందని పుకార్లు బయలు దేరాయి. తక్షణం పాషనారా, కార్మికులుండే ప్రదేశాలన్నిటికీ పోయి జాగ్రత్తగా ఉండవలసిందని వారిని హెచ్చరించి వచ్చింది. ఆమెను వెంటాడి పోలీసులు అరెస్టు చేశారు.

స్త్రీ ఉద్యమం

స్త్రీలతో తప్పక పనిచేయాలని పాషనారా పార్టీ సభ్యులను పదేపదే హెచ్చరించేది. తాను స్వయంగా. యుద్ధానికి ఫాసిజానికి వ్యతిరేకముగా స్త్రీలలో పెద్ద ఉద్యమాన్ని లేవదీసింది. తానే పార్టీకి చెందినా, పాషనారాను ఎరిగున్న ప్రతి స్త్రీ కూడా ఆమెను గౌరవిస్తుంది. ఆమెను చూచేసరికల్లా స్త్రీలలో కలిగే ఆత్మ విశ్వాసానికి మేర లేదు. 1934 లో పారిస్‌లో జరిగిన ప్రపంచ మహిళా మహాసభకు పోయి ఈమె తిరిగి వచ్చింది. స్పెయిన్‌లో "లీనా" మంత్రి వర్గం సైనికుల బిల్లును ప్రవేశ పెట్టబోతోంది. దీనికి వ్యతిరేకంగా పాషనారా నాయకత్వం క్రింద వేలకొలది స్త్రీలు. మాడ్రిడ్‌లో ప్రదర్శనాలు సాగించారు. బిల్లు ఆపివేయబడింది.

1934 అక్టోబరులోని విప్లవోద్యమం తరువాత ఎన్నో ఘాతుక కృత్యాలు జరిగాయి. కార్మికులదే కాదు, మరి ఏ అభివృద్ధి కరమైన వుద్యమాన్నీ కూడా తల ఎత్తనీయలేదు ప్రభుత్వం.

"అస్టూరియస్"లో ఎన్నడూ ఎక్కడా కని విని ఎరుగని నిర్బంధ విధానం సాగింది. కొత్త మనిషి ఎవరైనా అక్కడికి వెళ్ళితే అరెస్టు చేసేవారు. పాషనారా వెళ్ళవలసి వచ్చినది. అక్కడి పార్టీ సభ్యులకు ధైర్యం చెప్పవలసి వచ్చింది.

స్త్రీ ఉద్యమంలో పని చేసేటప్పుడు మధ్యతరగతి స్త్రీలతో తనకు గలిగిన పరిచయాన్నంతా వినియోగించి "కార్మిక శిశు సేవా మండలి"ని ఏర్పాటు చేసింది. నిర్బంధ విధానం మిన్ను ముట్టి సాగుతోంటే పాషనారా యీ సంఘం పేరుతో "అస్టూరియస్" వెళ్ళి జైలులో నున్న వారి కుటుంబాలకు ధన సహాయంచేసి దాగియున్న అచటి పార్టీ సభ్యులను అచటి నుండి తప్పించుటకు వలయు ఏర్పాట్లన్నీ చేసింది.

యీ పనిలో ఈమెను అరెస్టు చేసి 'ఓవిడో' ఖైదులో వుంచారు. ప్రజా ఆందోళన మాడ్రిడ్‌ను ఉగ్రూత లూపింది. పాషనారా విడుదల చేయబడింది. ఆస్టూరియస్‌కు మాత్రం పోరాదని నిషేధింపబడింది. దీని నేమాత్రం లెక్కించకుండా అవుసరం కలిగి నపుడల్లా పాషనారా అక్కడికి పోయి వస్తూండేది.

రహస్యంగా పారిస్‌కు

నిర్బంధానికి గురియైనవారి రక్షణకై 1935 లో పారిస్‌లో ఒక మహాసభ ఏర్పాటు చేయబడింది పాషనారా ప్రతినిధిగా ఎన్నుకోబడింది. రహస్యంగా సరిహద్దులు దాటిపోవాల్సి వచ్చింది. అది మహా ప్రమాదమైన పని. ఆ వీరనారి కిది యొక లెక్కలోని పని కాదు. కొండదారులన్నీ పరిచయం వున్న ఇంకొక ప్రతినిధితో బయలుదేరింది. ఒక దారిని పోతూంటే కాపలావాళ్ళు వీరిని వెన్నంటారు. దారులన్నీ ఎరిగుండుటచే వారి దారినుండి పాషనారా తప్పించుకో గలిగింది. అష్ట కష్టాలు పడి పారిస్ చేరుకున్నారు. పారిస్‌కు వెళ్ళడానికి ఎంత కష్టపడిందో అక్కడనుండి మాడ్రిడ్‌కు రావడంలో కూడా అంత కష్టమూ పడి పాషనారా తిరిగి వచ్చింది.

స్పెయిన్‌లో ఐక్య సంఘ స్థాపనకైగల అవశ్యకతను తెలుపుతూ స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించిన, "మాన్యుమెంటల్ సినిమా" మీటింగులో, ఈమె యు, జోస్ డయాజ్ కూడా పాల్గొన్నారు.

రహస్యంగా రష్యాకు

1935 జూలై నెలలో రష్యాలో జరిగిన అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభ యొక్క 7 వ కాంగ్రెసుకు యీమె ప్రతినిధిగా వెళ్ళింది. పారిస్ వెళ్ళేటప్పుడు ఎంతకష్టంమీద వెళ్ళిందో యీ పర్యాయం కూడా అంతే అవస్థపడింది. "పైరనీస్" పర్వతాలు దాటినప్పుడు కల్గిన కష్టాలన్నీ మళ్ళా....

రష్యా నుండి తిరిగి వచ్చేటప్పుడు ఇంకొక ఎత్తు ఎత్తారు. ఎ. బి. సి. పత్రికాధిపతికి సాన్‌సెబాస్టియన్ రేవులో ఒక విహార నౌక వుంది. ఈ సంగతి అక్కడి పార్టీ సభ్యులకు తెలుసు. ఒక రాత్రివేళ రహస్యంగా వారు ఆ [illegible] పడవ తీసుకువెళ్ళి ఒక ఫ్రెంచి రేవులోనున్న [illegible] పాషనారాను తీసుకువచ్చి [illegible] చెప్పకుండా [illegible] లేకుండా రేవులో దిగవిడిచారు. అప్పటి కావలి భటులామెను ఒక దాసీ అనుకుని వదిలేశారు.

ఉద్యమం లేవదీసింది.

మాడ్రిడ్‌లో ఒక పెద్ద సభ ఏర్పాటుచేసి 7 వ కాంగ్రెసు యొక్క చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజలకు ఉపన్యసించింది. పోలీసులు ఆమెను అరెస్టు చేయాలని ప్రయత్నించారు. కాని కార్మికులు వారి నాటలు సాగని పాషనారాను రక్షించుకొన్నారు.

ప్రజా సంఘటన ప్రారంభమైంది. దీనిని ప్రతిపాదించినది కమ్యూనిస్టు పార్టీ. పోషించినది కమ్యూనిస్టు పార్టీ. దీనికి అంద ప్రజలు, ప్రజల అశాంతికి "గిల్ రోబుల్సు" ప్రభుత్వం ఆగలేక గజగజ లాడింది. రాజకీయ ఖైదీల విడుదలకై సమ్మెలు, పెద్ద వుద్యమం బయలు దేరింది. పాషనారా దీనిని నడిపింది. 1936 లో అస్టూరియస్ వెళ్ళిందీమె. తిరిగి రాగానే అరెస్టు చేశారు. "గిల్‌రోబుల్సు" ప్రధాన మంత్రిత్వం ఊడింది. జనరల్ ఎలెక్షన్ ఏర్పాటు చేయబడింది.

ఖైదీల విడుదల చేసింది.

ఆస్టూరియస్‌లో కమ్యూనిస్టు పార్టీ తరఫున పాషనారా అభ్యర్థిగా నిలచింది. జైలునుండి పారిపోయి ఎన్నిక ప్రచారం చేసుకొంది.

ఎన్నికలలో అతివాదుల ఐక్య సంఘటనకు విజయం కలిగింది. భూగర్భంలో ప్రాణాలొడ్డి పనిచేసే ఆస్టూరియస్ గని కార్మికులు, పాషనారాను, తమ ప్రతిధిగా ఎన్నుకొన్నారు. "అక్టోబరు విప్లవ వీరులను విడుదల చేయాలి!" అనే నినాదంతో ఐక్య సంఘటన ఎన్నికలలో నెగ్గింది. ఈ ఖైదీలు 30,000 మంది ఉన్నారు. ఎన్నికలైన మరునాడే వీరు విడుదలకై ఆందోళన ప్రారంభమైంది.

పాషనారా "ఓవిడో" జైలుకు వెళ్ళింది. అక్కడ 940 మంది విప్లవకారులు ఖైదు చేయబడి ఉన్నారు. అందులో కొందరికి మరణ శిక్ష, మరి కొందరికి ఆజన్మఖైదు. పై అధికారుల నుండి ఆర్డర్లు లేకుండా వారిని విడుదల చేయుటకు వీలులేదని పాషనారాతో అధికారులన్నారు. కావలి భటులను ఎక్కువ చేసింది ప్రభుత్వం. చుట్టూ భటుల కాపలాతో పాషనారా ఖైదీల వద్దకు వెళ్ళింది. ఇదంతా ఏమిటని ఖైదీలడిగారు ఆమెను. విప్లవ రాజకీయ ఖైదీల విడుదలకై జరిగిన ఎన్నికలలో తాను శాసన సభా సభ్యురాలుగా ప్రజలచే ఎన్నుకో బడ్డాననియు, వారి విడుదలకై తక్షణమే కృషి చేస్తాననియు చెప్పింది. కొన్ని ప్రయత్నాలు చేసింది. వృధా అయాయి అవి. గొప్ప ప్రజా వాహినితో జైలు వద్దకు పోయింది. జైళ్ళు పగులగొడతారని ప్రజాట్టహాసానికి కావలి భటులు కంపించి పోయారు. పాషనారా జైలులోనికి పోయి తన యత్నాలన్నీ విఫలమయాయి అని ఖైదీలతో చెప్పింది. విప్లవ ఖైదీల ఆగ్రహం మిన్నంటింది. బయట ప్రజలు ఆగటం లేదు. తుపాకులతో కాల్చడానికి ఆర్డర్లకై సైనికులు వేచి యున్నారు. పాషనారా ఖైదీలతో లోపలవుంది. పార్లమెంటు మెంబర్లెందరో ప్రజలను శాంతింప జేయాలని చూశారు. శక్యంగాలేదు. అది పాషనారా సొమ్ము. ఆమె సేనాధిపతితో మాట్లాడింది. ఖైదీల విడుదలకై బాధ్యత తీసుకొంటావా అని సేనాధిపతి ఆమెనడిగాడు. [illegible] జైలంతా ఖాళీ అయింది. అస్టూరియస్ ప్రజలంతా ఆనందాబ్ధిలో మునిగి తేలారు. ఆనందోత్సాహం వల్ల, ఆమెను కౌగిలింతలతో నలిపి వేశారు. మరునాడు మాడ్రిడ్‌కు బయలుదేరింది. లక్షలాది ప్రజలామెకు వీడ్కోలివ్వడాని కొచ్చారు. స్టేషనుకు చేరుకోడమే కష్టమైంది.

కమ్యూనిస్టులు స్పెయిన్ పార్లమెంటు సభ్యులవడం గొప్ప విషయం. అందులో పాషనారా మెంబరవడం మరీ గొప్పది. అచిరకాలములోనే అతివాదుల అభిమానాన్ని మితవాదుల గౌరవాన్ని చూరగొంది పాషనారా.

"గిల్‌రోబుల్సు" పాలనా విధానాన్ని ఎదిరించి ఖండిస్తూ పార్లమెంటులో ఆమె ఇచ్చిన ఉపన్యాసాన్ని విని ప్రజలీమెయే తమ రక్షకురాలని తలచారు.

స్పెయిన్‌లో తిరుగుబాటుకు ఒక నెల ముందు శాసన సభలో ఫాసిస్టు నాయకులు ప్రజా ప్రభుత్వాన్ని ఖండించి సంకటములో పెట్టాలని చూశారు. వీరి వాదాన్ని ఖండ ఖండాలు గావించి పాషనారా వీరి నోడించి ప్రజా ప్రభుత్వాన్ని కాపాడింది.

"నో పాసరాన్"

1936 జూలై 18 ని ఫాసిస్టు తిరుగుబాటు ప్రారంభమైంది, "వారడుగిడరాదు" (No Pasaron) అని పాషనారా గర్జించింది, శత్రుసేనల గుండెలలో బల్లెం పొడిచి నట్లయింది. నేల యీనినట్లుగా ప్రజలు వచ్చి ఫాసిస్టుల నడ్డుకో సాగారు, ఈమె యీ గర్జారావం ఫాసిస్టు వ్యతిరేకులకు సింహనాదంవలె ఉత్సాహ మిచ్చింది. స్పైన్ మూలమూలలకు ఆమె స్వాతంత్ర నినాదం వినిపించింది. ఫాసిజాన్ని రూపుమాపడానికి స్పెయిన్ ప్రజల దృఢ సంకల్పాన్ని ప్రపంచానికి చాటింది.

స్పెయిన్‌లో ఫాసిజానికి వ్యతిరేకంగాను, తమయొక్క, తమ దేశముయొక్క స్వాతంత్ర్యానికై పోరాటం సాగించే లక్షల కొద్దీ ప్రజల ప్రతినిధియైన యీ కమ్యూనిస్టు పాషనారా, ఆకలి దప్పులతో అల్లాడుతూన్న పీడిత ప్రజా సామాన్యం మధ్యనుండే వచ్చింది. తిండి లేక చచ్చిపోతున్న వారినీ, మందులులేక మరణించి పోతున్న వారినీ, దారిద్ర్యానలానికి బలి అయ్యే పిల్లల్ని, పెద్దల్ని, వారుపడే బాధల్నీ తన కళ్ళారా చూచింది. తన ముద్దు బిడ్డలు కూడా మందులేక చచ్చిపోతూంటే చూచి సహించింది. స్పెయిన్ ప్రజా పోరాటమంతా మూర్తీభవించిన యీ కమ్యూనిస్టు వీర నారీ మణి పాషనారా జగద్విఖ్యాతి పొందింది.

ఈ పోరాటం ప్రారంభము నుండీ యిందలి యథార్థాన్ని గ్రహించి నడుంకట్టి రంగంలో దిగింది. ఉపన్యాసాలు, సభ్యులకు తర్ఫీదు ఇవ్వడం ప్రారంభించింది, ప్రజల నుండి నేర్చుకొన్న విషయాలనుండి, జోస్ డయాజ్, పొలిట్ బ్యూరోల సహాయంతో పార్టీని నడపడం ప్రారంభించింది. ప్రజా సైన్యాల్ని ఏర్పాటు చేయడానికి ఈమెయే కారకురాలు. ఈ ప్రజా సైన్యాలను సుశిక్షిత సైన్యాలుగా మార్పించింది ఈమెయే.

దేశ రక్షణకై రణరంగంలో ప్రాణాలర్పించబోయిన వీరాగ్రేసరులగు ప్రజా సైనికులను ప్రోత్సహించ వచ్చుటకు జూలై ఆగస్టు నెలల్లో పాషనారా రణరంగానికి పోయింది. ఈ వేళ [illegible] ఆ వీరుల [illegible] చేశాయి. అందరి హృదయాల్లోనూ ప్రతిధ్వనించాయి.

మాడ్రిడ్ రణరంగంలో

నవంబరులో ఫాసిస్టులు మాడ్రిడ్‌పై బడగానే, మాడ్రిడ్ స్త్రీలను వెంటబెట్టుకొని వీధులన్నీ గాలించి ప్రతి మగవాడినీ యుద్ధరంగంలోకి పొమ్మంది. పట్టణం కాపాడమంది, ప్రజలు శిరసావహించారు. వైర్లెస్ ద్వారా, మాట్లాడి ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది. ఆర్డర్లిచ్చింది. ప్రజలందరూ దీన్ని ఆజ్ఞగా పరిగణించి తూచా తప్పకుండా అమలు జరుపుతున్నారు. అనేక పర్యాయాలీమె రణరంగంలోకి సహచరుడు డయాజ్‌తో కూడా పోయి. చేత పార, పలుగు పట్టి, కోటలు (Fortifications) కట్టింది. వేలకొద్దీ ఈమెను అనుసరించారు. అంగుళమైనా ముందుకేగాని వెనుకకు వేయవద్దని సైన్యాలకు ఆజ్ఞాపించింది. సెప్టెంబరు రోజుల్లోని ఆమె ధీరమూర్తి ఇప్పటికీ మాడ్రిడ్ ప్రజల కళ్ళఎదుట వీర తాండవ మాడుతోంది.

ప్రపంచంలోని యితర దేశాలకు స్పెయిన్ తరఫున రాయబారి అయిపోయింది పాషనారా. స్పెయిన్ రక్షణకు లక్షల, కోట్ల కొలదీ ప్రజల సానుభూతిని, సహాయాన్ని సంపాదిస్తోంది. ప్రపంచంలోని అనేక ప్రదేశాల నుండి పాషనారాకు అభినందన పరంపరలు వస్తున్నాయి.

కార్మికులు, స్త్రీలు, బాలురు, సైనికులు, వీరు వారేమిటి, ప్రపంచంలోని ప్రతి ఫాసిస్టు వ్యతిరేకి కూడా, కాలు కదిపితే, పాషనారా సలహా సహాయం అడుగుతాడు.

స్పెయిన్ ప్రజలీమెను త్రికరణశుద్ధిగా ప్రేమించారు.

ఈమె నోటినుండి వచ్చే ప్రతి మాట ప్రజలకు నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. ప్రజలు చెవియొగ్గి వింటారు.

"వారు అడుగు దాటకూడదు" అనే [illegible] సందేశాన్ని ఇచ్చింది పాషనారాయే. [illegible] ఇది.

"ప్రపంచంలో ఫాసిజాన్ని కూలద్రోయడానికి మేము సాయం చేస్తున్నాం.

ఫాసిజం అనే భయంకరమైన పీడనుండి ప్రపంచాన్ని రక్షించేటందుకు మేము బలిదానం సమర్పిస్తున్నాం.

ఎలా పోరాడాలో, ఎలా జయించాలో ప్రపంచానికి మేం పాఠం నేర్పుతున్నాం.

దుర్భేద్యమైన మా ప్రజా సైన్యాల బలంతో విజయోన్ముఖులమై "మేము ముందుకుపోయే తీరుతాం." అనే సింహనాదంతో సాగిపోతున్నాం."

ఈమె కమ్యూనిస్టుగా ఆదర్శం చూపడమే గాక, జయమొందేటందుకు అందరూ అవలంబించవలసిన మార్గాన్ని ఆమె ఉద్బోధనల్లో సూచిస్తుంది. నేడు ప్రపంచ వీధుల వెంట [illegible] "ఆయుధాలు, ఆయుధాలు" అని [illegible] ఆర్తనాదం వినబడుతూంది. అది ఈ వీరనారీ మణి పాషనారాదే.

పాషనారా [illegible]

బొంబాయి కార్మికులపై కాల్పులు

కరాచి ట్రాం పనివారి సమ్మె—పాట్నా బళ్ళవాళ్ళ సమ్మె—క్విలన్ నల్ల జెండా ఊరేగింపు—హింగన్ ఘాట్ సమ్మె—కర్నూలు పాకీవాండ్ర కష్టాలు తిరుపతి ఇత్తడి పనివారల విజయం—బెజవాడ రైల్వే కార్మికులు—ఏలూరు ప్రెస్ కార్మికుల కష్టాలు—మదరాసు బస్సు పనివారల సమ్మె.

కర్నూలు

పాకీవాండ్ర కష్టాలు.

కర్నూలులో 2 ఏండ్ల క్రితం 40 ఇండ్లు ఒక పూటవంతున బాగుచేస్తే కర్నూలు పట్టణంలో పాకీ వాండ్రకు సుమారు పదమూడు రూపాయలు జీతం నెలకు ఇచ్చేవారు. యిప్పుడు 80 ఇండ్లు రెండు పూటలూ చేయిస్తూ 9 రూపాయిలే ఇచ్చు చున్నారు. పైగా రోజు కూలీ క్రిందనే లెక్క కట్టుచున్నారు. యీ విధముగు కష్టాలు పాకీవారి కున్నాయనియు, వారి సమావేశంలో శ్రీ ఓబుల రెడ్డి, తిప్పారెడ్డి గార్లుపన్యశించారనియు ఒక విలేఖరి తెలుపు చున్నాడు.

పవర్ హౌసు కార్మికుల కష్టాలు.

కర్నూలు మ్యునిసిపల్ పవర్ హౌస్ కార్మిక సంఘంవారు యీదిగువ హంశాలున్న మెమోరాండంను మద్రాసు ఆరోగ్య మంత్రి రాజన్ గారికి ఇచ్చుటకు తీర్మానించు కొన్నారు. అని, దుర్గా కృష్ణమూర్తి గారు తెలుపు చున్నారు.

(1) యూని ఫారములు సప్లయి చేయాలి. (2) ఉదయం. 4—12. మధ్యాహ్నం 12—8 గంటలలో పనిచేసే షిఫ్టులకు మధ్యన పలహారానికై విశ్రాంతి ఏర్పాటు చేయాలి. (3) భోజనములు చేయుటకు, వసతి ఏర్పర చాలి. పాయిఖానా దొడ్లకు, పవర్ హౌసులో వసతి ఏర్పాటు చేయాలి. (4) పనివారికి ప్రభుత్వ. జి. ఓ. ల ప్రకారం గ్రేడ్లు ఏర్పాటు చేయాలి. (5) లైన్లమీద పనిచేసేవారికి వాన, చలినుండి రక్షించుకోడానికి ఓవర్ కోట్లు సప్లయి చేయాలి".

తిరుపతి

ఇత్తడి పనివారల విజయం.

ఇత్తడి పాత్రలను చేసే కార్మికుల మజూరీ రేటును మణుగు 1కి. 0-12-0. యజమానులు తగ్గించారు. కనీసం రు. 0-4-0 అయినా హెచ్చించవలసినదని కార్మికులు కోరారు. అందుపై ఆగస్టు 20 వ తేదీనుండి 200 మంది సమ్మె ప్రారంభించారు. ప్రత్యేకంగా సభలు జరిపి, తమ కోర్కెలను తయారుచేసి, అచ్చు వేయించి, పట్టణవాసు లందరికి పంచి పెట్టారు. పది రోజులు సమ్మె సాగింది. తరువాత యజమానులు కూలీల కోర్కెలను నెరవేర్చుటకు అంగీకరించుటచే సమ్మె ఆపుజేయ బడింది.

బెజవాడ

రైల్వే కార్మికులు.

యం. యస్. యం. రైల్వే కార్మికులు, 3-9-38 తేదీని బహిరంగ సభ జరిపారు, శ్రీ వి. వి. నరశింహం యం. యల్. ఏ. గారు అధ్యక్షత వహించారు. ఎ. యస్. రాజు, యస్. రాజగోపాల అయ్యంగార్లు ఉపన్యసించి రైల్వే కార్మిక సంఘాన్ని బలపర్చుకొనవలసినదని హెచ్చరించారు. జొన్నలగడ్డ రంగ లింగయ్యగారు ఉపన్యసిస్తూ దేశంలో జరుగుతూన్న రాజకీయ పోరాటాన్ని అనుసరించవలసినదని కోరారు. గత యమ్. యస్. యం. రైల్వే సమ్మెలో పనిలోనుండి తొలగింప బడిన వారిని పనిలో చేర్చుకొన నందుకు రైల్వే యజమానుల చర్యలను ఖండిస్తూ, వారిని యిప్పుడైనను చేర్చుకొన వలసినదని కోరుచూ తీర్మానం ఏకగ్రీవంగా చేశారు.

ఏలూరు

ప్రెస్ కార్మికుల కష్టాలు.

కృష్ణానంద ప్రెస్సులో కోగంటి హనుమంతరావను ఒక బైండరు చెత్త కాగితాలను అవతల పారేస్తోంటే అతను దొంగిలించాలనే ఉద్దేశంతో అట్లాచేశాడని నెపంపెట్టి ఆకార్మికుని పనిలోనుండి యజమాని తొలగించి తనకు నష్టపరిహారం క్రింద 10 రోజుల జీతాన్ని మినహాయించు కున్నాడు.

ప్రెస్సు యజమానుల సంఘం సూచించిన షరతులపై వెంకట్రామా ప్రెస్సులో 37 మంది దస్కతులు పెట్టారు. ముగ్గురు నిరాకరించుటచే వారిని 8 వ తేదీ ఉదయం పనిలో నుండి యజమానులు తొలగించారు. దస్కతులు పెట్టిన వారిలో నుండి 9 మంది వీరిలో సానుభూతి చూపుతూ పనిమాని వచ్చివేశారు. ఇతర ప్రెస్సులలో కూడ యిట్టి ఒత్తిడి కార్మికులకు కలుగు చున్నది.

పాండురంగ ప్రెస్ యజమాని, యజమానుల సంఘం నుండి విడిపోయి, అచ్చు పనివారల సంఘాన్ని గుర్తించారు.

కార్మిక సమస్యలు

యజమానుల షరతులపై దస్కతులు పెటిన 30 మంది వేరొక యూనియన్ ఏర్పాటు చేసుకుంటా మంటున్నారు. కార్మికుల ఐక్యతను చీల్చుటకు యజమానులు నెమ్మదిగా వ్యవహరించు చున్నారు. ఈ ఎత్తు సాగకుండ కార్మికులు కాచుకోవాలి.

మదరాసు

బస్సు పనివారల సమ్మె.

బస్సు కార్మికుల ప్రతినిధులకు, యజమానులకు మధ్య సంప్రదింపులు జరుగుచుండగా 5వ తేదీ సాయంత్రం 4 గురు డ్రైవర్లను యజమానులు పోలీసుల సహాయంతో పనినుండి తొలగించారు. దానితో తిరిగి సమ్మె ప్రారంభమయింది. ఈ తగాదా పరిష్కారం విషయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయబడిన పరిష్కార విధానానికి కట్టుబడక, బస్ కార్మికులు సమ్మె చేశారు అనే నెపంతో, బస్సు యజమానుల సంఘాధ్యక్షుడు రాయబారములను ఆపుచేశారు. 6వ తేదీ సాయంకాలం బస్సు కార్మిక సంఘ కార్యనిర్వాహక వర్గం సమావేశమై సమ్మెను ఆపుచేసి సంప్రదింపుల పర్యవసానమును తేల్చుకొనుటకు తీర్మానించింది. దానిపై చాలామంది కార్మికులు పనిలోనికి పోయారు. మిగిలిన కొద్ది మందినీ పనిలో చేర్చుకొనుటకు యజమానులు నిరాకరించారు. ఈ విధంగా పనిలో చేరిన వారికీ, చేరని వారికీ పేచీ పెట్టి కార్మికులను చీలగొడదామని యజమానులు తలచారు. గత సంధి షరతులను పెట్టవలసినదని కార్మిక నాయకులు ఎంత కోరినా యజమానులు మొండితనం చూపించారు.

8వ తేదీని 500 మంది బస్ కార్మికులు మద్రాసు ప్రభుత్వ ఆఫీసు (సెక్రటరియట్) వద్ద పెద్ద ప్రదర్శన చేశారు. వీధుల వెంట నినాదాలతో ఊరేగింపు జరిపారు. తాత్కాలికపు ఒడంబడికను పాటించుటకు కార్మికులు తీర్మానించుకొని అందరూ పనికి మరునాటి ఉదయం పోయారు. యజమానులు అంగీకరించారు. హిందూస్థాన్ ట్రాన్సుపోర్టు కంపెనీ యజమానులు మాత్రం డ్రైవర్లను పనిలో చేర్చుకొనుటకు నిరాకరించారు ఈ విషయం తాత్కాలిక పరిష్కార కమిటీకి పంపబడింది.

కరాచి.

ట్రాం పనివారి సమ్మె

ట్రామ్‌వే కార్మికులు తమ కష్టాలను యజమానులకు యిదివరలో తెల్పి యున్నారు. సమాధానం రాకుండానే ముగ్గురు కార్మికులను యజమానులు పనిలోనుండి తొలగించారు. ఇందుపై 9 వ తేదీని 550 మంది కార్మికులు సమ్మె చేశారు. ఎక్కడి ప్రయాణీకులక్కడే ఆగిపోవలసి వచ్చింది. ట్రామ్ కార్లను పోలీసుల సహాయంతో యజమానులు ఒక మూలకు తోయించుకొని పోయారు.

యీ తగాదాను పరిష్కారం చేయుటకై విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయించుటకు అంగీకరించ వలసినదని యజమానులు కోరితే కార్మికులు అంగీకరించలేదు.

పట్టణంలోనున్న యితర కార్మికు లందరూ ట్రాం పని వారికి సానుభూతిని చూపుచున్నారు. మూల మూల నుండి కార్మికులు ఊరేగింపులు, నినాదాలతో సానుభూతిని వెల్లడిస్తున్నారు. యీ సమస్య పరిష్కారం కాకపోతే జనరల్ స్ట్రయిక్ కరాచీలో వస్తుందని తలుస్తున్నారు.

సమ్మె దారులపట్ల సానుభూతిని చూపుతూ మునిసిపల్ కౌన్సిలువారు కౌన్సిలు మీటింగును వాయిదా వేశారు.

పాట్నా

బళ్ళవాళ్ళ సమ్మె.

మునిసిపల్ అధికారులు దుండగాలను సాగిస్తున్నారనియు, పన్నులు ఎక్కువగా నున్నాయనియు, బండ్లు నిలిపే గేటులో షెడ్డులు లేవనియు, యీ యిబ్బందులు తీర్చవలసినదని 500 మంది బళ్ళవాళ్ళు పాట్నాలో యీ నెల 1 వ తేదీ నుండి సమ్మె చేస్తున్నారు.

క్విలన్

నల్లజెండా ఊరేగింపు.

తిరువాన్కూరు ప్రభుత్వం 3 వ తేదీని సాగించిన కాల్పులను ఖండిస్తూ క్విలన్‌లోని అన్ని ప్యాక్టరీల కార్మికులు కలసి 4వ తేదీని, నల్ల జెండాల పూరేగింపు జరిపారు. ఒక్క మిల్లు కూడా తెరవబడలేదు.

హింగన్ ఘాట్

ఇక్కడ 3,500 మంది కార్మికులు రెండు నెలలు పైనుండి సమ్మె చేస్తున్నారు. 7వ తేదీని కార్మిక నాయకులు సి. వి. ప్రధాని శుక్లాగారిని కలుసుకొన్నారు. ఈ దిగువ షరతులకు ప్రభుత్వము, కార్మిక నాయకులూ అంగీకరించారు.

1. ప్రభుత్వం సూచించిన విధానాన్ని జీతాలు పునరుద్ధరించుట.

2. సమ్మె దారులను యజమానులు నిర్బంధించకుండా ప్రభుత్వం కృషి చేయుట. అయినప్పటికి నిర్బంధం జరిగే సందర్భంలో పరిష్కార సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసి పరిష్కరించుట.

3. కార్మిక సంఘం గుర్తింపబడాలి.

4. సమ్మెను ఆపుచేయుట.

యీ షరతులను యజమానుల చేత ఒప్పించుదమని మంత్రులు చెప్పిరి. కార్మికులచే అంగీకరింప జేయుటకు కార్మిక నాయకులు వారిని కలుసుకొను చున్నారు.

బొంబాయి

కార్మికులపై కాల్పులు.

నూలు వడికేవారూ, చుట్టేవారూ పనిలోకి రాకపోవుటచే, మిల్లును మూసివేశామని బ్రాడ్‌బరీ మిల్లు యజమానులు ఒక నోటీసును మిల్లు గేటువద్ద ప్రకటించారు.

5వ తేదీ ఉదయం పై మిల్లు గేటువద్ద పికెటింగు చేస్తూండగా పనిలోకి పోయేవారిపై రాళ్ళు రువ్వారనే నెపంతో పోలీసు ఇనస్పెక్టర్ తుపాకి కాల్చాడు యీ చర్య పట్ల తమ అసమ్మతిని తెలుపుతూ ఆ మిల్లులో పని చేయుచున్న 500 మంది నేత కార్మికులు కూడా సమ్మెలో చేరారు. అందరు కలసి పెద్ద ఊరేగింపు జరిపి, అనంతరం ఒక సభ జరిపి అందు పోలీసుల చర్యలను ఖండిస్తూ తీర్మానం చేశారు.

కార్మికతగాదా బిల్లుకు శాసన సభలో తీవ్ర ప్రతిఘటన.

కార్మిక తగాదా బిల్లును శాసన సభలో ప్రవేశపెడుతూ ప్రధాని ఖేరుగారు ఇట్లాచెప్పారు

"రాయబారాల ద్వారా కలిగిన దానికంటె కార్మికులకు సమ్మెల ద్వారా ఎక్కువేమీ రాలేదు. గత్యంతరం లేనప్పుడే సమ్మెచేయాలి. యీ బిల్లును పెట్టుటలో పరిష్కారానికి గల మార్గాలన్నీ అయిపోయే వరకూ సమ్మెలను, లాకౌట్లను ఆపుచేయుటయే మా ఉద్దేశ్యం" అని అన్నారు.

ఈ బిల్లు వలన నెగ్గేటందుకు కార్మికులకున్న కాస్త అవకాశంపోయి, యజమానులకు అధికారం ఎక్కువయినది.

బొంబాయిలో జరిగిన కార్మిక తగాదాలను గూర్చియు, వాటివలన యిరుపక్షాల వారికి కలిగిన నష్టాలను గూర్చియు ఖేరుగారుపన్యసించారు. కాని కార్మికులు గత్యంతరం లేకనే చేసిన సమ్మెలుగాని అవి, ముచ్చటకై చేసిన ఒక్క సమ్మెను కూడా ఖేరుగారు పేర్కొని చూపించలేక పోయారు. సమ్మెలను ఆపు చేయాలంటే నిర్బంధం చేస్తే ఏమి న్యాయం? కార్మికులకు, జీవనానికి చాలినకూలి, పనిచేయవలసిన గంటల నియమం మొదలగు సౌకర్యములను ఏర్పాటుచేయుడం న్యాయం. నిర్బంధం పోరాటాన్ని పెంచుతుందిగాని అణచలేదని మనం ఇతరులకు చెప్పటలేదా. మనకీ అదే వర్తించాలి.

యీ బిల్లుపై శాసన సభలో చర్చ జరుగుచున్నప్పుడు పెట్టుబడిదార్లు సాగుదంటున్నారు, ఇతరులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు.

రాజకీయ సభలలో పోలీసు బందోబస్తు

ఇకముందు పోలీసువారు రాజకీయ సభలలో సరియైన బందోబస్తు చేయవలెనని మదరాసు గవర్నమెంటు నుండి గుంటూరు పోలీసు ఉద్యోగస్థులకు లోపాయికారీ ఉత్తరువులు వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ ఉత్తరువులకు కారణం గుంటూరు. విశాఖపట్నం, తిరుచినాపల్లి సభలలో ప్రధానామాత్యుడు ఉపన్యాసము లిచ్చినప్పుడు జరిగిన గందరగోళం అని గుంటూరు ప్రజలు ఊహిస్తున్నారు.

గుంటూరు సభలో ప్రధానామాత్యుడు యీ వాక్యాలతో ఉపన్యాసాన్ని ముగించారు.

"ఈవేళ నేనొక గారడీ చేశాను. నేను ఈవేళ పడిన శ్రమకు నాతల పగిలిపోయి ఉండవలసినది. నన్ను నే నభినందించుకొంటున్నాను."

మహాత్ముని కుటీరం వద్ద సత్యాగ్రహం

మధ్య రాష్ట్ర మంత్రివర్గంలో ఒక హరిజన ప్రతినిధిని చేర్చుకొనుడని గాంధి మహాత్ముని కుటీరం వద్ద హరిజనులు జట్లు జట్లుగా నిరాహార వ్రతం చేస్తున్నారు, ఉపవాసము మానవలసినదని గాంధిగారు ఎంత బోధించినను వారు వినలేదు. హరిజన స్వాతంత్ర్య సంఘాధ్యక్షుడు రాజభోజ్‌గారు, బొంబాయి హరిజన నాయకుడు డాక్టర్ అంబేద్కర్‌గారు సత్యాగ్రహము యెడల అసమ్మతిని తెలియజేశారు. కాని సత్యాగ్రహులు తమ పట్టును విడువలేదు.

కడప జిల్లాలో మద్యపాన నిషేధం

అక్టోబర్ 1వ తేదీ నుండి కడప జిల్లాలో మద్యపాన నిషేధం ప్రారంభించ బడునని మదరాసు ప్రభుత్వం నిశ్చయించింది. జిల్లా కలెక్టరు యిందుకు యిప్పటి నుంచీ ప్రచారం చేస్తున్నాడు. బడి పిల్లలచే ప్రతిరోజు సాయంకాలం తమాషా అయిన ఆటలను, పాటలను ఏర్పాటుచేసి, త్రాగుడు అభ్యాసం గల వారికి వినోదము కలిగించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉపన్యాసముల ద్వారా కలెక్టరు మద్యపాన నిషేధ ప్రచారం చేయుచున్నట్లు వార్తలు వస్తున్నాయి.

బర్మా కలహాలు

గత జూలై మాసాంతమున బర్మాలో భారతీయులకును, బర్మీయులకును జరిగిన కొట్లాటలలో 500 మంది భారతీయులు మరణించారు. 1000 మంది గాయపడ్డారు. 2000 భారతీయ దుకాణములను బర్మాలో ప్రజలు దోచుకున్నారు. వస్తువులకు, ఆస్తికి మొత్తం కోటి రూపాయలు నష్టం వచ్చింది.

తాత్కాలికమైన మత ద్వేషములే యీ కొట్లాటలకు కారణం అని ప్రకటించబడింది. అచిర కాలంలో ఉభయజాతుల వారికీ సామరస్యం ఏర్పడునని అందరూ ఊహించారు. బర్మీయులచే బౌద్ధమత దూషణగ పరిగణింపబడిన గ్రంధాన్ని బర్మా ప్రభుత్వం నిషేధించింది. దాని ప్రచురణకర్త శిక్షింపబడ్డాడు.

కాని, యీ గ్రంధాన్ని రచించినది బర్మీయుడైన మహమ్మదీయుడేగాని భారతీయ మహమ్మదీయుడు కాడని వార్తలు తెలుపుతున్నాయి. అల్లరులు ప్రారంభమై నెలరోజు లయింది. అయినప్పటికీ భారతీయులపై దౌర్జన్యాలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. ఎవరి రాష్ట్రాలకు వారు తిరిగి వచ్చుటకు బర్మా ప్రభుత్వం ఓడ ప్రయాణపు ఖర్చు లిస్తోందని యీ మధ్య ఒకవార్త ప్రకటించ బడింది. కాని, ఆవార్త నిరాధారమైనదని బర్మా నుండి వచ్చిన రాయబార వర్గంవారు తెలియజేస్తున్నారు.

బర్మా అల్లరులను గురించి విచారణచేయుట కొక కమిటీని నియమించుటకు బర్మా గవర్నరు నిర్ణయించారు.

ఇంత వరకు రమారమి 3 వేల మంది భారతీయులు స్వదేశమునకు తిరిగి వచ్చిరనియు ఇంకను 30 లేక 40 వేలమంది ఆస్థులను పోగొట్టుకొన్న భారతీయులను ఈదేశమునకు తీసుకొని రావలసియున్న దనియు, ఈ విషయములో బర్మా, ఇండియా ప్రభుత్వాలు తగిన శ్రద్ధ తీసుకొన వలెననియు సింధుస్టీమ్ నావిగేషన్ కంపెనీ ప్రయాణీకుల ఇన్‌స్పెక్టరగు శ్రీ కర్రా సీతారామయ్యగారు ప్రకటిస్తున్నారు.

ఇప్పుడు రెండవసారి ప్రారంభమైన కలహాల్లో సెప్టెంబరు 2 మొదలు 4 వ తేదీ వరకు చనిపోయిన వారు 17 గురు, గాయములు తగిలినవారు 66 గురు అని రంగూన్ వార్తలు ప్రకటిస్తున్నాయి. ఒక వారం రోజుల వరకూ నగరమందలి దుకాణములు మూయబడ్డాయి. మిలిటరీ పోలీసులు, సివిల్ పోలీసులు గుంపులమీద తుపాకులు కాల్చారు. అయినప్పటికీ హత్యాకాండ చల్లారే సూచనలు కనపడ్డ లేదు. ఈనెల 4 వ తేదీని చెన్నపట్నం రేవులో 1030 మంది భయ భ్రాంతులైన బర్మా భారతీయులు ఓడలో దిగారు.

బర్మాదేశపు భారతీయులతో ప్రతి సంవత్సరం ఎంతో వ్యాపారం సాగిస్తూ లాభం అనుభవిస్తోంది. కోట్ల కొలది రూపాయల విలువ గల కలప, బియ్యం, వజ్రలు, ఇంకా ఎన్నో సరుకులు బర్మానుండి ఇండియాకు దిగుమతి అవుతున్నాయి. అయినప్పటికీ మన ప్రజలకు నేడు బర్మాలో నిలువ నీడ లేకుండా పోతున్నది.

రంగూన్‌లో ఎమర్జన్సీ సెక్యూరిటీ ఆక్టు అమలు పరిచారని బర్మా శాసనసభలో తెలియజేయ బడింది. దీని ప్రకారం, వారంట్లు లేకుండా ఎవన్ను చేయడానికి పోలీసులకు అధికారం ఉంటుంది. ఈ శాసనం 5 సంవత్సరముల వరకూ అమల్లో ఉంటుంది. బర్మా దేశస్థులు కానివారి నెవరినైనా బర్మా నుండి ఎందుకు వెడలగొట్ట కూడదో సంజాయిషీ చెప్పుకో వలెనని ఈ క్రొత్త శాసనం ప్రకారం నోటీసు యివ్వవచ్చు. సుమారు 2000 మందిని ఈ విధంగా దేశబహిష్కారం చేయుటకు ప్రభుత్వం నిశ్చయించినట్లు వార్తలు వస్తున్నాయి.

వార్తాలహరి

ఆంధ్రదేశంలో మంత్రుల ఆగమనం

స్థానిక శాఖా మంత్రి శ్రీ బెజవాడ గోపాల రెడ్డిగారు ఈ నెల 2,3 తేదీలలో ఏలూరు తాలూకా వట్లూరు, పెదపాడు, పూళ్ళ, కైకరం మొదలైన గ్రామాలు సంచారం చేశారు. కొవ్వూరు తాలూకాలో దేవరపల్లి, గోపాలపురం, తాళ్ళపూడి, కొవ్వూరు గ్రామాలు సంచారం చేశారు, కైకరంలో మంత్రిగారికి సమర్పించ బడిన సన్మాన పత్రాలకు సమాధాన మిస్తూ, గత జిల్లాబోర్డు ఎన్నికలలో ప్రజలు కాంగ్రెసు గౌరవము నెందుకు భగ్నపరచిరని అడిగారు. ఆంధ్ర రాష్ట్రం సంపాదించే శక్తిని యింకా మదరాసు ప్రభుత్వానికి ప్రజలీయ లేదని చెప్పారు. కొవ్వూరులో కొవ్వూరు తాలూకా రాజకీయ మహాసభకు శ్రీ గోపాలరెడ్డిగారు ప్రారంభోత్సవం చేశారు.

రివెన్యూ మంత్రి శ్రీ ప్రకాశం పంతులు గారు విశాఖపట్నం జిల్లాలో చోడవరం, కస్పా జగన్నాధపురం, మాడుగుల, విశాఖపట్నం, ఇచ్ఛాపూర్ మొదలైన ప్రదేశాలు సందర్శించారు. మాడుగులలో జరిగిన సభకు కొన్ని వేల మంది కోయజాతి ప్రజలు సమావేశ మయారు. వెట్టి, అడవుల యిబ్బంది, ఋణబాధ మొదలైన కష్టాలను గురించి వారు మంత్రిగారికి విజ్ఞప్తి చేసుకున్నారు. వారికి సమాధానమిస్తూ మదరాసు ఋణ పరిష్కార చట్టం ఏజన్సీ ప్రజలకు కూడా వర్తింప జేస్తామని చెప్పారు. (ఆ విధంగా వర్తింపజేస్తూ మదరాసు ప్రభుత్వ ప్రకటన వెలువడింది).

మదరాసు ప్రభుత్వం— హరిజనోద్యమం

రాజధాని యందలి ప్రతి జిల్లాయందు హరిజన సేవా సంఘం మొదలైన హరిజన సంస్థల తరఫున ప్రచారం చేస్తూన్న అనధికార వ్యక్తులతో కూడిన ఎడ్వైజరీ బోర్డులను స్థాపించుటకు తీర్మానించినట్లు ఒక ప్రభుత్వ ప్రకటన చేయబడింది. ప్రతి జిల్లాకు జిల్లా కలెక్టరు, మరి యిదరు సభ్యులతో గూడిన కమిటీ కలెక్టరే దీనికి సమావేశకర్త. ఇదే విధంగా రాజధానికంతటికి ఒక ఎడ్వైజరీ బోర్డు స్థాపింప బడింది. దీనిలో 5 గురు సభ్యులున్నారు. వారు దివాన్ బహదూర్ వి. భాష్యం అయ్యంగార్ (మదరాసు హరిజన సేవా సంఘాధ్యక్షుడు), వి. రామదాసు పంతులుగారు (ఆంధ్ర రాష్ట్ర హరిజన సేవా సంఘాధ్యక్షుడు), యల్. యన్. గోపాలస్వామిగారు (తమిళనాడ్ హరిజన సేవా సంఘ కార్యదర్శి), దివాన్ బహదూర్ ఆర్. శ్రీనివాసన్, కె. షణ్ముగం, మదరాసు లేబర్ కమీషనర్. ఇదే విధంగా ప్రతి జిల్లాకు జిల్లా కలెక్టరు మరి యిద్దరు అనధికార సభ్యులను ప్రభుత్వం నియమించి వారివారి పేర్లు ప్రకటించింది.

ఈ జిల్లా, రాష్ట్ర ఎడ్వైజరీ కమిటీలు 3 మాసముల కొకసారి సమావేశమై, ముందు కార్యక్రమం నిర్ణయించు కుంటారు.

మదరాసు ప్రభుత్వ ఋణం

నీటి పారుదల వసతులకు, స్థానిక సంస్థలకు "ఎడ్వాన్సు" లిచ్చుటకు, ఎలెక్ట్రిసిటీ స్కీములకు, వ్యవసాయదార్ల ఋణములకు, మొత్తం 150 లక్షల రూపాయలు ఋణం చేయుటకు మదరాసు ప్రభుత్వంవారు తీర్మానించి, ప్రకటించారు. వడ్డీ నూటికి 15 సంవత్సరములకు రు 3-0-0 ప్రతి 6 నెలల కొకసారి వడ్డీ మాత్రం యిస్తూ, 1953, వ సంవత్సరం సెప్టెంబరు 15 వ తేదీని అసలు తిరిగి యిచ్చివేస్తారు.

తుంగభద్ర ప్రాజెక్టు

రాయలసీమ యందలి కాటక పరిస్థితులు తిరిగి ఆ జిల్లాలలో రాకుండా కట్టుదిట్టముగ చేయుటకై ఒక ఉపసంఘం నియమించబడింది. బళ్ళారిలో సమావేశమైన ఉపసంఘము యెదుట బళ్ళారి జిల్లా కలెక్టరు సాక్ష్యంయిస్తూ తుంగభద్ర ప్రాజెక్టును త్వరలో నిర్మించుటకు ప్రభుత్వం పూనుకోవలసినదని చెప్పాడు.

బళ్ళారి జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ వి. యం. గిరిగారు కూడా యీ సలహానే యిచ్చారు.

ఉత్తరాదిలో వరదలు

ఎడతెగని వానలచే సంయుక్త రాష్ట్రమందలి అనేక నదులు పొంగి పోతున్నాయి, గోరఖ్‌పూర్‌కు 3 మైళ్ళ దూరంలో ఉన్న తెలాహాసి కట్ట తెగినది, [illegible] వేసిన కట్ట తెగింది, తపతీ నది [illegible] పొర్లి పోవడం వల్ల అనేక గ్రామాలు వరదలో మునిగిపోయాయి, పంటలు [illegible] శారదా నది ప్రవాహం మారుటచేత [illegible] నది పొంగి, అనేక గ్రామాలను ముంచివేసింది. తిండి, గుడ్డ, యిల్లు లేక అనేక వేల మంది ప్రజలు అల్లాడుతున్నారు. 50 సంవత్సరముల [illegible] యీమధ్య యింత తీవ్రంగా [illegible] లో వరదలు రాలేదు.

బెంగాల్

ఇదే విధంగా బెంగాల్‌లో బ్రహ్మపుత్రా, పద్మానదులు పొంగి రెండు మూడు జిల్లాలలోని గ్రామాలను ముంచివేస్తున్నాయి. అనేక ప్రదేశాలలో రైలు కట్ట తెగిపోతున్నాయి. మున్షీగంజ్ జిల్లాలో అనేక వేలమంది ప్రజలు తిండి యిండ్లులేక, దుర్భర బాధ పడుతున్నారు. తేజ్‌పూర్ సమీపంలో ఒక [illegible] దానిపై [illegible] గేపూర్ [illegible] కొందరు ప్రజలు [illegible] కొమ్మల మీదను [illegible] కాలం గడుపుతున్నారట.

అస్సాం రాష్ట్రంలో కూడా అనేక [illegible] ప్రజలు [illegible] అనేక యిబ్బందులు పడుతున్నారు.

విద్యావనం

నాగేశ్వర నగరం

విద్యావనం అక్టోబరులో ప్రారంభించటానికి కారణ మేమనీ, ఇచ్చట చదువుకున్న పిల్లలు ఇతర గవర్న మెంటు పాఠశాలలలో ఏ తరగతిలో చేరగల రని, ఒక్కొక్క తరగతిలో పిల్ల లెన్నా ళ్ళుండవలె ననే ప్రశ్నలు కొందరిని కలవర పెడుచున్నట్లు ఉత్తర ప్రత్యుత్తరముల ద్వారా తెలియుచున్నది.

అసలీ విద్యావనం హాలెండులోని అంతర్జాతీయ పిల్లల కూటమి. "International children's Commune." స్విజర్లెండులోని చిల్డ్రిన్ గార్డెను మొదలగు గొప్ప గొప్ప అంతర్జాతీయ సంస్థల నాదర్శముగా బెట్టుకొని జాతి మత వివక్షతలు లేక అన్ని రాష్ట్రముల వారిని, యితర దేశముల వారిని గూడ యిచ్చట చేర్చి పూర్వపు గురుకులాశ్రమ పద్ధతిని ఆధునిక వైజ్ఞానిక విద్యాపద్ధతులను సమన్వయము చేసి ప్రస్తుత కాల పరిస్థితులను బట్టి, నూతనాదర్శముల ననుసరించి, పరిశోధనల వల్ల అనుభవమునకు వచ్చు నూతన పద్ధతుల నమలులో బెట్టి, పిల్లల మనస్తత్వ పరిశోధనా నిలయముగను, అదర్శ విద్య గరపు పాఠశాలగను, పుష్టి నిచ్చు పదార్థములను తిని చమట బట్టు పరిశ్రమ చేసి మానసికాభివృద్ధికి కూడ ప్రాముఖ్యత నిచ్చు ఒక మహా సంస్థగా పెంపొందింప జేయు నుద్దేశముతో ప్రారంభింపబడ నున్నది.

ఈ సంస్థ అక్టోబరులో ప్రారంభించుటకు ప్రత్యేక కారణము లేమియు లేవు. ఇచ్చట సంవత్సరము పొడుగుతా పిల్లలు చేర్చుకోబడుదురు. కారణం ప్రతి పిల్లవానికి ప్రత్యేక శిక్షణ యుండును. అనగా ఒక క్లాసులో పిల్లలందరితోపాటు సంవత్సరం ఒక విద్యార్థి యుండ నక్కర లేదు. ఆ యా క్లాసులకు నిర్ణీతమైన విద్య తెలివితేటలు గల విద్యార్థి స్వల్పకాలములోకూడ పూర్తి చేయగలుగునట్లు శిక్షణ యివ్వబడును. అందువల్ల ఎవ రెప్పుడు వచ్చి చేరినను ఆ యా తరగతికి తగిన విద్య పూర్తి చేసుకోవచ్చును.

ఇచ్చట సంపూర్తిగా చదువుకున్న పిల్లలు ఇతర పాఠశాలలలో ఇంగ్లీషు ఫోర్తుఫారములో చేరగలుగుదురు. కాని ఇచ్చట గూడ కేంబ్రిడ్జి సీనియరు, జూనియరు, లండన్ మెట్రికు, బెనారస్ ఎంట్రెన్సు మొదలైన పరీక్షలు, ప్రయివేటుగా చదివి పరీక్షకు కూర్చోదగిన వాటికి గూడ పిల్లలను తయారు చేయుటకు కొద్ది కాలములోనే ప్రయత్నించెదము. ఇచ్చట అయిదేండ్ల బాలుడు గాని బాలిక గాని ప్రవేశించినచో 13 వ ఏడు పూర్తి యగునప్పటికే యితర పాఠశాలలలో IV ఫారములో చేరగలుగునట్లు విద్య గరుపబడును.

విద్యావనం
7—9—38

ఇట్లు
అన్నాప్రగడ సరళాదేవి
అన్నాప్రగడ కామేశ్వరరావు
డైరెక్టర్సు

దివి తాలూకా రైతు సంఘ వర్కింగు కమిటీ సమావేశం 18-9-38 వ తేదీని కల్లపల్లిలోని ట్రావెలర్సు బంగాళాలో జరుగును గాన సభ్యు లెల్లరు రా ప్రార్థన.

ఇట్లు
కాకర్ల చంద్రశేఖర రావు
ప్రెసిడెంటు.

వార్తలు

తెనాలి తాలూకా రైతు సంఘము.

2-9-38 వ తేదీన తెనాలి తాలూకా రైతు సంఘ సభ్యత్వమునకు తుమ్మపూడి గ్రామ కాపురస్తుడు వాశిరెడ్డి రాజమౌళి గారు రాజీనామా నిచ్చినందున, సదరు సభ్యత్వమునకు వాశిరెడ్డి నారాయణ ప్రసాదు గారిని ఎన్నుకోవడ మైనది.

పెదపాలెం
6—9—38

ఇట్లు
నారా శ్రీనివాసరావు
కార్యదర్శి
తాలూకా రైతు సంఘం (తెనాలి)

★

కృష్ణా జిల్లా రైతు సంఘము.

సర్క్యులరు నెం. 13.

4-9-38 వ తేదీన వీరవల్లిలో జరిగిన రాష్ట్ర రైతు కార్యవర్గ సభలో మన జిల్లాలో అక్టోబరు నెలాఖరుకు 4,000 ప్రాథమిక రైతు సంఘ సభ్యులను చేర్పించవలసినదిగా నిర్ణయ మైనది. కనుక అన్ని గ్రామ, తాలూకా రైతు సంఘములును, రైతు శ్రేయోభిలాషులును శ్రద్ధ వహించి వెంటనే రైతు సంఘ సభ్యులను చేర్పించ కోరెదను. కాంగ్రెసు, యువజన, సోషలిస్టు సంఘ సభ్యులును యిందుకు తోడ్పడ ప్రార్థన.

బెజవాడ.
9—9—38

సుంకర సూర్యనారాయణ
ప్రధాన కార్యదర్శి.

★

గు డి వా డ.

పట్టణ యువజన సంఘం

26-8-38 రాత్రి 7 గంటలలకు పట్టణ యువజనులు సమావేశమైరి. సంఘానికి నూతన సంవత్సరానికి కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నం గారిని తిరిగి అధ్యక్షులు గాను, ప్రధాన కార్యదర్శిగా సూరపనేని శేషగిరి రావు గారిని సహాయ కార్యదర్శిగా కామ్రేడ్ కె. బి. భుజంగభూషణరావు గారిని ఎన్నుకొనిరి. 12 గురు కార్యవర్గ సభ్యుల నెన్నుకొనిరి. కొన్ని ముఖ్య తీర్మానము లేకగ్రీవముగా అంగీకరించబడెను.

★

ఆత్రేయపురము.

గ్రామ యువజన సంఘము.

ది 27-8-38 తేదీ మధ్యాహ్నం గ్రామ యువజన సంఘ సభ్యుల సాధారణ సమావేశము జరిగెను. కామ్రేడ్ ముదునూరి సూర్యనారాయణ రాజుగా రధ్యక్షులుగను, కామ్రేడ్స్ ఎమ్. సూర్యనారాయణ, కె. సుబ్రహ్మణ్యం గార్లు జాయంటు కార్యదర్శులుగను మరి యార్గురు కార్యవర్గ సభ్యులును ఎన్నుకొనబడిరి. చేయవలసిన పనులు విభజింపబడి వానికి వేర్వేరు కార్యదర్శులు నియమింపబడిరి. పంచాయితీ బోర్డువారు చేయవలసిన పనులకు ఒక ప్రణాళిక తయారు చేసి వారికి యిచ్చుటకు తీర్మానింపబడెను. యుద్ధ ప్రతికూల చట్టము నిరసించుచు తీర్మానింపబడెను.

నిన్న రాత్రి బహిరంగ సభ జరిపి ఆసభలో యువజన సంఘమువారు తమ కనీసపు కోర్కెల ప్రణాళికను పంచాయితీ బోర్డు వారికి సమర్పించిరి.

సంయుక్త కార్యదర్శులు.

కడప యువజన సంఘం.

1-9-38 వ తేదీన యువజనులు సమావేశమై ఈ క్రింది కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు.

అధ్యక్షుడు :—
పెనుపోలు బాలయ్యశ్రేష్టిగారు.

ఉపాధ్యక్షుడు :—
దక్షిణపు శీతారామయ్యగారు.

సంయుక్త కార్యదర్శులు :—
పాలెం నరసింహులుగారు.
పంజాల సుబ్బారాయులుగారు.

కోశాధిపతి :—
సంధా చిన సుబ్బయ్యగారు

యువజన సంఘం మద్యపాన నిషేధ ప్రచారానికి పూనుకొన్నది.

★

తణుకు తాలూకా కాంగ్రెసు సంఘము

త ణు కు.

పై సంఘ సాధారణ సమావేశము యీ నెల 2 వ తేదీన జిల్లా కాంగ్రెస్ ఆఫీసులో, శ్రీయత యిందుకూరి సుబ్బరాజుగారి ఆధిపత్యము క్రింద సమావేశమై కావించిన తీర్మానములు.

1. రాష్ట్ర సంఘ ఆడిటరు గారి రిపోర్టు చదివిన మీదట ఆమోదించడ మైనది.

2. తణుకు తాలూకా కాంగ్రెసు సంఘము తాలూకు సొమ్ములు తమ వద్ద ఉన్నవని, యింతకాలము వరకు యివ్వక ఉపేక్ష వహించి, జిల్లా బోర్డు సభ్యులుగా కాంగ్రెసు సంఘమునకు నామినేషన్లు దాఖలు చేసిన యీ దిగువ వారిని సదరు సొమ్ము యిచ్చేవరకు సభ్యులుగా అంగీకరించరాదని యీ సభవారు ఆంధ్ర రాష్ట్ర సివిక్ బోర్డు వారిని, జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డువారిని కోరుచున్నారు.

1. కొవ్వలి గోపాల రావు గారు
2. పోతరాజు సుబ్బయ్య గారు
3. దామిశెట్టి వెంకన్న గారు.
5. కందుకూరి రాజేశ్వర రావు గారు

దీనిని యీ సభవారు ఏకగ్రీవముగా ఆమోదించడ మైనది.

యిట్లు
యి. వీ. బసవరాజు
కార్యదర్శి

★

ఆంధ్ర రాష్ట్ర

ప్రెస్ వర్కర్సు యూనియన్

కార్య నిర్వాహక వర్గ సమావేశము.

ది 18-9-38 ఆదివారము ఏలూరు ప్రెస్ వర్కర్సు యూనియన్ ఆఫీసులో జరుగును.

ఎ జం డా

1. ఏలూరు ప్రెస్ యజమానుల తీర్మానములు వాటి ఫలితములు, 2. ఏలూరు ప్రెస్ వర్కర్సు యూనియన్ విషయము, 3. రాష్ట్ర కాన్ఫరెన్సు వాయిదా వేయుట విషయము, 4. కార్యదర్శి ప్రవేశపెట్టు ఇతర విషయములు చర్చింపబడును. గాన సభ్యు లందరు తప్పక విచ్చేయ ప్రార్థన.

ఇట్లు
పి. వెంకటేశ్వర్లు
కార్యదర్శి

దిన దినాభివృద్ధి గాంచుచున్న ఆంధ్ర కార్మికోద్యమం

శ్రీ పోలేపెద్ది నరసింహమూర్తి.

దేశమంతట నలుగడల గొప్పగొప్ప కార్మిక పోరాటాలు సాగుచున్నాయి. కార్మిక వర్గం, బ్రహ్మాండమగు ఐక్యతతోటీ, వేగంతోటీ ముందుకు సాగిపోతోంది. తన కనీసపు కోర్కెలను స్థాపించుకొను చున్నది. కార్మిక వర్గాన్ని విజయ పరంపరలు అలంకరిస్తున్నాయి. ఇవి తిరిగి నూతనోత్తేజాన్ని, ఐకమత్యాన్ని, బలాన్ని కార్మిక వర్గానికి ప్రసాదిస్తున్నాయి. దేశం మొత్తంమీద కార్మిక సంఘాల సంఖ్య కూడ హెచ్చిపోతోంది.

కార్మికవర్గపు యీ విజృంభణాన్ని చూచి పెట్టుబడిదారీ వర్గం భయభ్రాంత మగుచున్నది. దీనిని భగ్నము చేయడానికెన్నో కుటిల ప్రయత్నాలను చేయుచున్నది. పోలీసు సహాయంతో నిర్బంధ విధానాన్ని సాగిస్తున్నారు. కార్మిక వర్గం తన పట్టును మాత్రం విడువడం లేదు. దేశంలో కాంగ్రెసు మంత్రివర్గా లేర్పడుటచే, తమ హక్కు లేర్పడే రోజు వచ్చిందనే ఆశాజ్యోతి యీ ఉద్యమాన్ని మరింత బలాన్ని చేకూరుస్తుంది. దేశంలోని వివిధ రాజకీయ పక్షాల వారినీ యీ కార్మిక సమస్య ఆకర్షించింది.

ఆంధ్ర దేశంలో పారిశ్రామికాభి వృద్ధి స్వల్పం. ఉన్నకొద్ది పరిశ్రమలలోనూ పనిచేసే కార్మికులు మేల్కొంటున్నారు. సంఘాలు చాలాచోట్ల ఏర్పడ్డవి. భారత దేశంలోని యితర రాష్ట్రాలలో సాగుతూ ఉన్న కార్మికోద్యమము ఆంధ్రరాష్ట్రపు కార్మికోద్యమమునకు శక్తి నొసంగినది - దీని ఫలితంగా ఆంధ్ర దేశములో సమ్మెలు బయలుదేరాయి. ప్రెస్సులలో పని చేసే కార్మికులు ప్రారంభంలో సమ్మె పోరాటాలు ప్రారంభించారు. ఇవి చాలా ప్రాంతాలలో విజయవంతం కాలేదు. కాకపోయినా కార్మికులలో చైతన్యాన్ని కలిగించింది. వేర్వేరు ప్రాంతాలందు అచ్చు పనివారల సంఘాలు ఏర్పడి అన్నియు కలిసి ఒక కేంద్రీకృత రాష్ట్ర సంఘంగా ఏర్పడినది. నానాటికి బలము వృద్ధి అగుచున్నది. యీ మధ్యనే, ఏలూరులో మంజువాణీ ప్రెస్సు పనివారల సమ్మె జరిగింది. యీ సమ్మె ఆంధ్రదేశపు అచ్చు పనివారల బలాన్ని ప్రదర్శించింది. ఆంధ్ర దేశములో నుండి ఆ ప్రెస్ యజమానికి ఒక్క కార్మికుడు కూడా దొరకలేదు. దీనికి కారణం వారిలో వ్యాపించి యున్న వర్గ చైతన్యమే. కడకు మద్రాసు నుండి 4 గురు కార్మికులు దొరికేసరికి ఎంతో శ్రమ గలిగింది. అచ్చు పనివారల యీ సంఘీభావాన్ని ఎదుర్కొనుటకు యజమానుల యీ దాడి యే అచ్చు పనివారల బలానికి నిదర్శనం. దీని నెదుర్కొనుటకు ఆంధ్ర దేశములోని అచ్చు పనివారందరూ ఏకమగునట్లు చేయుటకు ఆంధ్రరాష్ట్ర ప్రెస్సు వర్కర్సు యూనియన్ పూనుకొని పని చేసినచో యీ ఉద్యమం నూతన స్వరూపం దాల్చును. తమ హక్కును నిలుపుకొనుటకై పోరాటం. ఇది రాజకీయ పోరాటంగా కూడా మారుతుంది.

చీరాల పుగాకు ఫ్యాక్టరీ వారి సమ్మె మరుపుకు రానేరాదు. దాదాపు 5000 మంది పనివారలు పాల్గొన్నారు. స్త్రీలు, పురుషులు, పోలీసుల లాఠీలను, తుపాకులను అరెస్టులను లెక్కచేయక నిలబడ్డారు. గవర్నమెంటు ఎంక్వయిరీ సందర్భంలో ధీమాగా సాక్ష్యం యివ్వగలిగిన ప్రతి కార్మికుడినీ బెదరించారు, చాలా మందిని ఖైదుచేశారు. కాంగ్రెసు ఆదిగా గల శక్తులన్నీ కార్మికులదే న్యాయమని చెప్పినా, సరియగు సాక్ష్యాలు లేకపోయినా విచారణాధికారి హార్విల్ ఏవో సాక్ష్యాలు తీసుకొని రిపోర్టు వ్రాశాడు. ఇంగిత జ్ఞానమెరిగి యున్న ప్రతి మానవుడూ "ఛీ" అన్నాడా రిపోర్టుచూచి, రాష్ట్ర కాంగ్రెసు కమిటీ యీ రిపోర్టును చూచి తోక తొక్కబడ్డ త్రాములా లేచింది. రాజాజీ మాత్రం దానిని ప్రశంసించుటచే కాంగ్రెసు ప్రతిష్ఠకు కొంచం భంగం కలిగినను చీరాల కార్మికులకు అనుకూలంగా జరిగిన ఐక్య ఆందోళన వలన కార్మికుల పట్టుదల, సంఘటన, కాంగ్రెసుపై విశ్వాసము చెడక నిలచింది

చీరాల ఆంధ్రదేశపు కార్మికోద్యమానికి కాంగ్రెసుకు మెలివేసింది: దీనిమూలంగా కార్మికోద్యమము, జాతీయోద్యమములో తనస్థానాన్ని ఋజువు చేసుకొంది. యీ ఘటన ఆంధ్ర దేశపు కార్మికోద్యమానికి నూతన శక్తిని ప్రసాదించింది.

ఇప్పుడు యజమానులు, సామ్రాజ్యవాదులు కొత్త ఎత్తును ఎత్తుచున్నారు. చీరాల కార్మిక సంఘాన్ని భగ్నం చేసివేయుటకై తంటాలు పడుచున్నారు. రోజు రోజూ కార్మికులను పనిలోనుండి తొలగించు చున్నారు. సంఘాధ్యక్షులుగా నున్న వారిని తొలగించి వారి స్థానే తాము సూచించిన తమ గులాములను అధ్యక్షులు సభ్యులుగా ఎన్నుకుంటే కార్మిక సంఘాన్ని కొండ నెక్కిస్తామంటున్నారు.

ఇందులోని రహస్యాన్ని కార్మికులు కనుక్కొన్నారు. యజమానుల ఈ నాటకానికి ఎదురెత్తు ఎత్తుతున్నారు. యిందుకై పోరాటాలు ఎన్నో జరుగాలి. ఈ పోరాటాలతో కార్మిక వుద్యమం మొత్తంమీద ఉన్నత స్థాయికి పోతుంది. ఇదివరలో వివిధశక్తుల మధ్య యీ ఘటన కలిగించిన ఐక్యతను చెడకుండాచూస్తే సామ్రాజ్యవాదపు ఏజంట్లకు, జాతీయ విద్రోహులకూ వ్యతిరేకంగా ఆంధ్రరాష్ట్రంలో ఐక్య పోరాటాలు సాగించ గలుగుతాము. దీని ప్రభావం కార్మికోద్యమంపై అమోఘం,

సామర్లకోటలో పంచదార ఫ్యాక్టరీలో కార్మికులు సాగించిన సమ్మె గొప్పదే యయినను నాయకత్వపు లోపము లుండుటచే, పొందవలసినంత ఉన్నత స్థానాన్ని పోరాటం వహించలేకపోయింది. కాంగ్రెసు మంత్రులు కలుగజేసుకొని సమ్మె ఏదో విధంగా పరిష్కారం చేశారు. తగినంత ఫలితం కార్మికులకు లభించక పోయినా యజమానులను లొంగదీశాము అనే నైతిక బలంతో కార్మికులు జయించారు. ఇది ముందుకు ఉపయోగ పడుతుంది.

చిట్టివలసలో 3.200 మంది 102 రోజులు సమ్మె జేశారు. స్థానికంగా కాంగ్రెసు సంస్థలంత బలమైనవి కాకపోవుటచే కార్మికులే స్వయంగా ఒంటరిగా పోరాటాన్ని సాగించవలసి వచ్చినది. యజమానుల మొండితనానికి అంతేలేదు. మద్రాసు ప్రభుత్వం యస్. వీ. రామమూర్తిగారిని విచారణకై పంపితే, మిల్లు యజమానులు నిరాకరించారు. ప్రభుత్వాన్ని కూడా లెక్కించనంతటి యజమానులతో ఏక దీక్షతో కార్మికులు పోరాడితే ప్రభుత్వం తరువాత ఏర్పాటుచేసిన విచారణ కోర్టుకు అట్టి యజమాను లంగీకరించారు. యీ సందర్భంలో కార్మికులు తమకేమీ అన్యాయాన్ని జరుగకుండా శ్రమపడాలి. యీ శ్రమయే వీరి పోరాటాన్ని ఉన్నత స్థాయికి గొనిపోతుంది.

ఆంధ్ర రాష్ట్రంలో ప్రధాన పరిశ్రమయైన రైల్వేలోని కార్మికు లింకను తమ బలాన్ని కూడదీసుకో లేదు. కూడదీసు కొనుటకు తీరని కృషిని మాత్రము చేయుచున్నారు. ఇదివరలో తమ హక్కులకై పోరాటాలను సాగించి యున్న రైల్వే కార్మికులు బలమును కూడ తీసుకొనగానే నూతన శక్తితో విజృంభిస్తారు.

ఓడరేవులు కూడా కదులుతున్నాయి. డాక్ కార్మికుల సంఘం ఒకటి విశాఖ పట్టణంలో ఏర్పడింది. తగినంత బలంగాలేదు. బలంకూడిన వెంటనే మిలిటెంటు శక్తిగా అగుటచే ఉద్యమంలోకి రాగలుగుతుంది.

రైల్వేతో సమానముగా తూగుచున్న మోటారు పరిశ్రమలో కార్మికులు మేల్కొన్నారు. వీరి సమస్యలు కూడా ఆందోళనా స్వరూపంలో నున్నవి. మద్రాసు మోటారు సమ్మెలు వీరిపై తగినంత ఒత్తిడిని కలిగించక పోవచ్చును. కాని, రాష్ట్రము మొత్తము మీద కేంద్రీ కృత నాయకత్వము ఏర్పడు వరకూ దీని ప్రభావం అంతగా కనుపించదు.

ఇదిగాక అనేక చిన్న పరిశ్రమల్లోని కార్మికులలో ట్రేడ్ యూనియన్ చైతన్యం కలుగుతోంది. కాని, స్వల్ప సంఖ్యాకులే ఒక్కొక్క చోట నుండుటచే సంఘాలుగా ఏర్పడుటకు అంత ధైర్యం చాలుటలేదు. వీరు సంఘాలుగా ఏర్పడి నప్పటినుండియు తమ హక్కులను నిలుపుకొనుటకై ప్రయత్నాలు జరిగించవలసి యుంటుంది. ఇందుచే యీ పరిశ్రమ లందలి కార్మికులు రెండవ స్థాయి నుండే స్ఫుటమగు పోరాటాన్ని ప్రారంభిస్తారు.

మొత్తంమీద ఆంధ్ర దేశములో కార్మికోద్యమం బాల్యావస్థను వదలుచున్నది. తోడుతోడనే సోషలిస్టు ఉద్యమం ఆంధ్ర దేశములో ప్రధాన స్థానాన్ని వహిస్తోంది. ఒక ప్రత్యేక రాజకీయ సోదరశక్తిగా జాతీయ వాదులచే గుర్తింపబడినా వారిని పోరాట రంగంలోకి ఈడ్చుకు రాగలిగినంత బలవంతమైన శక్తి గాలేదు. కార్మిక పోరాటాలకు వేర్వేరు ప్రాంతాలలో సోషలిస్టులు పాల్గొన్నప్పటికీ, స్థిరముగా నుండి పనిచేయు అవకాశాలు లేకపోవుటచే కార్మిక వర్గపు నాయకమణిగా ఆంధ్ర లోకానికి చాటలేకపోయారు. కార్మికోద్యమం మాత్రం బాల్యావస్థను వీడి రెండవస్థాయికి వచ్చింది. యిది యింకా ఉన్నత స్థానానికి పోవాలంటే సోషలిస్టు పార్టీ గావించిన తీర్మానుసారం సోషలిస్టులు పనిచేయాలి.

అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు అనుబంధ శాఖగా పనిచేసే ఆంధ్రరాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటు కావాలి.

కార్మిక తగాదాలు సంభవించి నప్పుడు మద్రాసు ప్రభుత్వము ఏర్పాటుచేసే విచారణ కమిటీలు నిష్పాక్షికమైనవై యుండాలి. చీరాల విషయంలో ముందుగా రూథర్ఫర్డును మద్రాసు ప్రభుత్వం నియమించింది. దానిని ఖండిస్తూ తీవ్ర ఆందోళనను సాగిస్తే అంతకంటే రిటైర్డ్ సెషనరీ జడ్జి హార్విల్‌ను నియమించింది. సామర్లకోట సందర్భంలో గిరిగారు, బి. యస్. మూర్తిగార్లే స్వయంగా వెళ్ళి ఏర్పాట్లుచేసినా యజమానులకు ఏమి నొప్పి కలుగుతుందో అనే భావంతోనే ప్రవర్తింపవలసి వచ్చింది. చిట్టివలస విషయంలో యింకా చూడవలసి యున్నది.

యీ రకమైన వ్యవహారానికి ప్రభుత్వపు పాలసీయే కారణం. యిదిమారి, పూర్తిగా కూలీల హక్కుల విషయమై కార్మికులకే మేలు జరిపే పోలసీని మద్రాస్ ప్రభుత్వం అవలంబించవలసి యుంటుంది. విచారణ కమిటీలు వేయుట మొదలగు పరిష్కారాలను చేయు సందర్భంలో యజమానుల విషయం మొగమోటం పడనక్కరలేదు. యజమానులకు కావలసిన వ్యాపార విషయాలు చక్కదిద్దుటకు యజమానులు బ్రిటిషు వారితో పోరాటానికి దిగితేనే తప్ప వీలులేదని చెప్పి వారిని కూడా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటంలోకి దింపాలి.

అప్పుడే కాంగ్రెసువారు మంత్రి స్థానాలలోనికి పోయిన ప్రధాన ఆశయం నెరవేరుతుంది. ప్రజా సామాన్యంమొక్క విశ్వాసాన్ని చూరకొంటారు.

లేఖలు

కంపెనీ కూలీల కష్టాలు.

రోజల్లా కష్టపడుతున్నా యజమానుల, గుమాస్తాల, సర్దార్ల మోసాలకు లోనై తినుటకు లేక అల్లల్లాడుతున్నారు.

కార్మిక కర్షకులు తమ శ్రమ నల్ల భారత దేశాన్ని పత్ను గప్ప యనిపించేరు. దేశంలో పంటలకు కొదువ లేదు. ప్రపంచాన్నంతటినీ భారత దేశం భరిస్తుందని శాస్త్రజ్ఞులు పలుకుతున్నారు. అయినా కార్మిక కర్షకులకు తిండిలేని గతి పట్టడం శోచనీయము. తమ శ్రమ వల్ల కూర్పబడ్డ ఫలం షాహుకార్లు అనుభవిస్తూ వుంటే గుట కలు వేస్తూ చూస్తూ వుండవలసిన గతి పట్టింది. భారత దేశపు ఉత్పత్తి దేశంలో వుంటే కార్మిక కర్షకులకు లోటు లేదు. కాని వారి సంపదలు కంపెనీల ద్వారా విదేశాలకు పోతూ వుంటే వారికి మాత్రము అన్నమో రామచంద్రా యని విలపించ వలసిన యవస్థ తప్ప మరేముంది. రోజల్లా కష్టపడ్డా యజమానుల, గుమాస్తాల, సర్దార్ల మోసాలకు లోనై తిండి లేక కంపెనీ కూలీలు అల్లల్లాడి పోతూ వున్నారు.

కంపెనీ కూలీల కష్టాలు.

1. యజమానుల వల్ల—దేశ పరిస్థితులు మారి పోయి వున్నాయన్న వంక మీద కంపెనీ యజమానులు కూలీలకు తక్కువ రేట్లు నిర్ణయించడం, కూలీల జట్లులో పోటీలు పెట్టడం, కూలీ జట్టు నాయకునికి లోపాయకారిగా మామూలు ముట్టచెప్పి కూలీలకు తక్కువ కూలి నిర్ణయించడం మొదలైన మోసాలు చేస్తున్నారు. రోజు కెన్ని గంటలు పని చెయ్యాలో నిశ్చయంలో వుండదు. కాని నాయకుడెన్ని గంటలని చెప్పితే అన్ని గంటలే పని చేస్తారు. అతని ఆజ్ఞను ఎప్పుడూ అతిక్రమించరు. పాపం నాయకుడు విభీషణావతార మెత్తిన సంగతి వారి కేమి తెలుసును. పని రోజూ ఉదయం 7 గంటలకు ప్రారంభమవు తుంది. క్రమంగా రాత్రి 10, 11, 12 గంటల వరకూ కూడా దేకుతూ వుంటుంది. దగ్గర వుండి పనిచేయించే వారికి కావలసినంత విశ్రాంతి. పాపం యీ కష్టజీవులు విశ్రాంతి ఎరుగరు. పని మాత్రం ఆ యా సరకుల మారకం అయిపోయే వరకూ వుంటుంది. తరువాత కూలి యితా తీరుబడిగా మళ్ళీ కన్సైన్‌మెంటు వచ్చు వరకు నోరు తెరుచుకొని వుండవలసినదే. తమ పడిన పాటుకు కూలి చూచుకుంటే వారి కనీస దిన భత్యమునకు కూడా సరిపోదు. అదైనను రొఖ్ఖంగా అప్పుడే రాదు కొన్ని చోట్ల. పైనుంచి బిల్లు శ్యాసై రావాలి. ఇందులో వున్న చిదంబర రహస్యం ఏమిటంటే మళ్ళీ ఆ కంపెనీకి మారకం ప్రారంభమయ్యే వరకూ కూలీలను పైపనుల్లోనికి వెళ్ళకుండా కాళ్ళకు బంధం వెయ్యడమే. కొత్త పని పాత షరతులపైనో లేక యింకా బిగింపుగానో ప్రారంభ మయిన పిదప పాత బిల్లు యిచ్చివేస్తారు. గుమాస్తాల తాంబూలపు మినహాయింపులతో. కొన్నిచోట్ల సున్న చుట్టేస్తారు. అల్లాంటి పరిస్థితుల్లో యింక చెప్పాలా కూలిసోదరుల దురవస్థ. వర్షాకాలంలో వర్షాటంకం వల్ల పని సరిగా నడువదు. పూర్తిగా రోజల్లా పనిచేసిన రోజులకే కూలి యిస్తారు. ఆరోజుల్లో కూలీల అవస్థ మరీ ఘోరంగా వుంటుంది.

2. గుమాస్తాల వల్ల—నిరుద్యోగము ప్రబలిపోయి వున్న రోజులు. అందుచేత విద్యావంతులకు తాము పెట్టుబడి పెట్టి చదువుకున్న శ్రమకు ఫలం కన్పించడం లేదు. ఆస్తి పూర్తిగా కాజేసి చదువుకున్న చిలుక చదువులో స్వతంత్ర జీవన మార్గమునకు ఉపకరించే వృత్తి విద్యల వాసనయే లేదు. అందు చేత జీనాధారము కొరకై ఏ కంపెనీ యజమానినో ఆశ్రయించి అతి కష్టము మీద నిరుద్యోగు లెక్కువై పోటీలున్న కారణమున తక్కువ జీతమునకు ప్రవేశిస్తాడు. కంపెనీలో పని యెక్కువ, జీతం తక్కువ. అసంతృప్తి బయలుదేరి సంపాదనకు తప్పు మార్గాలు వెదుకుతాడు. "రాతిలో కప్ప రాతిలో బ్రతుకక ఏమౌతుంది" అనే వేదాంతముతో, కూలీ జట్టు నాయకుని వలలో వేసికొని కూలీల కూలి మొత్తం నుంచి కొంత మినహాయించి తన అక్కరలు తీర్చు కుంటాడు. లేక పోతే పది రూపాయల గుమస్తా సూట్, బూట్‌లు వెయ్యడానికి డబ్బెల్లా వస్తుంది? సరుకుల మారకమునకు వినియోగించు బండ్ల వాళ్ళ దగ్గర బండికి 0-1-0 లేక 0-2-0 చొప్పున వసూలు చేసు కుంటాడు. పాపము అమాయక కార్మిక వర్గము మళ్ళీ పిలుస్తారో పిలువరో అన్న భయమున ప్రతి దారుణానికి ఊరు కుంటారు. అసలే తక్కువగా గిట్టే మజూరీ గుమాస్తాల వల్ల యింకా తగ్గి పోతుంది.

(3) సర్దార్లవల్ల:—సర్దారంటే కూలీలలోనే చాక చక్యమైన, కొంచెము మాట కారియైన వ్యక్తి. జట్టు నాయకుడు; బంటు, మేస్త్రీ అనే మారు పేర్లు. కంపెనీ యజమానులతోను, గుమాస్తాలతోను కూలీల తరపున కూలి నిర్ణయించడానికి పూనుకుని తన లోపాయకారీ మామూళ్లు, గుమాస్తాల రహస్య పన్నాగాల్లో పడి కూలి సోదరుల గొంతుక కోస్తాడు. తక్కువ కూలి నిర్ణయించి, తన్ను నమ్ముకొని యున్న కూలీలు మల మల మాడినా తన కడుపు నిండితే సరి. పై పెత్తనం చెలాయించి కూలీలచే పని చేయించడం యితని వంతు. కబుర్లు చెప్పతూ కూలీలచే పని చేయించి నందుకు పెద్ద వాటా, మేనేజర్ల గుమాస్తాల వల్ల మామూళ్లు. కాని యీ నాయకుడు తన్ను అంధత్వముగా అనుసరించిన కూలి సోదరులను మోసము చేయుట తగదని గానీ, వారికి తక్కువ కూలి నిర్ణయించుట దుర్మార్గ మని గాని తలపడు.

ఈ విధంగా యెల్లా చూచినా కంపెనీ కూలీల అవస్థ రోజల్లా కష్టపడినా చాల హీనముగా వున్నది. గనుక కూలీలందరూ సంఘాలుగా ఏర్పడి తమ సంఘములను బలపరచుకొని, తమలో పోటీలు మానుకొని తమ కనీస భత్యమును నిర్ణయించుకొని ఎప్పటి కూలి అప్పుడే వసూలు చేసుకుంటే వారికీ కష్టాలూ ఉండవు.

గనుక దేశీయులంతా వృత్తి విద్యలు నేర్పే చదువుల కొరకు ప్రభుత్వాన్ని ఒత్తిడి చెయాలి. కూలీలంతా సంఘాలుగా ఏర్పడి తమ హక్కులను తాము సాధింప కోవాలి.

ఇట్లు
దామిశెట్టి పార్థసారథి అప్పారావు.

చలపల్లి ఎస్టేటు.

క్రిష్ణా జిల్లా చల్లపల్లి ఎస్టేటులో మంగళాపురం, లక్ష్మీపురం, పెద కళ్ళేపల్లి, అన్నవరం మొదలైన 30 గ్రామాలకు మధ్య షుమారు 1500 ఎకరముల విస్తీర్ణము గల అడవి యున్నది. పై గ్రామాల ప్రజలు పశువులను మేపుకొనుట, కట్టె, కంప, పండ్లు మొదలైనవి తెచ్చుకొని జీవించుట అనాది నుండి జరుగుతూ వచ్చింది. ఇది దౌలుమినహాయింపు పోరంబోక. దీని మీద చల్లపల్లి జమీందారు గారికి ఏవిధమైన హక్కు లేదు. చల్లపల్లి ఎస్టేటు వారి కళ్ళు దీని మీద పడ్డాయి. పెద్ద రైతుల కేదో లాభము చూపి వారి నోరు కట్టి 1866 వ సంవత్సరములో పశువునకు ఒక అణా చొ॥ పుల్లరి నిర్ణయం చేశారు. అప్పటిలో నున్న క్రిష్ణా కలెక్టరు గారు సంజాయిషీ అడుగగా ఆ పుల్లరి తమ ఎస్టేటు లాభానికి కాదని, మేత పెరుగుటకు అడ్డముగా వున్న రక్కిస తీయించడానికని స్టేటుమెంటు ఇచ్చారు. పుల్లరి వేశారే కాని నోరు గల వారి దగ్గర వసూలు చేయనే లేదు. కాని తాము అందరి దగ్గర పుల్లరి వసూలు చేసినట్లుగాను, పాలకాయలు, వాక్కాయలు మొదలైన వాటిని అమ్మినట్లుగాను, తమ దగ్గర రికార్డు ఉన్నట్లుగా చెబుతున్నారు. అడవి మీద జమానులను పెట్టి కాపలా కాయించటం మొదలు పెట్టేరు. పెద్ద రైతులకు అడవిని ఉపయోగించుకోవటానికి ఏమీ అడ్డు లేకపోవడం మూలాన ఏది ఎట్లా పోతేమని వూరుకున్నారు. తరువాత జమీందారుగారు అడవిని నెమ్మది నెమ్మదిగా ఆక్రమించి సేద్యముకూడా మొదలు పెట్టేరు. వీరి వెంబడే నోరు గల పెద్ద రైతులు కూడా అదే పని మొదలు పెట్టేరు. వ్యవహార జ్ఞానం లేని చిన్న రైతులు, కూలీలు ఏం జేస్తారు నోరు మూసుకొని కూర్చోక? 1935 లో ఆ అడవిని పోరంబోక రిజిష్టరులో నుండి శేరీ రిజిష్టరులోకి ఏదోవిధంగా మార్పించారు. ఇంత ఘోర అన్యాయం జరుగుతుంటే వేల కొలది ప్రజల సొమ్ము తినే గవర్నమెంటు ఉద్యోగస్థులు ఏం జేస్తున్నారో తెలియదు. కాంగ్రెసు వారు మన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలలో ఉత్సాహం రేకెత్తింది. అడవి ప్రజలదని జమీందారు అన్యాయంగా ఆక్రమించాడని ఆందోళన ప్రారంభించి గవర్నమెంటుకు అర్జీ పంపించారు. తరువాత జమీందారీ ఎంక్వయరీ కమిటీకి డౌళ్ళు, 1890 లో ల్యాండు రిజిస్టరు, సర్వే ప్లాను, 1922 లో డిస్ట్రిక్టు బోర్డు అడవిలోని ఇసుక కావలెనని అడిగినప్పుడు చల్లపల్లి జమీందారుగారు అడవి ప్రజల యొక్క పశువుల నిమిత్తము ఏర్పరుపబడిన దని, కనుక ఇచ్చుటకు వీలు లేదని అచ్చు వేయించి పంచిపెట్టబడిన కరపత్రాన్ని దాఖలు చేసేరు. ఆ పై జెప్పిన రికార్డులలో అడవి పోరంబోక వ్రాసి యున్నది.

ఇటువంటి గో భూములుగా ఉన్న పోరంబోకలను లేఖీరాజు భూములనీ, అనగా పల్లికు రెవెన్యూ నుంచి విముక్తములైన భూములనీ, వాటిని మినహాయించియే జమీ యొక్క పేష్కస్సు నిర్ణయించ బడినదన్న 1802 లో లార్డు క్లయివు చల్లపల్లి జమీందారుకు ఇచ్చిన సన్నదులో వ్రాయబడి యున్నది.

జమీందారీ ఎంక్వయిరీ కమిటీ విచారణ అయిపోయిన తరువాత నుండి కొంతమంది పెద్ద రైతులతో గూడపుతానీచేసి ఎకరం షుమారు రు.400-0-0లు

(మిగతా ప్రక్క పేజీలో)

గ్రంథావలోకనము

భారత దేశమున బ్రిటిష్ రాజ్యతంత్రము.

రచయిత: దిగపల్లి వెంకట శివరావుగారు బి. ఏ. బి. యల్., 320 పేజీలు, వెల రు 1-4-0. పుస్తకాలకు గ్రంథకర్తగారి పేర బెజవాడకు వ్రాయ వలెను.

పదవు లధిష్టించుట, నైతిక పతనానికి కారణమని బెనర్జీ, బి. యన్. శర్మ వగైరాలు ప్రభుత్వంలో, కలసి పోవుట ఉదాహరణ లిచ్చి అందుచేతనే కాంగ్రెసు మహాసభ వాని జోలికిపోక సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలను నడిపినదని గ్రంథ కర్తగారు రుజువు జేశారు. ఉద్యోగు లవలంబించిన నిర్బంధ విధానం, చేసిన హేయమగు పనులను చక్కగా వర్ణించారు. వీనికి గురియైన కాంగ్రెసు వాదులే నేడు అధికారానికి వచ్చారు గాన "పై ఉద్యోగులు తమ ప్రాత నిరంకుశ పద్ధతి మాని, వీరు కాంగ్రెసు చెప్పినట్లు ప్రజాసేవ చేసి పూర్వము చేసిన పాపములకు పరిహారం గావించుకొని ధన్యులగుదురు గాక!" అన్నారు.

కాంగ్రెసు మంత్రిపదవు లంగీకరించిన తరువాత బడ్జెటులలో ప్రజాభ్యుదయానికి గావించిన యేర్పాట్లను వివరించారు. రాజకీయ ఖైదీల విడుదల విషయమై వచ్చిన ప్రతిష్టంభనను గురించి విశద పరచారు. కాంగ్రెసు మంత్రిత్వం స్వీకరించినా, ఉద్యోగులలో లంచగొండితనం యింకా వుందనీ, ప్రజలు వారిచే గౌరవించబడుట లేదనియు, వివరించారు. ఉద్యోగ స్వీకరణ ఫలితంగా వచ్చిన కాంగ్రెసులోని ఛిద్రముల గురించి వ్రాస్తూ స్వార్థపరులు కొందరు కాంగ్రెసులో అపకీర్తికరమైన పనుల చేయుటను నిరశించారు.

"సోషలిస్టు లనువారు జవహర్‌లాల్ నెహ్రూ ప్రభృతుల పరిశుద్ధ సామ్య వాద సిద్ధాంతములను శిరసావహించక ఎవరికి తోచిన సిద్ధాంతములను వారు వెదజల్లుచు శాంతి భద్రతలకు కూడ భంగము కలిగించి తమ సోదరు లగు మంత్రులకు చాల కష్టములు తెచ్చి పెట్టుచున్నారు," అన్నారు.

ఈనాటి ప్రజాందోళన ప్రజా పోరాటం బ్రిటీష్ నిర్మితమైన శాంతి భద్రతలను భంగముచేసి, మంత్రులు తమకునూ కష్టమని తలంచు పొరపాటునే శివ రావుగారునూ చేసారు. నేడు కాంగ్రెసుకున్న బలము ప్రజాందోళనా బలమేననియు, కాంగ్రెసు పదవీ స్వీకరణ ఫలాన్ని, ప్రజలలో యీ బలాన్ని వృద్ధి చేయుటకు వినియోగించి కాంగ్రెసు గమ్యస్థానమైన సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని జేరాలని సామ్య వాదులంటారు. "మేం అధికారంలో వున్నాము. పిటీషన్లు పెట్టుకొని యింకేమీ నోరు మెదపకుండా కూర్చో"మంటారు మంత్రులు. ఇదే కాంగ్రెస్ మిత వాదులకు, సామ్య వాదుల కున్న భేదం. ఇది శివ రావు గారు గుర్తించాలి.

నేడు పరిపాలనా విధానంలో వున్న లోట్లు శివరావు గారు చక్కగా వివరించారు. సోవియట్ రష్యాలో వివిధ రంగాల్లో ప్రజల మేలు కొరకు గావించిన మార్పులను తెలియ జేసి వానిని మన దేశములో నెలకొల్ప వచ్చు నన్నారు. కాని వారే యింకొకచో తెల్పినటుల "యీ కత్తుల బోను" రాజ్యాంగ విధానంలో అవి నెరవేర్చుట సాధ్యం కాదు. అయితే మార్గాన్ని సూచించు లక్ష్యం కావచ్చును.

ఇదంతా మొదటి పరిచ్ఛేదంలో, తక్కిన 8 పరిచ్ఛేదాల్లోనూ, బ్రిటీషువారు వర్తకానికి యిచటికి వచ్చుట, రాజ్యాంగాక్రమణ, ఇంగ్లాండుకు ధన ప్రవాహం, రాజ్యాంగములోని వివిధశాఖల వివరణ, ప్రత్యేక రక్షణలు, వీటి నన్నిటి గురించియు విశదీకరించారు. అనేక ముఖ్యమగు లెక్కలు (statistics) వివరంగా యిచ్చారు.

భాష గ్రాంధికమైనా, సరళంగా చదవరులకు సుబోధకంగా ఉంది. బ్రిటీషువారి పాలనలో భారత దేశానికి పట్టిన అధోగతిన వివరించడానికి, ఇది చాలా ఉపయుక్తమైన గ్రంధం.

*

1938 మద్రాసు వ్యవసాయదార్ల

ఋణ బాధ నివారణ చట్టము.

గ్రథకర్త:—మొరుసుపల్లి హనుమంతరావు బి.ఏ. యం. యల్., గుంటూరు. 64 పేజీలు, వెల 0-4-0.

మద్రాసు కాంగ్రెస్ మంత్రి వర్గం కావించిన వ్యవసాయదార్ల ఋణ పరిష్కార చట్టము, దానికి సంబంధించిన జి. ఓ. లు వివరించుచూ, క్లిష్టమైన చోట్ల ఉదాహరణలతో విశద పరచారు గ్రంధకర్తగారు.

మ. చం.

చల్లపల్లి ఎస్టేటు

(20 వ పేజీ తరువాయి)

కిమ్మతు చేసే అడవిని రు. 200-0-0 లకూ ఇంకా సమయాన్ని బట్టి తక్కువకు చాలా భాగం అమ్మేరు. చాలా భాగం పెద్ద రైతులే కొన్నారు. ఏ అయిదవ వంతో చిన్న రైతులకు దక్కింది. ఈ కొన్న దానికి విక్రయాలు లేవు. ముట్టిన సొమ్ముకు రసీదులు లేవు. జమీందారుకు అడవిని అమ్మటానికి హక్కు లేదని తెలిసినప్పటికీ తాము, జమీందారు ఏకమైతే, బీద రైతులు ఏమి జేస్తారనే ధీమాతో కొన్నారు. కొన్నవారు చెట్లు, కంప కొట్టివేయుచున్నారు. కొద్ది దినాలలో అడవి రూపం కూడా లేకుండా పోతురది. కొంత భూమిలో పైరులు కూడా వేసేరు. ఇంతే కాకుండా అడవితోపాటు మంగళాపురము గ్రామమునకు చెందిన పోరంబోకను కూడా అమ్మి వేశారు. ఇప్పుడు పశువులు నిలవటానికైనా తావు లేదు. ఇందు వల్ల రైతులు, మేకల, గొఱ్ఱెల మీద జీవించే గొల్లలు, పాలకాయలు వాక్కాయలు అమ్ముకొని జీవించే ముత్రాసులు, కట్టె లమ్ముకొని జీవించే మాల, మాదిగలు నిరాధారు లయ్యారు. ఈ అడవిని ఏ కొద్దిమందో ఆక్రమించుకోవటం వలన దాదాపు 30 గ్రామాల ప్రజలంతా బాధపడుచున్నారు. వేరే గత్యంతరం లేక, కాంగ్రెసు మంత్రి వర్గము తమకు సహాయం చేస్తుం దనే ఆశతో పై గ్రామాల ప్రజలు షుమారు 2500 సంతకములతో మంత్రి వర్గానికి మహజరు పంపుకొంటున్నారు. కాంగ్రెసు మంత్రి వర్గం అడవిని ఆక్రమించుకోకుండా తగు చర్య తీసుకోవాలి.

ఈ విషయంలో కాంగ్రెసు కమిటీ, రైతు సంఘములను విచారణ చేసి, అవుసరమైన చర్య తీసుకోవాలి. జిల్లా కలెక్టరు గారు కూడ పూర్తిగ విచారించి అటుపైని అడవిని యెవ్వరు ఆక్రమించుకోకుండానూ, అడవిలో కట్టె, కంప మొదలగునవి కొట్టుట గాని, భూమి దున్నుట గాని, లేక సాగు చేయుట గాని జరుగకుండా ఉత్తరువు ఇవ్వవలయును.

రైతులు, కూలీలు, గమనించాల్సిన విషయం ఒకటి. తమలో వున్న కుల, మత ద్వేషాలను, వ్యక్తి విరోధాలను కట్టిపెట్టాలి. అడవిని కొన్నవారు తమ బంధువులైనా సరే లెఖ్ఖ చెయ్యకూడదు. అంతా కలసి ఒక్క మాట మీద వుంటే కార్యం కొనసాగుతుంది.

ఇట్లు
చంద్ర రాజేశ్వర రావు.

★

కృష్ణాజిల్లా యువజన సంఘం.

స్పోర్ట్సు కమిటీ మీటింగు

16-9-38 తేదీ మధ్యాహ్నం 1 గంటకు గుడివాడలో జిల్లా యువజనసంఘ కార్యాలయమందు స్పోర్ట్సు కమిటీ మీటింగు జరుగును. కమిటీ సభ్యులూ, సలహా నిచ్చుటకు స్పోర్ట్సులో ప్రత్యేక శ్రద్ధ గలవారూ తప్పక దయ చేయ ప్రార్ధన.

కొట్రగడ్డ రాజగోపాలరావు
కన్వీనరు.

సప్తమ ఆంధ్రరాష్ట్ర రైతు మహాసభ తీర్మానములు.

వీరవల్లిలో సమావేశమైన ఆంధ్ర రాష్ట్రీ రైతు మహాసభలో గావింపబడిన తీర్మానముల సారాంశము.

కాంగ్రెసు — రైతు సంఘాలు

"రైతు సంఘాలు ప్రత్యేకంగా ఉండవచ్చునని హరిపుర కాంగ్రెసు గుర్తించి నందులకీ సభవారు సంతసిస్తూ ఉన్నారు. అయినను కొందరు కాంగ్రెసు వాదులు ఆ నిర్ణయమునకు వ్యతిరేకముగా ప్రత్యేక రైతు సంఘాల నిర్మాణమునకు ప్రచారము చేయుచుండుటయు, ఏర్పడినవని చేయుచున్న రైతు సంఘాలను భగ్నం చేయుటకై చేయు ప్రయత్నములను యీ సభవారు నిరసించుచు. యికముందైనను అట్టి భావాలను. ప్రయత్నాలను విరమించుకొని కాంగ్రెసు తీర్మానానుసారముగా రైతు సంఘముల నిర్మాణమునకు తోడ్పడి. దేశములోని వివిధ పోరాట శక్తులను ఐక్యపరచి. జాతీయ స్వాతంత్ర్య పోరాటమును బలపర్చవలసినదిగా కాంగ్రెసు సంఘముల వారిని యీ సభవారు కోరుచున్నారు.

"కాంగ్రెసు యొక్క ప్రస్తుత స్వభావము, కార్యక్రమములను బట్టి కాంగ్రెసు సంస్థ జాతీయైక్య సంఘటనయొక్క షనాదిగా భావించి కాంగ్రెసు ద్వారా యేర్పడిన జాతీయైక్యతను బలపరచి, జాతీయ పోరాటమును ముందుకు తీసుకొని పోవుటకును. కాంగ్రెసుచే అంగీకరించబడిన కార్యక్రమమును కాంగ్రెసు ఆచరణలో పెట్టునట్లు చేయుటకును. రైతు సంఘములు కృషి చేయవలెను. కాంగ్రెసు యెక్కువగా ప్రజా సామాన్య ప్రసిద్ధి అగుటకును, దైనందిన పోరాటములలో పాల్గొనుటకుల చేయుటకును రైతు సంఘ సభ్యులు కాంగ్రెసులో చేరవలెను.

"కాంగ్రెస్‌లో ఉన్న ఐక్యత భగ్నం కాకుండా, జాతీయ లక్ష్యమునకు అనుగుణంగాను, జాతీయ పోరాటమునకు బలకరం గాను ఉండు హక్కులకు—కార్య క్రమమునకు ప్రధానంగా పని చేయవలెను. వివిధ సంస్థలలో కాంగ్రెసు కూడా ఒకటి అనే భావంతో ఉండక, దానినే ఒక ఐక్య సంస్థగా చేసి దాని ద్వారా స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించ వలెనను దృష్టి ఉంచాలి. ఇట్టి దృక్పథంతో కాంగ్రెసుకు వ్యతిరేకంగా గాని, పోటీగా గాని రైతు సంఘములు పని చేయ కూడదు. ఇట్టి దృక్పథంతో చూచిన యెడల ఆంధ్ర రాష్ట్రంలో రైతు—కాంగ్రెసు సంఘముల సహకారమునకు అవకాశము లేకపోలేదు. కొద్దిమంది కాంగ్రెసు వాదులు రైతు సంఘ నిర్మాణమునకు వ్యతిరేకులైనప్పటికీ, వారు కూడ రైతు సంఘ కోర్కెలను వ్యతిరేకించుట లేదు. ఆంధ్ర రాష్ట్రీ కాంగ్రెసు సంఘం ఆంధ్ర రాష్ట్రీ రైతు సంఘపు కనీస కోర్కెల ప్రణాళికను అంగీకరించి యున్నను, రైతు సంఘాభివృద్ధికి శ్రేయస్సుకు కొందరు అడ్డంకులు కల్పించుచున్నారు. కాబట్టి, నేటి మన కర్తవ్యం రైతు సంఘ నిర్మాణమునకు అడ్డంకులుగా నున్న వారి భావములను చేష్టలను సరకు గొనక. కాంగ్రెసుచే అంగీకరింప బడిన ప్రణాళికలోని కోర్కెల కొరకై స్థానిక కాంగ్రెసు—రైతు సంఘాలు కలసి మెలసి కృషి యొనర్చి. కాంగ్రెసు ప్రతిష్టను—జాతీయైక్యతను భంగపరచుచున్న కాంగ్రెసు వాదుల వైఖరిని మార్చుకొనునట్లు ప్రజా సామాన్యపు ఒత్తిడి వారిపై కలుగచేయుచు. కాంగ్రెసు సంఘములకు-రైతు సంఘములకు మధ్య పరస్పర సహకార సామరస్యముల పెంపొందించ వలెను. అందుకు ఉభయ సంఘములను యీ క్రింది కార్య క్రమము అంగీకరించి ఆచరణలో పెట్టవలెనని యీ సభవారు కాంగ్రెసు, రైతు సంఘములను కోరుచున్నారు.

1. అసెంబ్లీ, స్థానిక సంస్థలు మొదలైన ఎన్నికలలో రైతు సంఘములు కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకంగా నిలబెట్టుట గాని, ప్రచారము చేయుటగాని కూడదు. కాని, ప్రత్యక్షముగా గాని పరోక్షముగా గాని రైతు సంఘములకు శతృత్వము చూపుచు రైతుల కోర్కెలకు తత్సాఫల్యమునకు ఆటంకములు కలిగించు వారిని కాంగ్రెసు సంఘము తమ అభ్యర్థులుగా నిలుపరాదు.

2. రైతు సంఘాల దైనందిన ప్రజాపోరాటాలకు కాంగ్రెసు సంఘములు తటస్థభావము చూపక, వారికి సంపూర్ణ సహాయము చేయవలెను.

3. రైతు సంఘ సభ్యులు విరివిగా కాంగ్రెసులో చేరవలెను.

4. కాంగ్రెసు సంఘములో రైతు సంఘ అభిమానులకును, రైతు సంఘములకు తగిన ప్రాతినిధ్య మీయవలెను.

రైతు సంఘాలు— వ్యవసాయ కూలీలు.

"రైతు సంఘాలకును, వ్యవసాయ కూలీలకును మధ్య ఉండవలసిన సంబంధమును గురించి యీ క్రింది సూచనలు అవలంబించవలసినదిగా రైతు సంఘ ప్రతినిధులను ఈసభవారు కోరుచున్నారు.

1. స్థానిక కూలీ—రైతు సంఘముల ప్రతినిధులు తరచుగా కలుసుకొంటూ, ముందు కార్యక్రమం నిర్ణయించుకోవాలి.

2. రైతులకు, కూలీలకు మధ్య తగాదాలు వచ్చిన, వాటిని మధ్యవర్తి సంఘం ద్వారా చేసికొనుటకు రెండు సంఘములూ అంగీకరించాలి. ఇట్టి మధ్యవర్తి సంఘాలలో రెండు సంఘాల నుండి సమాన సంఖ్య గల ప్రతినిధులునూ, కాంగ్రెసు సోషలిస్టు లేక కాంగ్రెసు సంఘ ప్రతినిధియు ఉండవలెను. ఈ సంఘమునకు కాంగ్రెసు, లేక సోషలిస్టు ప్రతినిధియే అధ్యక్షుడుగా ఉండును. ఈ పరిష్కారము రెండు సంఘములవారు విధిగా అంగీకరించినదై యుండాలి.

3. రైతు సంఘ సభలకు వ్యవసాయ కూలీ సంఘం తరపున సోదర ప్రతినిధుల (fraternal delegates)ను ఆహ్వానించు చుండవలెను."

రైతు పోరాటాలు.

రైతాంగము యొక్క కనీస కోర్కెలను కాంగ్రెసు అంగీకరించి, ఆచరణలో పెట్టుటకంగీకరించుట: రైతు సంఘాల ప్రత్యేక నిర్మాణము కాంగ్రెసుచే గుర్తింపబడుట: కాంగ్రెసు మంత్రులు అధికారమునకు వచ్చుట యీ ఘటనలన్నీ ఒకవైపున రైతు ఉద్యమాన్ని బలపరుస్తూంటే, మరొక వైపున దీనిని ధ్వంసము చేయుటకు బ్రిటిషు ప్రభుత్వం, జమీందార్లు, షాహుకార్లు తీవ్రంగా ప్రయత్నించు చున్నందున స్థానిక రైతు పోరాటాలను బలపరచుటకు, వారి వారి సమస్యలపై రైతులను సమావేశ పరచుట, ఆందోళన సాగించుట, ప్రభుత్వానికి, స్థానికాధికారులకు తెలియుజేయుట, అవసరమైనచో ప్రత్యక్ష పోరాటాన్ని సాగించుట—యీ విధులు ప్రతి రైతు సేవకుడును కాంగ్రెసు కమిటీల సహాయంతో, నెరవేర్చవలెనని మహాసభలో మరొక తీర్మానం ఆమోదించబడెను.

జమీందారీ విచారణ కమిటీ.

జమీందారీ పద్ధతి రద్దు చేయబడవలెననియు కాని, యీలోగా జమీన్ రైతుల కనీసపు కోర్కెలను మదరాసు ఎస్టేట్ ల్యాండ్ ఆక్టు గుర్తించునట్లు సదరు ఆక్టును సవరించవలెననియు, ఆం. రా. కాం. జమీన్దారీ ఉపసంఘ నివేదికలో సూచింపబడిన మార్పులనైనను తక్షణమే చట్టసమ్మతం చేయవలెననియు మహాసభ మదరాసు మంత్రి వర్గం వారిని కోరుచూ, ప్రజలలో యీ కనీసపు కోర్కెలను గురించి ప్రచారం చేయుటకై రాష్ట్రీ రైతు సంఘంతో రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ సహకారం చేయవలసినదిగా మరొక తీర్మానం ఆమోదించబడెను.

జమీందారీ దౌర్జన్యము

జమీందారీ ప్రాంతాలలో రైతులపై జమీందార్లు చేయుచున్న దౌర్జన్యములను ప్రభుత్వం అణచుటకు ప్రయత్నం చేయకపోవుటచే స్థానిక అధికారుల నిరంకుశత్వము హెచ్చుచున్నందున యికముందు అట్టి దౌర్జన్యములు జరుగకుండ తగిన చర్య తీసుకొన వలసినదిగా మహాసభ వారు మదరాసు మంత్రి వర్గమును కోరిరి.

మునగాల, చిట్యాల, కొండపర్వ, కంద్రిక అగ్రహారం, కాశీపట్నం, కేశనకుర్రు, భోగోలు మొదలైన ప్రదేశాలలో రైతులు ధైర్యంగా జమీందార్లలోను, ఈనాందార్లతోను పోరాడినందుకు, పోరాడు చున్నందుకు ఆయా ప్రదేశాల రైతులను, రైతు సేవకులను అభినందించుచు తీర్మానించబడినది.

ఋణ పరిష్కారం

రైతులకు తెక్కావీలోన్సు, భూమి తనఖా బ్యాంకులు, కో ఆపరేటివ్ బ్యాంకులు—వీటి ద్వారా ప్రభుత్వం తక్కువ వడ్డీకి దీర్ఘ వాయిదాలమీద ఋణమలిచ్చి, మదరాసు ఋణ పరిష్కార చట్టం రైతులకు నిజంగా ఉపయోగించేలాగు చేయవలెనని మరొక తీర్మానము చేయబడినది.

లంచగొండి తనం.

ప్రభుత్వోద్యోగుల లంచగొండి తనమును నిర్మూలించుటకు ప్రతి జిల్లాలోను కాంగ్రెసు. రైతు, కూలీ సంఘముల ప్రతి నిధులతో గూడిన అనధికార సంఘములను నియమించి, వాటి తీర్పుల ప్రకారం చర్య గైకొనవలసినదని మదరాసు ప్రభుత్వమును ఈ సభవారు కోరుచున్నారు.

రాష్ట్రీ రైతు యాత్ర— పోలీసు నివేదిక.

మదరాసు ప్రభుత్వంచే ప్రచురింప బడిన పోలీసు పరిపాలనా నివేదిక ఆంధ్ర రాష్ట్రీ రైతు యాత్రను గురించి వ్రాయబడిన వాక్యములు, ఈయబడిన లెక్కలు సత్య దూరములుగను. నిందార్హముగను ఉన్నవనియు; ఆంధ్ర రైతు ఉద్యమమును నేరముల శీర్షిక క్రింద చేర్చిన పోలీసు నివేదికను కాంగ్రెసు మంత్రులు అంగీకరించుట విచారకరమనియు; తత్సంబంధమైన భాగములను ఉపసంహరించు కొనవలసినదని ప్రభుత్వమును కోరుచూ తీర్మానింపబడెను.

రైతాంగ కనీసపు కోర్కెలు.

గత సంవత్సరం ఆంధ్రరాష్ట్రీ రైతు సంఘంవారిచే అంగీకరించ బడిన కనీసపు కోర్కెల ప్రణాళికను ఆమోదించుచు, అదనంగా మూడు చిన్న క్లాజులు చేర్చబడెను.

బుడమేటి వరదలు.

బుడమేటి వరదల వల్ల గ్రామములకు ప్రభుత్వంవారు పూర్తి పంట రిమీషన్ నష్ట పరిహారం యిచ్చి, యికముందు వరదలు రాకుండా 1914 వ సంవత్సరం కృష్ణా జిల్లా ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న శ్రీనివాసయ్యంగారి సలహాలను, స్కీమ్‌ను ప్రభుత్వం ఆచరణలో పెట్టవలెనని మరొక తీర్మానం చేయబడెను.

ఇరిగేషన్ స్కీము.

మదరాసు గవర్నమెంటువారు వెంటనే ఇరిగేషన్ స్కీమ్ ఒకటి తయారు చేయించి, మైనర్ ప్రాజెక్టులను కట్టించి, ఆంధ్ర జిల్లాలలోని రైత్వారీ, జమీందారీ గ్రామాల మెరక భూములు సాగుచేయ బడుటకు, ముంపు నష్టం యికముందు కలుగకుండుటకు ఏర్పాట్లు చేయవలసినదిగా సభవారు కోరిరి.

ఇతర తీర్మానాలు.

సామ్రాజ్య వాద యుద్ధాలలో రైతులు పాల్గొనరాదనియు, ఫెడరేషన్ రాకుండా చేయుటకు అవసరమైతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం ఉండవలసి నదనియు; కమ్యూనిస్టు పార్టీపై మదరాసు ప్రభుత్వం నిషేధం తొలగించ వలెననియు; "గాంధీ నీతి మంజరి," "మన్యంలో రైతుల తిరుగు బాటు," "1905 రష్యా విప్లవం" మొదలైన రాజకీయ గ్రంథములపై నిషేధం తీసివేయవలెననియు, క్రిమినల్ లా అమెండుమెంటు చట్టం మొదలైన నిరంకుశ శాసనాలను మదరాసు మంత్రి వర్గం రద్దు చేయవలెననియు తీర్మానింప బడెను.

శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి గారు వచ్చే సంవత్సరమునకు రాష్ట్రీ రైతు సంఘాధ్యక్షులుగాను, చెలసాని వాసుదేవరావు గారు ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకొనబడిరి.

నవశక్తి

ADVERTISE
IN
NAVASAKTI
The Leading Telugu
Socialist Weekly

Printed and Published by M. Annapurniah at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE